
- సొంత పార్టీ నేతల అండతో ఐదేళ్లుగా కబ్జాల పర్వం
- ఆయన చెరలో ఊరుమ్మడి గొర్లదొడ్డి
- పట్టా భూములనూ వదలని వైనం
- చుట్టాలవీ అక్రమంగా హస్తగతం
- మార్కాపురం సమీపంలో విలువైన స్థలాలూ స్వాహా
- సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళనలు


బోడపాడులో వైసీపీ సర్పంచ్ ఆక్రమించిన ఊరుమ్మడి గొర్లదొడ్డి భూమి

మార్కాపురం పట్టణానికి సమీపంలో ఉన్న బోడపాడు గ్రామం అది. గతంలో రూ.లక్షల్లో ఉన్న అక్కడి భూముల విలువ నేడు రూ.కోట్లకు చేరుకుంది. అంతటి కీలకమైన గ్రామానికి అతను సర్పంచ్. గడిచిన ఐదేళ్లుగా అధికారం అండ ఉంది. ఇంకేముంది అది ప్రభుత్వ భూమా, పట్టా భూమా అన్న తారతమ్యం లేకుండా వైసీపీ నేతల అండతో యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడ్డాడు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని బెదిరించడం, అడ్డం తిరిగితే దాడులకు తెగబడటం అలవాటుగా మార్చుకున్నాడు. కొందరు పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులు చేసినా నియోజకవర్గస్థాయి నాయకుడి అండదండలు పుష్కలంగా ఉండటంతో బాధితులనే ఖాకీలు బెదిరించి బయటికి పంపిన దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామస్థుల్లో ధైర్యం వచ్చింది. సర్పంచ్ సాగించిన భూదురాగతాలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. కబ్జాకోరల నుంచి ఆ భూములను విడిపించాలని ఆందోళనలు చేస్తున్నారు.


సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బోడపాడు గ్రామస్థులు

భూ రాబందువు

వైసీపీ సర్పంచ్ అడ్డగోలు ఆక్రమణలు

మార్కాపురం, ఆగస్టు 7 : మండలంలోని బోడపాడు గ్రామానికి ఆయన సర్పంచ్. అంతేగాక గత వైసీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన కీలక నేత అండ ఉంది. దీంతో ఇష్టానుసారం రెచ్చిపోయి భూకబ్జాదారుగా మారాడు. ఐదేళ్లుగా ఆ వైసీపీ సర్పంచ్ సాగించిన దురాగతాలు ప్రస్తుతం వెలుగుచూస్తున్నాయి. తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు రోడ్డెక్కారు. గతంలో అతని అరాచకాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ప్రజల్లో ధైర్యం వచ్చింది. తమకు న్యాయం చేయాలంటూ ఏకంగా సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుటే ఆందోళనకు దిగారు. నేరుగా అధికారులను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బోడపాడు గ్రామంలో సర్వే నెంబర్ 71/1, 71/ఎ, 71/1ఎలలో సుమారు 30.62 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గొర్లదొడ్డి భూమిగా పిలిచే దాన్ని ఏడు దశాబ్దాలుగా గ్రామస్థులు ఊరుమ్మడి అవసరాలకు వాడుకుంటున్నారు. గొర్రెల మందలను అందులో మేపుకునే వారు. అంతేకాక గ్రామానికి చెందిన కొందరు ఎస్సీ సామాజికవర్గం వారు దొడ్లకు వాడుకుంటారు. పంటలు పూర్తయిన తర్వాత గ్రామ రైతులంతా ఆ భూమిలోనే కల్లాలు చేసుకునే వారు. గ్రామస్థులకు అంతటి కీలకమైన భూమిపై సర్పంచ్‌గా గెలిచిన వ్యక్తి కన్నేసి కాజేయాలని ప్రణాళిక రచించాడు. ముందుగా రెండేళ్ల క్రితం సుమారు ఐదు ఎకరాల చుట్టూ కంచె ఏర్పాటు చేశాడు. అందులోకి ఎవరూ వెళ్లకుండా అంక్షలు విధించాడు. దీంతో గ్రామస్థులు ఆ సర్పంచ్‌ను నిలదీసినా బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతేకాక ఆ భూమిని తన పేరుపై మార్పించుకునేందుకు ప్రయత్నించాడు. గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో రికార్డుల్లో మార్పులు చేయకుండా నిలిపివేశారు. కానీ ఇప్పటికీ ఊరుమ్మడి ఆస్తి అయిన ఐదు ఎకరాల భూమి ప్రస్తుతం గ్రామ ప్రజాప్రతినిధి కబంధ హస్తాల్లోనే ఉంది. బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం దాని విలువ ఎంతలేదన్నా సుమారు రూ.10 కోట్లకు పైమాటే.

బంధువుల భూమిని కాజేశాడు

భూఅక్రమాలకు పాల్పడిన ఆ ప్రజాప్రతినిధికి పిల్లనిచ్చిన మామగారిది కూడా అదే ఊరు. దీంతో ఆ సర్పంచ్ మామగారి బంధువుల పొలాలపై కూడా కన్నేశాడు. ఎన్నో ఏళ్ల నుంచి సాగులో ఉన్న ఆయన మామ సమీప బంధువులకు చెందిన సర్వే నెంబర్ 179/1ఏ2లోని 2.19 ఎకరాలను అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడు. రూ.కోట్ల విలువైన ఈ భూమి విషయంలో ఘర్షణలు జరిగాయి. సర్పంచ్‌కు రాజకీయ అండదండలు ఉండటం, అధికారులు వత్తాసు పలకడంతో బాధితులు ఏం చేయలేకపోయారు. అదేవిధంగా ఆ సర్పంచ్ తన మామగారి సొంత తమ్ముళ్లను కూడా వదల్లేదు. పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తుల పంపకాల్లో వచ్చిన పేచీలను అనుకూలంగా మరల్చుకున్నాడు. పెద్దయాచవరం ఇలాకాలోని సర్వే నెంబర్ 3/5లో 2.23 ఎకరాల భూమిని అతని భార్య వరలక్ష్మి పేరున మామ పోరెడ్డి కాశిరెడ్డితో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమిని కాశిరెడ్డి గతంలోనే తన తమ్ముళ్లు పోరెడ్డి ఓబుల్‌రెడ్డి, నందిరెడ్డిలకు స్వాధీన అగ్రిమెంటు రాసిచ్చాడు. అంతేకాక కాశిరెడ్డి కుటుంబానికి వంశపారంపర్యంగా మార్కాపురం ఇలాకాలోని సర్వే నెంబర్ 168/3ఏలో 25 సెంట్లు ఉంది. దానిని అన్నదమ్ములు అందరూ పంచుకోవాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా దాన్ని ఇతరుల వద్ద కాశిరెడ్డి కొన్నట్లు దొంగపత్రాలను సృష్టించి ఆన్‌లైన్‌లో కూడా అతని పేరున మార్పించారు. ప్రస్తుతం దాని విలువ ఎంత లేదన్నా రూ.5కోట్ల పైమాటే. ఎన్ని రకాలుగా బాధితులు ప్రయత్నించినా వారిని పట్టించుకున్న నాథుడే లేడు. ప్రస్తుతం వారంతా తమకు న్యాయం చేయాలంటూ అధికారులను కోరుతున్నారు.

గొర్లదొడ్డి స్థలాన్ని విడిపించాలని ధర్నా

వైసీపీ సర్పంచ్ ముక్కమళ్ల వెంకటరమణారెడ్డి చెరలో ఉన్న గొర్లదొడ్డి స్థలాన్ని విడిపించాలని మండలంలోని బోడపాడు గ్రామస్థులు బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. ఊరు పుట్టినప్పటి నుంచి గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 71లో సుమారు 30 ఎకరాలపైగా ఉన్న ఆ భూమిలో గొర్రెలు తోలుతారని, అదేవిధంగా అన్ని కులాల వారు అక్కడ దొడ్లు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఊరుమ్మడి భూమి కావడంతో పండించిన పంటలను రైతులు నూర్పిడి చేసుకునేందుకు కల్లాలుగా కూడా ఉపయోగించారన్నారు. ఆ భూమిలోనే యువకులు ఆటలు ఆడుకునే వారన్నారు. కానీ ప్రస్తుత వైసీపీ సర్పంచ్ రమణారెడ్డి ఆ భూమిలో 10 ఎకరాల మేర చుట్టూ కంచె ఏర్పాటు చేసుకుని ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. గ్రామస్థులు వారించినా వినడం లేదన్నారు. ఈ విషయమై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు పర్యాయాలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేడని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు ఆ భూమిని సర్వే చేసి సర్పంచి చెర నుంచి విముక్తి కల్పించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.బాలిరెడ్డి, పి.ఓబులరెడ్డి, కె.శ్రీనివాసులు, ఎం.నారపరెడ్డి, బి.రాజయ్య, ఆర్.రామ్‌గోపాల్ పాల్గొన్నారు.


గిద్దలూరులోని హాస్టల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించను

- కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరిక
- గిద్దలూరు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన
- టిడ్కో ఇళ్లు, మల్బరీ సాగు, ఆసుపత్రులు, హాస్టళ్ల పరిశీలన
- చారిత్రక కంభం చెరువును అభివృద్ధి చేస్తామని హామీ

గిద్దలూరు, ఆగస్టు 7: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ఉద్యోగులు ఎలాంటి లోపాలు జరగకుండా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. బుధవారం ఆమె గిద్దలూరు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. బేస్తవారపేట మండలంలోని మోక్షగుండంలో మల్బరీసాగు, చారిత్రక కంభం చెరువును, కొమరోలు మండలంలోని తాటిచెర్లమోటులో సాగులో ఉన్న షేడ్ నర్సరీలను పరిశీలించారు. గిద్దలూరు పట్టణంలో టిడ్కో ఇళ్ల సముదాయాన్ని సందర్శించారు. నిర్మాణం ఎంతవరకు జరిగింది, పనుల పూర్తికి ఎంత సమయం పడుతుంది అన్న విషయాలను టిడ్కో అధికారులను అడిగి తెలుసుకున్నారు. 1,248 గృహాలు నిర్మిస్తున్నామని, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు, మిగతా పనుల పూర్తికి సుమారు రూ.70 కోట్లు అవసరమని టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు వివరించారు. నిధుల విడుదలకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, మార్చి లోపు పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని అన్సారియా తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ, వైద్యసేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం, లోపం ఉండకూడదని డాక్టర్లకు సూచించారు. గంటకు పైగా ఆసుపత్రిలోని అన్ని విభాగాల గదులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడారు.

మల్బరీ సాగుదారులతో ముఖాముఖి

బేస్తవారపేట మండలంలోని మోక్షగుండం గ్రామంలో పలువురు రైతులు సాగుచేస్తున్న మల్బరీ తోటలను కలెక్టర్ పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పట్టు గూళ్లను పరిశీలించారు. ఉద్యాన అధికారుల సూచనలు పాటించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. చారిత్రక కంభం చెరువును ఆమె పరిశీలించారు. పర్యాటకులను ఆకర్షించేలా చెరువును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కొమరోలు మండలంలోని తాటిచర్ల మోటులోని షేడ్ నర్సరీలను కలెక్టర్ పరిశీలించారు. నర్సరీ నిర్వాహకులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆమె వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, జిల్లా ఉద్యానవన అధికారి వై.గోపీచంద్, ఇరిగేషన్ డీఈ జాకీర్‌అహమ్మద్, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఎంపీడీవో హేమలత ఉన్నారు.

వసతి గృహం, రెసిడెన్షియల్ పాఠశాల తనిఖీ

గిద్దలూరులోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల విద్యార్థుల వసతి గృహాన్ని, అలాగే గిరిజన బాలికల హాస్టల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, దుస్తులు ఉతుక్కునేందుకు అవసరమైన ప్లాట్‌ఫారం నిర్మాణం అవసరాన్ని విద్యార్థులు తెలియచేయడంతో వెంటనే వాటిని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తాగునీటి సమస్యను కూడా వెంటనే పరిష్కరిస్తానన్నారు. 6 నెలలుగా వేతనాలు రావడం లేదని ఆయాలు, ఏఎన్ఎంలు కలెక్టర్ దృష్టికి తేగా జీతాలు వచ్చే ఏర్పాట్లు చేస్తానన్నారు. అనంతరం ప్రభుత్వ పట్టుపరిశ్రమ సీడ్ ఫారంను కలెక్టర్ సందర్శించారు. అక్కడి మల్బరీ తోటలను పరిశీలించారు.


ఒంగోలులో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

చేనేతలకు ప్రభుత్వం అండ

ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 7 : చేనేత కార్మికులకు ప్రభు త్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. చేనేత సహకార సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. కార్మికుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను సందర్శించారు. అనంతరం చేనేత కార్మికులను శాలువలతో దామచర్ల సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు ఉదయభాస్కర్, జౌళిశాఖ అభివృద్ధి అధికారి డి.వెంకటేశ్వరరావు, సహాయ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, సంఘ మాజీ అధ్యక్షుడు శేషబాబు, మేడా లక్ష్మీనారాయణతోపాటు ఈతముక్కల, ఉలిచి గ్రామాలకు చెందిన చేనేతలు పాల్గొన్నారు.

నేడు పాఠశాలల్లో ఎన్నికలు

- 2,315 ఎస్ఎంసీ కమిటీలకు నిర్వహణ

ఒంగోలు(విద్య), ఆగస్టు 7 : పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)లను పునర్వ్యవస్థీకరించి నూతన కమిటీల ఏర్పాటుకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. గతంలో తల్లిదండ్రుల కమిటీల పేరుతో ఉన్న వాటిని ప్రస్తుతం ఎస్ఎంసీలుగా



పేరు మార్చి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 2,315 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఈ కమిటీలు ఏర్పాటుకానున్నాయి. ఎన్నికలను ప్రధానోపాధ్యాయులు నిర్వహిస్తారు. చేతులెత్తే విధానం లేదా నోటి ద్వారా సభ్యులను ఎన్నుకుంటారు. అత్యవసరమైతే ఆ రెండు విధానాలను పక్కనపెట్టి రహస్య ఓటింగ్ ద్వారా సభ్యులను ఎన్నుకుంటారు. గతంలో ఎస్ఎంసీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు, పోటీ చేసేందుకు ఇద్దరు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు అర్హులని నిబంధన ఉండేది. అయితే గతేడాది ఆ నిబంధనను తొలగిస్తూ అప్పటి పాఠశాల విద్య డైరెక్టర్ చిన్న వీరభద్రుడు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆ ఉత్తర్వులనే పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ముగ్గురు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు కూడా ఓటు వేసేందుకు, పోటీ చేసేందుకు అర్హులయ్యారు. ఎస్ఎంసీ ఎన్నికల్లో ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులకు 15మంది, హైస్కూళ్లలో 6 నుంచి 10 తరగతులకు 15 మంది, హైస్కూలు ప్లస్‌లో 21మందిని, యూపీ స్కూళ్లలో 1 నుంచి 8 తరగతులకు 24మంది సభ్యులను ఎన్నుకుంటారు. ఎన్నికల నిర్వహణకు ఓటర్లలో కనీసం 50శాతం మంది హాజరుకావాలి. ఒక తరగతిలో వేర్వేరు మీడియం సెక్షన్లు ఉన్నప్పటికీ ఒకే తరగతిగా పరిగణించి ముగ్గురు సభ్యులను మాత్రమే ఎన్నుకోవాలి. ఒక తరగతిలో ఎన్నికయ్యే సభ్యుల్లో ఇద్దరు మహిళలు ఉండాలి. సామాజికంగా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాల వారి నుంచి ఒకరిని, ఎస్సీ, ఎస్టీ, అనాథలు, వీధిబాలలు, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల తల్లిదండ్రుల నుంచి ఒకరిని తప్పనిసరిగా ఎన్నుకోవాలి. సభ్యులుగా ఎన్నికైన వారు తమలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్‌చైర్మన్‌గా ఎన్నుకోవాలి. ఈ ప్రక్రియను గురువారం సాయంత్రమే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.


సర్వేనంబర్ల మాయాజాలంతో భూ ఆక్రమణ

- ఆ స్థలంలో ఎప్పుడో పేదలకు పట్టాలు
- కాలక్రమంలో అమ్మేసిన లబ్ధిదారులు
- తాజాగా వాటి మాటున పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో వైసీపీ నేతల పాగా
- దర్జాగా నిర్మాణాలు

లోపలి పేజీల్లో..

తర్లుపాడు ఎస్ఐపై వేటు

- వీఆర్‌కు పిలిచి ఏఆర్‌కు అటాచ్‌మెంట్
- సెల్ కాన్ఫరెన్స్‌లో నిర్లక్ష్యమే కారణం
- ఆగ్రహించిన ఎస్పీ దామోదర్


తర్లుపాడు ఎస్ఐ సుధాకర్

ఒంగోలు (క్రైం), ఆగస్టు 7 : తర్లుపాడు ఎస్ఐ సుధాకర్‌పై వేటుపడింది. బుధవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ నిర్వహించిన సెల్ కాన్ఫరెన్స్‌లో ఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఎస్పీ చేసిన సూచనలను తిరిగి చెప్పలేకపోయారు. కాన్ఫరెన్స్ అనంతరం తాను చెప్పిన విషయాల గురించి దామోదర్ ప్రశ్నించగా అసలు వివరణ ఇవ్వలేకపోయారు. ఈ నిర్లక్ష్యాన్ని ఎస్పీ సీరియస్‌గా పరిగణించారు. దీంతో సుధాకర్‌ను జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి ఏఆర్‌కు అటాచ్ చేశారు. అలాగే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కురిచేడు ఎస్ఐ శ్రీకాంత్, పర్యవేక్షణ లోపం ఉండటంతో త్రిపురాంతకం సీఐ సుబ్బారావును మంగళవారం ఎస్పీ వీఆర్ పిలిచారు.



చెత్తాచెదారంతో నిండిన పోతురాజుకాలువ

మురుగు పారుదలకు.. దారేది?

ఆంధ్రజ్యోతి ఫోకస్

డ్రైనేజీ కాలువల్లో భారీగా వ్యర్థాలు, పూడికలు

ముందుకు కదలని మురుగునీరు

వెంటాడుతున్న సీజనల్ వ్యాధులు

అధికారులు దృష్టి సారించకుంటే ప్రజారోగ్యంపై ప్రభావం

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 7: ఒంగోలు నగరంలో పారిశుధ్యంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రధాన రహదారులల్లో పారిశుధ్యానికే పరిమితమైన కార్పొరేషన్ అధికారులు ఖాళీస్థలాల వైపు కన్నెత్తి చూడటం లేదు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో మురుగునీరు పేరుకుపోయి పచ్చని పాచితో క్రీడా మైదానాలను తలపిస్తున్నాయి. కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో రోడ్లపై చెత్తను తొలగించడం, కాలువల్లో పూడిక తీత పనులు కొంత మేర జరుగుతుంగా, ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగు నీటిపై పెద్దగా పట్టించుకోకపోవడంతో వ్యాధుల భయం వెంటాడుతుంది. ఇదిలా ఉంచితే పోతురాజు కాలువ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. గతంలో ఆధునికీకరణ పనులు చేపట్టినా, పూర్తి స్థాయిలో నిర్వహించకపోవడంతో చేపట్టిన పనులను గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేయలేకపోవడంతో అవి కాస్త రద్దు అయ్యాయి. దాంతో పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. ఒకవైపు కాలువలో చెట్లు పెరిగి, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగునీరు పారే పరిస్థితి కనిపించడం లేదు. నగరంలోని మురుగునీరంతా ప్రధాన కాలువల నుంచి పోతురాజు కాలువలోకి ప్రవేశించి కొప్పోలులోని మురుగునీరు శుద్ధిజల ప్లాంట్‌కు చేరాల్సి ఉంది. అయితే మురుగు పారుదల సక్రమంగా లేకపోవడం కాలువల్లో, ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి, వ్యర్థాలు చేరడంతో ప్రజల్లో సీజనల్ వ్యాధుల భయం వెంటాడుతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



60 అడుగుల రోడ్డులో పేరుకున్న మురుగు



భాగ్యనగర్‌లో మురుగుతో నిండిన డ్రైనేజీ



రాజీవ్‌గృహకల్పకాలనీలో..



హౌసింగ్‌బోర్డుకాలనీలో ..



కార్పొరేషన్ కార్యాలయం వద్ద..



కొత్తమార్కెట్ వద్ద అధ్వానంగా డ్రైనేజీ కాలువ



శివాలయం వద్ద..

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

మంత్రి స్వామి

వర్ధినేనివారిపాలెం ఉపసర్పంచ్ పార్టీలో చేరిక



మల్లికార్జునరెడ్డికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి స్వామి

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 7 : టీడీపీ కూటమితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం అమరావతిలోని కార్యాలయంలో వైసీపీకి చెందిన వర్ధినేనివారిపాలెం పంచాయతీ ఉపసర్పంచ్ గొంగటి మల్లికార్జునరెడ్డి మంత్రి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనకు స్వామి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నియోజకవర్గంలోని అనేక మంది రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును సీఎం చేయాలన్న సత్సంకల్పంతో తనకు మద్దతు ఇచ్చారన్నారు. ఇప్పటికీ చాలా మంది పార్టీలోకి వస్తున్నారన్నారు. ఇది నియోజకవర్గానికి, గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాలి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చెరువునీరు వెళ్లకుండా అడ్డుకట్ట

మంత్రి స్వామి ఆదేశాలతో కదిలిన అధికారులు

రైతులకు ఉపశమనం



కుంటకు నీరు వెళ్లకుండా కట్టవేయిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

సింగరాయకొండ, ఆగస్టు 7 : మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీకి చెందిన పురిణి వెంకటేశ్వర్లు తన పంట పొలంలో కుంటతీసి పాత చెరువు నుంచి కాలువ ద్వారా సాగు భూములకు వెళ్లే నీటిని మళ్లించుకున్నారు. దీంతో ఐదేళ్లుగా నీరందక చుట్టు పక్కల పొలాల రైతుల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారు గత వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఈ నెల ఒకటో తేదీన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఊళ్లపాలెంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన సందర్భంలో రైతులు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో బుధవారం రెవెన్యూ అధికారులు పంట పొలాల్లోకి వెళ్లి అక్రమంగా నీటిని నిల్వ చేస్తున్న కుంటను పరిశీలించారు. చెరువు నుంచి కాలువ ద్వారా కుంటలోకి నీరు వెళ్లకుండా అడ్డుకట్ట వేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లు, ఆర్ఐ ప్రవీణ్, వీఆర్వో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ పుల్లారావు బాధ్యతల స్వీకరణ

పొన్నలూరు (కొండపి), ఆగస్టు 7 : పొన్నలూరు తహసీల్దార్‌గా యు.పుల్లారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తామన్నారు.



బాధ్యతలు స్వీకరించిన పుల్లారావు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

టంగుటూరు, ఆగస్టు 7 : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనాథ్ బుధవారం తెలిపారు. కౌలు రైతులు సీసీ ఆర్‌సీకార్డులు పొందినప్పుడే వారికి వ్యవసాయపరంగా ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు. మండలానికి 1,000 కార్డులు లక్ష్యంగా కలెక్టర్ నిర్దేశించారని, ఇప్పటికే 320మందికి ఇచ్చామని చెప్పారు. కౌలు రైతులు నేరుగా తహసీల్దార్ లేదా వీఆర్వోకు దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ లాగిన్‌లోకి వస్తుందని, దీని ఆధారంగా పంటసాగు హక్కు పత్రాలు జారీ చేస్తామన్నారు.

పాఠశాలకు సౌండ్‌బాక్స్ బహూకరణ

సింగరాయకొండ, ఆగస్టు 7 : మండలంలోని సోమరాజుపల్లి ప్రాథమిక పాఠశాలకు టీడీపీ గ్రామ అధ్యక్షుడు శీలం సుబ్రహ్మణ్యం బుధవారం సౌండ్‌బాక్స్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.నరసింహరావు, లలితకుమారి శీలం ప్రసాదరావు పాల్గొన్నారు.



సౌండ్‌బాక్స్‌ను అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలి

ప్రకాశంలో జిల్లాలో కందుకూరు, అద్దంకిలను కలపాలి ● 139 బీసీ కులాల జేఏసీ చైర్మన్ శ్రీనివాసులు డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8 : గత వైసీపీ ప్రభుత్వంలో అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన జిల్లాలను మార్చాలని, మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని 139బీసీ కులాల జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఎంసీఏ భవన్‌లో బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటు చేయడం వల్ల ఒంగోలుకు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న కందుకూరు నియోజకవర్గాన్ని 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లూరు జిల్లాలో కలిపారన్నారు. అలాగే 30 కిలోమీటర్లదూరంలో ఉన్న అద్దంకిని వంద కిలో మీటర్లదూరంలో ఉన్న బాపట్ల జిల్లాలో కలపడం దారుణంగా ఉందని విమర్శించారు. అందువల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ఒంగోలులో కలపడంతో పాటు మార్కాపురంను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చినహామీలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు టి.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాల అభివృద్ధి కోసం జేఏసీ చేసే కార్యక్రమాలను సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిరుమామిళ్ళ గోపీకృష్ణయాదవ్, ఒ.వెంకటయ్య, పిన్నిక శ్రీనివాసులు, దూళ్ళ అప్పారావు, జంగాల బాలయ్య, బొల్లవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

మొక్కల పెంపకం పనులు వేగవంతం చేయాలి

● ఏపీడీ వెంకటస్వామి

నాగులుప్పలపాడు, ఆగస్టు 7: ఉపాధిహామీ పథకం నిధులతో పండ్ల తోటలు, ఇతర మొక్కల పెంపకం పనులను వేగవంతం చేయాలని ఏపీడీ పాలేటి వెంకటస్వామి ఆదేశించారు. బుధవారం నాగులుప్పలపాడులోని ఉపాధి హామీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయానికి అనుబంధంగా ఉపాధిహామీ నిధులను అందిస్తుందని, వాటిని రైతులు సక్రమంగా వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఆ నిధులతో పండ్ల తోటల పెంపకం, గ్రామాలలోని రోడ్లకు ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మొక్కల పెంపకం పనులు చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఆయా పనుల ప్రతిపాదనలను జిల్లా కార్యాలయానికి పంపించాలని చెప్పారు. వెంటనే అనుమతులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు నిధులను అందిస్తుందని, ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో రవి, ఈసీ విజయకుమారి, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటస్వామి

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

రేషన్‌షాపులకు మొబైల్ వాహనాలను తొలగించడంపై డీలర్ల హర్షం

మద్దిపాడు, ఆగస్టు 7: మద్దిపాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి బుధవారం రేషన్ డీలర్లు పాలాభిషేకం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ ఉప్పుగుంటూరు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కె.సుమన్ మాట్లాడుతూ రేషన్ షాపులకు మొబైల్ వాహనాలను తొలగించడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యావసర వస్తువులు అందజేయడమే డీలర్స్ లక్ష్యమని చెప్పారు. డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కారుమూడి చింపురయ్య మాట్లాడుతూ డీలర్స్ అందరూ సమష్టిగా ప్రజలకు నిత్యావసర వస్తువులు సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో టి.సుధాకర్‌గాంధీ, నరసింహారావు, మద్దాలి బుజ్జి, శ్రీనివాసరావు, బోయపాటి వెంకట్రావు, రవి ప్రసాద్, హరిబాబు, శోభిరాల హరిబాబు, డీలర్స్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీలర్లు, నాయకులు

తహసీల్దార్‌కు శుభాకాంక్షలు

మద్దిపాడు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను బుధవారం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, రేషన్ డీలర్స్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఆయనను కలిసిన వారిలో ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండవ జయంతబాబు, నరసింహారావు, శుద్ధపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నవ్యాంధ్ర రాష్ట్ర చైతన్య ప్రచారయాత్ర

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 7: స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని నవ్యాంధ్ర రాష్ట్ర చైతన్య ప్రచార కళాయాత్ర బుధవారం ఒంగోలునగరం గాంధీరోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార కళాయాత్ర రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ యువత దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయాలని, రాష్ట్ర రాజధానిలో ఘంటసాల వెంకటేశ్వరరావు భారీ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ఆయన కోరారు. అలాగే ఊరూరా జనవిజ్ఞానం, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, నవ్యాంధ్ర రాష్ట్ర రాజధాని చైతన్య ప్రచార కళాయాత్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చదలవాడ సుబ్బారాయుడు, భయ్యా శేషారావు, పి.కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, శివప్రసాద్, కోటేశ్వరరావు, శంకర్, ఎస్.కే.సుభాని, ఉప్పుగుండూరు వంశీ, అజయ్‌బాబు, కోట చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

అవీ..ఇవీ..

ట్రిపుల్ ఐటీకి 243 మంది విద్యార్థుల కేటాయింపు

ఒంగోలు(విద్య), ఆగస్టు 7: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ ఒంగోలు క్యాంపస్‌కు (ట్రిపుల్‌ఐటీ) రెండవ విడత కౌన్సెలింగ్‌కు 243మంది విద్యార్థులను కేటాయించినట్లు డైరెక్టర్ భాస్కర్‌పటేల్ బుధవారం తెలిపారు. ఒంగోలు క్యాంపస్‌కు మొత్తం 1,035 సీట్లు కేటాయించగా మొదటి విడత కౌన్సెలింగ్‌లో 792 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన 243 సీట్లకు ప్రస్తుతం విద్యార్థులను కేటాయించారు. ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులు ఈనెల 9న ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా, సైనిక ఉద్యోగుల పిల్లలకు కేటాయించిన సీట్లకు కూడా విద్యార్థులను ఎంపిక చేస్తారు. 9న కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు ఈనెల 19,20 తేదీల్లో ఆర్కే. వ్యాలీ క్యాంపస్‌లో రిపోర్టు చేయాలని అయన కోరారు. విద్యార్థులకు ఈనెల 21నుంచి తరగతులు ప్రారంభమవుతాయని డైరెక్టర్ పేర్కొన్నారు.

10లోపు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 7: 108 వాహనాల్లో అత్యవసర మెడికల్ టెక్నీషియన్, పైలెట్/టెక్నీషియన్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మేనేజర్ ఎస్.విజయకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటీకి అర్హత జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్‌సైన్సెస్, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు ఉన్న వారు అర్హులన్నారు. పైలట్‌కు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. 35సంవత్సరాల లోపు వారు అర్హులని ఆయన పేర్కొన్నారు.

మంత్రి లోకేష్ ఆదేశాలపై టీచర్ల హర్షం

ఒంగోలు(విద్య), ఆగస్టు 7 : పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించడంతో పాటు ఆ ఫొటోలు అప్‌లోడ్ కాకుండా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీచేయడం పట్ల తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటును మండల, జిల్లా స్థాయిలో జరపాలని వారు కోరారు. టీచర్ల సర్దుబాటును రాష్ట్ర స్థాయిలో కమిషనరేట్ నుంచి నిర్వహించిన పరిస్థితి లేదన్నారు. ఈ విధానాన్ని విరమించుకోవాలని కోరారు. సర్దుబాటులో దివ్యాంగ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలన్నారు. టీచర్ల సర్దుబాటుకు ముందే ఉద్యోగోన్నతులు ఇచ్చి ఖాళీలను భర్తీ చేయాలని వారు పేర్కొన్నారు.

దోపిడీ కేసులో ఆధారాల సేకరణ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 7: ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన యువకుడు వృద్ధురాలిపై దాడి చేసి బంగారం అపహరించిన కేసులో పోలీసులు పురోగతి సాధించారు. దుండగుడి కీలకమైన ఆధారాలను సేకరించారు. ఈనెల 5న ఒంగోలు నగరం ఏనుగుచెట్టు సమీపంలో గల అకమ్మపాలెంలో పట్టపగలు సుగుణమ్మ అనే వృద్ధురాలికి చెందిన అద్దెకు తీసుకుంటానని చెప్పి ఇంట్లోకి వెళ్లి ఆమె తలపై బలంగా ఆయుధంతో కొట్టి గాయపరిచాడు. దీంతో ఆమె స్పృహ లేకుండా పడిపోవడంతో మెడలో ఉన్న బంగారపు ఆభరణాలు అపహరిచుకెళ్ళిన విషయం విదితమే. ఈక్రమంలో పోలీసులు సాంకేతిక విధానం ద్వారా నిందితుని కీలకమైన ఆధారాలు సేకరించి కేసు దర్యాప్తులో పురోగతి సాధించారు. త్వరలో నిందితుడని పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

ఉద్యాన పంటల సాగుకు చేయూత

టంగుటూరు, ఆగస్టు 7 : ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం చేయూతనందిస్తున్నదని ఏపీవో సుభాషిణి తెలిపారు. మామిడి, జామ, నిమ్మ, సపోటా సాగుకు ఉపాధి హామీ కింద నెలనెలా నీటి సరఫరా, ఎరువులకు మూడేళ్లపాటు నిధులు చెల్లిస్తుందన్నారు. ఇప్పటి వరకు మండలంలోని ఎం.నిడమలూరు, జమ్ములపాలెం, కందులూరులలో ఒక్కొక్కరు, జయవరం నుంచి ఇద్దరు రైతులు 8ఎకరాల్లో పండ్లతోటల సాగుకు మందుకు వచ్చారని, ఎంత మంది వచ్చినా అనుమతిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో కోరారు

వృద్ధులకు అన్నదానం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 7 : వృద్ధులు, అనాథలకు నగరంలోని డొక్కా సీతమ్మ క్యాంటీన్ వద్ద బుధవారం ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించాలి. కంచర్ల దేవన్‌చౌదరి జన్మదినోత్సవం సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్ నిర్వహకులు, జనసేన పార్టీ నాయకుడు జడ బాల నాగేంద్రయాదవ్ మాట్లాడుతూ జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మపేరుతో పేదలకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, పార్శ కోటయ్య, కోటా సుధాకర్, పువ్వాడ సుబ్బయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అన్నదానానికి విరాళం.. ఒంగోలు(కల్చరల్): జనసేన పార్టీ నాయకుడు జడా బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ నిత్యాన్నదాన కార్యక్రమానికి కాపు సంఘ రాష్ట్ర నాయకుడు కోలా ప్రభాకర్ రూ.20 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు.

ముస్లింలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 7: కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిననాటి నుంచి ముస్లింలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌సత్తార్ డిమాండ్ చేశారు. సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా, ముస్లిం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బోర్డులోని 40అంశాలను ఏ విధంగా వక్రీకరిస్తారని ప్రశ్నించారు. మైనార్టీ వర్కర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, మైనార్టీ సంఘం నాయకుడు గౌస్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పెద్దలు వక్ఫ్‌బోర్డు పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మౌలానాఅసద్, అబ్దుల్‌సలార్, కరీముల్లా, అబ్దుల్‌ఖాదర్, ఖాసీం, శర్వాని, హాజీఖాసింసాహెబ్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 7 : మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు రాష్ట్రీయ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కార్యాచరణ ప్రణాళికపై గురువారం నుంచి శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జలజాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జరుగుమల్లి మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులపాటు ఇది కొనసాగుతుందని పేర్కొన్నారు. అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం

కొండపి, ఆగస్టు 7: ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు పండించడం ద్వారా 365 రోజులు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ ఝాన్సీ అన్నారు. మండలంలోని పెరిదేపిలో ఏటీఎం మోడల్ వ్యవసాయంపై రైతులకు బుధవారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దశపర్ణి కషాయం తయారీ విధానాన్ని వివరించారు. దీనివల్ల లద్దె పురుగు, ఇతర చీడపీడలను నివారించుకోవచ్చని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం కూడా పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రంజిత్, ఐసీఆర్‌పీఎస్‌లు గౌతమి, సుజాత, మాలకొండయ్య పాల్గొన్నారు.



కషాయం తయారీని ప్రదర్శిస్తున్న ఎస్ఎఫ్ఏ సిబ్బంది

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

కొండపి, ఆగస్టు 7 : తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ కొండపి సెక్టార్ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి అన్నారు. బుధవారం మండలంలోని వెన్నూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. చిన్నపిల్లలను కేంద్రాలకు పంపాలని తల్లులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



తల్లులకు అవగాహన కలిగిస్తున్న సూపర్‌వైజర్

మల్బరీ రైతులు ఆర్థికాభివృద్ధి చెందాలి

• కలెక్టర్ తమీమ్ అన్సారియా



పట్టుగూళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

బేస్తవారపేట, ఆగస్టు7: మల్బరీ పంటను సాగు చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం ఉదయం బేస్తవారపేట మండలం మోక్షగుండం గ్రామంలో రైతులు ఎ.భారతి, టి.ప్రభుదాస్‌రెడ్డి, టి.పెద్దిరెడ్డి, కె.రఘుపతిరెడ్డి, సి.హెచ్.శ్రీనివాసరెడ్డిలు సాగు చేసిన మల్బరీ పంటను, పట్టుగూళ్లను, షేడ్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె ముఖాముఖీ మాట్లాడారు. పట్టుపరిశ్రమ సాగులో వచ్చే లాభ నష్టాలు గురించి తెలుసుకున్నారు. మోక్షగుండం గ్రామంలో చాలా చక్కగా మల్బరీ సాగు జరుగుతున్నదని, రైతులు అధికారుల సూచనలు పాటించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రైతులను కోరారు. అలాగే రైతుల సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ వెంటనే ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సబ్సిడీలు వచ్చేవిధంగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, వ్యవసాయాధికారి జె.మేర్సీ, ఎంపీడీవో టి.పార్వతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కంభం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

కంభం : చారిత్రాత్మక కంభం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్సారియా తెలిపారు. బుధవారం గిద్దలూరు నియోజకవర్గంలో పర్యటించిన ఆమె మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనతో కలిసి కంభం చెరువును పరిశీలించారు. సముద్రాన్ని తలపించే విధంగా ఉన్న కంభం చెరువు వివరాలను అధికారులు వివరించారు. 5,917 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన ఈ చెరువు కింద సుమారు 7వేల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు. ఈ చెరువులో 2.952 టీఎంసీల నీటిని నిలువ చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం 0.182 టీఎంసీల నీరు ఉన్నట్లు తెలిపారు. చిన్నకంభం తూముకు మరమ్మతులు చేశామని, ఈ చెరువుకట్టను ఆధునీకరించేందుకు రూ.67లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ డీఈ జాకీర్‌అహమ్మద్ వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పర్యాటకులను ఆకర్షించేలా చెరువును అభివృద్ధి చేసేందుకు దృష్టి సారిస్తామని తెలిపారు.

పశువులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

• జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి



మందులను అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు, జేడీఏ బేబీరాణి

తాళ్లూరు, ఆగస్టు 7: ఎదకురాని, తిరగబెట్టే పశువులకు పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా మందులు వాడితే ఉపయోగం ఉంటుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి బేబీరాణి చెప్పారు. మండలంలోని దారంవారిపాలెంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రీయగోకుల్ మిషన్ సౌజన్యంతో పశుగర్భకోశ చికిత్స శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు డాక్టర్ బి.రవికుమార్ మాట్లాడుతూ పశువుల గర్భకోశ వ్యాధులను పరీక్షలు చేసి ముందుగానే గుర్తించి చికిత్స అందించాలన్నారు. శిబిరంలో 48మంది రైతులకు దాణానిచ్చే విత్తనాలు 3కేజీల వంతున అందజేశారు. 70 పశువులకు పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. 40 దూడలకు నులిపురుగు నివారణ మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంచాల వెంకటేశ్వర్లు, తాళ్లూరు, తూర్పుగంగవరం పశువైద్యులు వి.ప్రతాప్‌రెడ్డి, ఎమ్.రాంబాబు, పాడి రైతులు రత్నారెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

పల్లామల్లిలో పొంచి ఉన్న యమపాశాలు

విద్యుత్ సమస్యలపై స్పందించని సిబ్బంది

గ్రామస్థుల భయాందోళన



కొత్త స్తంభానికి మార్చని తీగలు



శిథిలావస్థకు చేరిన కరెంటు స్తంభం



కిందుగా వేలాడుతున్న తీగలు

చీమకుర్తి, ఆగస్టు 7 : గ్రామాల్లో గత కొన్నేళ్లుగా నెలకొన్న విద్యుత్‌సమస్యలు ఆ శాఖ సిబ్బంది పట్టించుకోవడం మానేశారు. దీంతో ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. చీమకుర్తి మండలం పల్లామల్లి గ్రామంలో ప్రజలను కరెంటు సమస్యలు వేధిస్తున్నాయి. గ్రామంలో సబ్‌స్టేషన్ కూడా ఉంది. ఇక్కడ ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, ఇతర సిబ్బంది సేవలందిస్తున్నారు. అయినా గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించే తీరిక దొరక్కపోవటం గమనార్హం. ఈ ప్రాంతంలో పనిచేస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్ ఒంగోలులో నివాసం ఉంటూ చుట్టపు చూపుగా ఇక్కడకు వస్తూ సమస్యలపై ఫిర్యాదు చేయాలన్న అందుబాటులో ఉండటం లేదు. కిందిస్థాయి సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలకు గ్రామస్థులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవటం విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యవైఖరిని తేటతెల్లం చేస్తుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అయినా విద్యుత్‌సిబ్బంది వైఖరిలో మార్పు వస్తుందేమో అని గ్రామస్థులు ఆశిస్తున్నారు. గ్రామంలో రామాలయం సెంటర్‌లో ప్రధాన రహదారి పక్కనే ఉన్న కరెంటు స్తంభం అడుగున తుప్పుపట్టి ఏ క్షణాన అయినా ఇళ్ల మీద ఒరిగిపోయే పరిస్థితి నెలకొని ఉంది. దీనిపక్కనే మరో స్తంభాన్ని ఏర్పాటు చేసినా విద్యుత్‌తీగలను దానికి మార్చపోవటంతో ప్రయోజనం లేక ప్రమాదం అలాగే పొంచి ఉంది. అదేవిధంగా గ్రామంలో పలుప్రాంతాల్లో విద్యుత్ తీగలు జనావాసాల మధ్య చేయి ఎత్తితే అందేవిధంగా కిందకు సాగిపోయి ప్రమాదభరితంగా ఉన్నాయి. తక్షణమే ఆయా సమస్యలను విద్యుత్‌శాఖ పరిష్కరించాలని, సబ్‌స్టేషన్ సిబ్బంది సేవలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు
- చింతల నాగయ్య, గ్రామస్థుడు

మా ప్రాంతంలో విద్యుత్ స్తంభం శిథిలమై ఎపుడైనా పడిపోయేలా ఉంది. దీనికి అమర్చిన తీగలను కొత్తస్తంభానికి మార్చాలని విద్యుత్ సిబ్బందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు మా సమస్యను పరిష్కరించి భయాందోళనలను తొలగించాలని కోరుతున్నాం.

అన్నక్యాంటీన్లకు దాతల చేయూత



ఎమ్మెల్యే దామచర్లకు రూ.లక్ష చెక్‌ను అందజేస్తున్న మండువవారిపాలెం నాయకులు



జనార్దన్‌కు రూ.50వేల చెక్‌ను అందజేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 7 : పేదలకు అండగా నిలిచిన అన్న క్యాంటీన్లకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుంది. రూ.5లకే అన్నం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసి ఈనెల 15 నుంచి ప్రారంభించనుండగా, అందుకోసం నెల రోజుల ముందు నుంచే ఒంగోలులో శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ ఆదేశాలతో, పేదలకు ఆకలి తీర్చాలనే మానవత్వంతో పలువురు ముందుకు వస్తున్నారు. ఈ మేరకు బుధవారం మండవవారిపాలెం మాజీ సర్పంచ్ కారుమూడి వెంకటశ్రీమన్నారాయణ, మాజీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ చౌదరి, గోపి, రవీంద్రనాథ్, కారుమూడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు రూ.లక్ష చెక్కును అందజేశారు. అలాగే ఆర్టీసీ డిపోకు చెందిన కార్మికులు అన్నక్యాంటీన్‌కు తమ వంతు సహకారంగా రూ.50వేలు ఎమ్మెల్యే దామచర్లకు బుధవారం అందజేశారు.

అర్హులైన కౌలు రైతులకు గుర్తింపుకార్డులు

• తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవీణ్ కుమార్

నాగులుప్పలపాడు, ఆగస్టు 7: అర్హులైనవారందరికీ కౌలు రైతు గుర్తింపుకార్డులు అందించనున్నట్లు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నాగులుప్పలపాడు వ్యవసాయశాఖ కార్యాలయంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీపై వీఆర్‌వోలు, వీవోఏ లకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని కౌలురైతులను వీవోఏలు గుర్తించి ఆ వివరాలను వీఆర్‌వోకి అందజేయాలన్నారు. తక్షణమే వీఆర్‌వో గుర్తింపు కార్డులు జారీ చేస్తారని తెలిపారు. 11 నెలలు ఉపయోగంలో ఉండే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను పొందడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందన్నారు. దాంతో పాటు అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. గుర్తింపు కార్డుల ద్వారా భూ యజమాని హక్కులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన చెప్పారు. ఆయా విషయాలపై భూ యజమానులు కౌలు రైతులకు అవగాహన కల్పించి కార్డుల జారీని పూర్తి చేయాలన్నారు. మండల పరిధిలోని 322 మంది కౌలురైతులకు గుర్తింపుకార్డులు అందించినట్లు ఏవో వెంకట్రావు తెలిపారు.

14న మండల సర్వసభ్య సమావేశం

మద్దిపాడు, ఆగస్టు 7: మద్దిపాడు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాకా అరుణ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో శ్రీహరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు సమగ్ర నివేదికతో హాజరుకావాలని ఆయన కోరారు. ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని ఆయన కోరారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 7: ఏడుగుండ్లపాడు వద్ద కారును మోటార్‌సైకిల్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం జరిగింది. ఒంగోలు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి మోటార్‌సైకిల్ వెనుక భాగాన్ని ఢీకొనగా మార్టూరుకు చెందిన ఎల్.ప్రసాద రెడ్డికి గాయాలయ్యాయి.

ఘనంగా చాంపియన్‌కప్ టోర్నమెంట్ ప్రారంభం



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 7: స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలులోని సీఎస్ఆర్.శర్మ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన చాంపియన్‌కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ పోటీలను ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఆటలతో మానసిక వికాసమే కాకుండా దేహదారుఢ్యం కూడా సాధ్యమవుతుందని, విద్యార్థులకు ఇలాంటి పోటీలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. రాయపాటి జగదీష్ మాట్లాడుతూ 7,8,9 తేదీలలో జరిగే ఈ పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, సూర్యకృష్ణ, సురేంద్ర, సాయి, రాము, లోకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

మద్దిపాడు, ఆగస్టు 5: సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు గురువారం నుంచి మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీహరి బుధవారం తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణకు సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఈనెల 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

18న నాగభైరవ పురస్కార ప్రదాన సభ

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 7: నాగభైరవ సాహిత్యపీఠం ఆధ్వర్యంలో సాహిత్య పురస్కార ప్రదాన సభ ఈ నెల 18వ తేదీన జరుగుతుందని సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ సభలో ప్రముఖ సాహిత్యవేత్తలు ఏనుగు నరసింహారెడ్డి, వూటికూరి వర్షప్రసాద్‌లకు సాహిత్య పురస్కారం, వై.ఎస్.కృష్ణేశ్వరరావుకు కళాపురస్కారం, బీరం సుందర రావుకు ఆత్మీయ పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. ప్రముఖులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యే కార్యక్రమంలో సాహిత్యవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని కోరారు.

సర్వేనంబర్ల మాయాజాలంతో ఆక్రమణ

కనిగిరి పరిధిలోని సర్వే నంబరు 432లో 433 పేరుతో ఆక్రమణ

ఆ స్థలంలో ఎప్పుడో పేదలకు పట్టాలు

కాలక్రమంలో వాటిని అమ్మేసిన లబ్ధిదారులు

తాజాగా వాటి మాటున పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో పాగా

ఆ ప్రాంతంలో వైసీపీ నేత నిర్మాణాలు

ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు



432 సర్వేనెంబరులోని జీపుస్టాండు వద్ద అక్రమ కట్టడాలు

కనిగిరి, ఆగస్టు 5 : కనిగిరి ప్రాంతంలో అక్రమార్కులు ఏదో రూపంలో బరితెగిస్తూనే ఉన్నారు. ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు వాటిని కబ్జా చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారం అండతో చేసిన అక్రమాలను ఇప్పుడు అధికారం కోల్పోయినా ఏమాత్రం వెరవకుండా సాగిస్తున్నారు. తాజాగా పట్టా భూమి సర్వే నెంబరుతో రిజిస్ట్రేషన్లు చేయించుకుని దాని మాటున అక్రమంగా ప్రభుత్వ భూమిలోకి చొరబడి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకున్న అధికారే లేరని ప్రజలు విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వైసీపీ నేతలు చేసిన భూ అక్రమాలు, కబ్జాలు అన్నీఇన్నీ కావు. ప్రధానంగా కనిగిరి, పామూరు మండలాల్లో అత్యధికంగా అక్రమాలు జరిగాయి. కనిగిరి నగర పంచాయతీ కాగా, పామూరు మేజరు పంచాయతీ. ఆ రెండు మండలాల్లో భూముల ధరల కు అమాంతం రెక్కలు వచ్చాయి. ఈ క్రమంలో కనిగిరి-కందుకూరు రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ రోడ్డులోని 432 సర్వేనంబరుగల ప్రభుత్వభూమిలో అక్రమాలు వెలుగు చూశాయి. 433 సర్వే నెంబరు పేరుతో రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఆపక్కనే ఉన్న 432 సర్వేనంబర్ భూమిని ఆక్రమించుకుంటున్నారు.



అక్రమ కట్టడం

432 సర్వే నెంబరు ప్రభుత్వ భూమి స్వరూపమిది..

కనిగిరి పట్టణంలోని అటవీశాఖ, రోడ్డు భవనాలశాఖ కార్యాలయాల ఎదురు కందుకూరు రోడ్డు వెంట 432 సర్వే నెంబరులో ఎకరా 42 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. అప్పట్లో కొంతమంది పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుండగా 45 ఏళ్ల క్రితం 3 సెంట్ల లెక్కన వారికి ఇంటి స్థలాన్ని అధికారులు కేటాయించారు. వాటికి పట్టాలు కూడా పంపిణీ చేశారు. అప్పటి నుంచి వారు ఆ స్థలాల్లో నివసిస్తున్నారు. కాలక్రమేణా ఆయా స్థలాల యజమానులు అగ్రిమెంట్ల ద్వారా ఇతరులకు అమ్ముకున్నారు.

433 సర్వేనెంబరు పేరుతో చొరబాటు

కొంతమంది వైసీపీ నేతలు 432 సర్వే నంబరులోని 1.42ఎకరాల భూమిలో 433 సర్వేనెంబరును చూపించి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించినట్లు సమాచారం. 433 సర్వే నెంబరుతో అసలు విస్తీర్ణం కంటే ఎక్కువగా 432లోని డోరు నెంబర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. ఈ రిజిస్ట్రేషన్లు చేయించడం వెనుక జరిగిన అక్రమాలను అధికారులు వెలికి తీయాల్సి ఉంది. ఈ విషయాన్ని తేల్చాల్సిన అధికారులు మిన్నకుండిపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల తప్పిదాలు బయటకొస్తాయనేనా..

ఈ రిజిస్ట్రేషన్ల వెనుక లొసుగులను వెలికితీయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నేతలకు నెలవుగా రెవెన్యూ కార్యాలయాలు మారాయి. రెవెన్యూ అధికారులు కింద స్థాయి నుంచి పైస్థాయి వరకు లక్షలాది రూపాయలు లంచాలు దిగమింగినట్లు ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం 432 సర్వే నెంబరు భూమిలో అక్రమంగా చొరబడి వైసీపీ నేతలు నిర్మాణాలు చేస్తున్నా మున్సిపల్, రెవెన్యూశాఖల ఉన్నతాధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విచారణ చేయిస్తే అధికారుల తప్పిదాలు బయటకొస్తాయన్న భయంతో వారు ముందుకెళ్లడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. జూలై 19న ఆ స్థలంలో వాస్తవాలను నిగ్గుతేల్చాలని రెవెన్యూ అధికారులను కోరామని, వారి నుంచి స్పందన రాలేదని మునిసిపల్ టీపీవో వివేకానంద చెప్పారు.

మున్సిపల్ అధికారులు సర్వే కోరితే నిగ్గు తేలుస్తాం
- ఆర్డీవో జాన్‌ఇర్విన్



కనిగిరి పట్టణంలోని కనిగిరి - కందుకూరు రోడ్డులోని అటవీశాఖ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో వరకు 1.42ఎకరా 432 సర్వే నెంబరు పరిధిలో ఉందని ప్రాథమికంగా గుర్తించాం. సంబంధిత సర్వే స్థలం మున్సిపాల్టీ పరిధిలో ఉంది. అధికారులు రాతపూర్వకంగా కోరితే 433 సర్వే నెంబరు విస్తీర్ణం, 432 సర్వే నెంబరు విస్తీర్ణం తేల్చి హద్దులు నిర్ణయిస్తాం. మున్సిపల్ శాఖాధికారుల నిర్లక్ష్య వైఖరితో కాలయాపన జరుగుతోంది. 432 సర్వే నెంబరు ప్రభుత్వ భూమిలో 45ఏళ్ల క్రితం ప్రభుత్వ పట్టాలు మంజూరు చేసినట్లు వివరాలు సేకరించాం. 432 సర్వే నెంబరులో హద్దులు చూయించి 433 సర్వే నెంబరుతో రిజిస్ట్రేషన్లు జరిగితే అవి చెల్లకపోగా, నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటాం.

విద్యార్థులతో వంట పనులు చేయించడం తప్పు

సంబంధిత అధికారులపై చర్యలు • రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్

ఎర్రగొండపాలెం, ఆగస్టు 7 : ఎర్రగొండపాలెం గురుకుల బాలుర పాఠశాల హాస్టల్‌లో విద్యార్థులతో గత ఆదివారం చపాతీలు, వంట చేయించిన అధికారుల తీరును పూర్తిగా ఖండిస్తున్నామని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యాశంకర్ నాయక్ అన్నారు. ఎర్రగొండపాలెంలోని గురుకుల బాలుర పాఠశాల హాస్టల్‌ను బుధవారం ఆయన స్థానిక అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలలో నేరుగా 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఆదివారం 9 వ తరగతి విద్యార్థులమంతా షిఫ్టు పద్ధతిలో వంటమాస్టర్లకు వంటగదిలో పనులు చేస్తున్నది వాస్తవమే అని కమిషన్ సభ్యులకు తెలిపారు. వంట సిబ్బంది తక్కువగా ఉన్నందున ప్రతి ఆదివారం మాతో పనులు చేయిస్తున్నారని విద్యార్థులు కమిషన్ ఎదుట తెలిపారు. కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై స్థానిక తహసీల్దారు నివేదిక తయారు చేసి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌కు, మానవ హక్కుల కమిషనర్‌కు, ప్రభుత్వానికి బాధ్యులపై నివేదిక పంపుతారని, సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు ఎర్రగొండపాలెంలోనే కాదు, రాష్ట్రంలో కూడా ఎక్కడ వర్కర్లు లేరని గిరిజన విద్యార్థుల ద్వారా మళ్లీ ఈ సంఘటనలు వంటలు చేయించే విషయం పునరావృతం అయితే ప్రభుత్వం తరపున కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు సక్రమంగా చదువు చెప్పండి

9వ తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు సబ్జెక్టులు సక్రమంగా పుస్తకాలలో చూచి చదవలేక పోతున్నారని, ఇంగ్లీషు, తెలుగు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్యను బోధించాలని కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ ఆదేశించారు. గిరిజనులకు మంచి విద్యా అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం గురుకుల పాఠశాలలు స్థాపించారని, మీరు శ్రద్ధగా చదువుకోవాలని, మీరు చదువుకోకుండా తల్లిదండ్రులను మోసం చేయవద్దని విద్యార్థులకు సూచించారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎం. హరిబాబు, డీఎల్‌డీవో సాయికుమార్, సర్పంచి అరుణాబాయ్ పాల్గొన్నారు. అనంతరం హాస్టల్ వంటగదిలో వంటలను పరిశీలించారు.


తాటిచెర్లమోటులో షేడ్‌నెట్ నర్సరీని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

రైతులకు నాణ్యమైన నారును అందివ్వాలి

కొమరోలు, ఆగస్టు7: షేడ్‌నెట్ నర్సరీల ద్వారా రైతులకు నాణ్యమైన శ్రేష్టమైన నారును ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. మండలంలోని తాటిచర్ల మోటులోని షేడ్ నర్సరీలను బుధవారం ఆమె పరిశీలించారు. నర్సరీ నిర్వాహకులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీల్లో ఆధునిక మేలు జాతి రకం విత్తనాలను, ప్రభుత్వ అనుమతి పొందిన నాణ్యమైన విత్తనాలను సేకరించి పెంచాలన్నారు. నారు తీసుకునే రైతుల వివరాలను నమోదుచేయాలన్నారు. నర్సరీలు ప్రభుత్వ అనుమతి తీసుకుని పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, గిద్దలూరు ఏడీఏ బాలాజి నాయక్, అధికారి విష్ణు ప్రియా పాల్గొన్నారు.

మల్బరీ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

బేస్తవారపేట,ఆగస్టు7: మల్బరీ పంటను సాగు చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. బుధవారం ఉదయం బేస్తవారపేట మండలంలోని మోక్షగుండం గ్రామంలో రైతులు ఎ.భారతి, టి. ప్రభుదాస్‌రెడ్డి, టి.పెద్దిరెడ్డి, కె.రఘుపతిరెడ్డి, సి.హెచ్.శ్రీనివాసరెడ్డిలు సాగు చేసిన మల్బరీ పంటను,పట్టు గూళ్లను,షేడ్‌లను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో ఆమె ముఖాముఖి మాట్లాడారు. పట్టుపరిశ్రమ సాగులో వచ్చే లాభ నష్టాలు గురించి తెలుసుకున్నారు. మోక్షగుండం గ్రామంలో చాలా చక్కగా మల్బరీ సాగు జరుగుతున్నదని, రైతులు అధికారుల సూచనలు పాటించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె రైతులను కోరారు. అలాగే రైతుల సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ వెంటనే ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సబ్సిడీలు వచ్చేవిధంగా కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, వ్యవసాయాధికారి జె.మేర్సీ, ఎంపీడీవో టి.పార్వతి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


బేస్తవారపేటలో పట్టు గూళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా


కంభం చెరువు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కంభం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

కంభం : చారిత్రాత్మక కంభం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. బుధవారం గిద్దలూరు నియోజకవర్గంలో పర్యటించిన ఆమె మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనతో కలిసి కంభం చెరువును పరిశీలించారు. సముద్రాన్ని తలపించే విధంగా ఉన్న కంభం చెరువు వివరాలను అధికారులు వివరించారు. 5,917 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన ఈ చెరువు కింద సుమారు 7వేల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు. ఈ చెరువులో 2.952 టీఎంసీల నీటిని నిలువ చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం 0.182 టీఎంసీల నీరు ఉన్నట్లు తెలిపారు. చిన్నకంభం తూముకు మరమ్మతులు చేశామని, ఈ చెరువుకట్టను ఆధునీకరించేందుకు రూ.67లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ డీఈ జాకీర్‌అహమ్మద్ వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పర్యాటకులను ఆకర్షించేలా చెరువును అభివృద్ధి చేసేందుకు దృష్టి సారిస్తామని కలెక్టర్ తెలిపారు.


అన్నదాన సత్రానికి తాళాలు వేసిన దాతలు

అన్నదాన సత్రానికి తాళం

త్రిపురాంతకం, ఆగస్టు 7: తాము అంతా కలిసి చందాలు వసూలు చేసి నిర్మాణం చేపట్టిన అన్న సత్రాన్ని విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సత్రానికి తాళం వేసిన సంఘటన బుధవారం జరిగింది. బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయ సమీపంలోని ఆనంద నిలయం అన్నసత్రంను విక్రయిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దాని నిర్మాణానికి 1995లో సహకరించిన దాతలు విశ్రాంత వీఆర్వోలు ఎన్.నాగేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, పలువురు చందాదారులు సత్రానికి తాళం వేశారు. సత్రాన్ని అమ్మే హక్కు, కొనే హక్కు ఎవరికీ లేవని తేల్చి చెప్పారు. సత్రం నిర్వహణకు కావాలంటే మళ్లీ చందాలు వేస్తాం కానీ విక్రయించడానికి ఒప్పుకునేది లేదన్నారు. ప్రతి శుక్రవారం అన్నదానం నిర్వహించాల్సి వస్తే తామే వచ్చి తాళాలు తీసి అన్నదానం నిర్వహిస్తామని అన్నారు. సత్రానికి కొత్తగా కమిటీ ఏర్పాటు చేసి అన్నదానం నిర్వహించే బాధ్యత తీసుకుంటామన్నారు.


తుంటిమార్పిడి శస్త్రచికిత్స చేసిన రోగితో జీజీహెచ్ వైద్యులు

జీజీహెచ్‌లో అరుదైన తుంటి మార్పిడి శస్త్రచికిత్స

మార్కాపురం, ఆగస్టు 7: మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో బుధవారం అరుదైన తుంటి మార్పిడి శస్త్ర చికిత్సను ఇద్దరు రోగులకు విజయవంతంగా నిర్వహించారు. అధిక ప్రమాదస్థాయి కలిగిన ఆపరేషన్ అయినా వైద్యులు ధైర్యంగా చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి వివరాల మేరకు.. జి.అంకమ్మ, ఎస్.రామకృష్ణలకు తుంటి ఎముకలు విరిగాయి. వీరిద్దరూ మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేరారు. వీరికి ఎముకలు, కీళ్ల విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వీరాంజనేయ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోరంజన్‌లు శస్త్రచికిత్స నిర్వహించారు. వారికి మత్తు వైద్యులు, అసోసియేట్ ప్రొఫెసర్ గౌతమి ప్రియ, వేణుగోపాలరావులు సహకారం అందించారు. అంతేకాక శస్త్రచికిత్సకు అవసరమైన సామగ్రిని సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజమన్నార్‌లు సమకూర్చారు. శస్త్రచికిత్స అనంతరం ఇద్దరు రోగులను నడిపించడం కూడా జరిగిందని తెలిపారు. ఎముకల శస్త్ర చికిత్సలకు సంబంధించి ఈ ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు వెళుతున్నారని డాక్టర్ సావిత్రి తెలిపారు. మార్కాపురం జీజీహెచ్‌లో అన్ని రకాల శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే కందులను కలిసిన తహసీల్దార్


ఎమ్మెల్యే కందులకు పూలమొక్కను అందిస్తున్న చిరంజీవి

మార్కాపురం, ఆగస్టు 7: మార్కాపురం తహసీల్దార్ కె.చిరంజీవి బుధవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 5వ తేదీన తహసీల్దార్‌గా చిరంజీవి బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి పట్టణ, మండల పరిధిలోని పలు రెవెన్యూ సమస్యలను తహసీల్దార్ చిరంజీవి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై వచ్చే ప్రజలకు నిర్దిష్ట సమయంలోగా పరిష్కారం చూపాలన్నారు. గతంలో మార్కాపురంలో జరిగిన భూఆక్రమణలు, కబ్జాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ సమస్యలను నూరు శాతం పరిష్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు.

విధుల్లో చేరిన నూతన తహసీల్దారు

త్రిపురాంతకం, ఆగస్టు 7: మండల నూతన తహసీల్దారుగా జి.శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల కోసం వచ్చిన బి.రామకృష్ణ శివప్రసాద్ నెల్లూరు జిల్లాకు తిరిగి వెళ్లగా రాజధాని అమరావతిలోని సచివాలయం ఫిర్యాదుల విభాగంలో పని చేస్తున్న జి.శ్రీనివాస్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. విధుల్లో చేరిన తహసీల్దారు వెంటనే డీటీ, ఆర్ఐ, వీఆర్వోలతో పలు అంశాలపై సమావేశం నిర్వహించారు.

బాధ్యతల స్వీకరణ

గిద్దలూరు టౌన్, ఆగస్టు 7 : గిద్దలూరు తహసీల్దార్‌గా ఆంజనేయరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సెక్రటరియేట్ నుంచి ఆయన బదిలీపై గిద్దలూరు వచ్చారు. గిద్దలూరులో ఎన్నికల ముందు విధులు నిర్వహించిన సిద్దార్థ గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు.

క్రీడల్లోనూ రాణించాలి

పెద్ద దోర్నాల, ఆగస్టు 7: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తద్వారా మానసిక ఉల్లాసం, నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 62 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

కొమరోలు, ఆగస్టు7 : మండలంలోని 62 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం నిర్వహించనున్నట్లు ఎంఈవోలు బొర్రా వెంకటరత్నం, కావడి వెంకటేశ్వర్లు తెలిపారు.ఎస్ఎంసీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఎన్నికైన అభ్యర్థుల జాబితాను ఎంఆర్సీకి తెలియజేయాలన్నారు

విద్యార్థులతో వంట పనులు చేయించడం తప్పు

సంబంధిత అధికారులపై చర్యలు

రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్

ఎర్రగొండపాలెం, ఆగస్టు 7 : ఎర్రగొండపాలెం గురుకుల బాలుర పాఠశాల హాస్టల్‌లో విద్యార్థులతో గత ఆదివారం చపాతీలు, వంట చేయించిన అధికారుల తీరును పూర్తిగా ఖండిస్తున్నామని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యాశంకర్ నాయక్ అన్నారు. గురుకుల బాలుర పాఠశాల హాస్టల్‌ను బుధవారం ఆయన స్థానిక అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలలో నేరుగా 9 వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఆదివారం 9 వతరగతి విద్యార్థులమంతా షిఫ్ట పద్ధతిలో వంటమాస్టర్లకు వంటగదిలో పనులు చేస్తున్నది వాస్తవమే అని కమిషన్ సభ్యులకు తెలిపారు. వంట సిబ్బంది తక్కువగా ఉన్నందున ప్రతి ఆదివారం మాతో పనులు చేయిస్తున్నారని విద్యార్థులు కమిషన్ ఎదుట తెలిపారు. కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై స్థానిక తహసీల్దారు నివేదిక తయారు చేసి రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషనర్‌కు, మానవ హక్కుల కమిషనర్‌కు, ప్రభుత్వానికి బాధ్యులపై నివేదిక పంపుతారని, సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు ఎర్రగొండపాలెంలోనే కాదు, రాష్ట్రంలో కూడా ఎక్కడ వర్కర్లు లేరని గిరిజన విద్యార్థుల ద్వారా మళ్లీ ఈ సంఘటనలు వంటలు చేయించే విషయం పునరావృతం అయితే కమిషన్‌గా ప్రభుత్వం తరపున కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్

విద్యార్థులకు సక్రమంగా చదువు చెప్పండి

9వ తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు సబ్జెక్టులు సక్రమంగా పుస్తకాలలో చూచి చదవలేక పోతున్నారని, ఇంగ్లీషు, తెలుగు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్యను బోధించాలని కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ ఆదేశించారు. గిరిజనులకు మంచి విద్యా అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం గురుకుల పాఠశాలలు స్థాపించారని, మీరు శ్రద్ధగా చదువుకోవాలని, మీరు చదువుకోకుండా తల్లిదండ్రులను మోసం చేయవద్దని విద్యార్థులకు సూచించారు.10 వ తరగతి విద్యార్థులు కష్టపడి చదువుకొని విద్యాసంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎం. హరిబాబు, డీఎల్‌డీవో సాయికుమార్, సర్పంచి అరుణాబాయ్ పాల్గొన్నారు. అనంతరం హాస్టల్ వంటగదిలో వంటలను పరిశీలించారు.

ఉపాధ్యాయుడి నిర్వాకం

బెత్తం కొట్టడంతో కంటిమీద గాయం

చూపు పోగొట్టుకున్న విద్యార్థి

పొదిలి, ఆగస్టు 7 : ఉపాధ్యాయుడి నిర్లక్ష్యంతో విద్యార్థి చూపు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పదిరి రామలక్ష్మణ్‌ను లెక్కల మాస్టర్ సురేష్ బెత్తంతో కొట్టడంతో ప్రమాదవశాత్తు కంటికి గాయమయింది. సంఘటన జరిగిన వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థి రామలక్ష్మణ్‌కు తాత్కాలిక వైద్యం అందజేశారు. అయితే రెండో రోజు కంటిచూపు సరిగా కనపడక పోవడంతో విద్యార్థి తల్లిదండ్రులకు తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని ప్రశ్నించగా కావాలని జరగలేదని,విద్యార్థికి అయ్యే వైద్యఖర్చులు తానే భరిస్తానని భరోసా కల్పించారు. దీంతో తల్లిండ్రులు ఒంగోలు వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. అయితే వైద్యులు కంటినరాలు బాగా దెబ్బతిన్నాయని శస్త్ర చికిత్స చేయాలని, అయినప్పటికి చూపు వస్తుందో లేదో చెప్పలేమని బదులిచ్చారు. విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని సంప్రదించగా తనకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఒంగోలులోని మీకోసంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇప్పటికైనా చూపు కోల్పోయిన విద్యార్థికి మెరుగైన వైద్యంఅందించాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.

హెచ్ఎం వివరణ

ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతిని వివరణ కోరగా విద్యార్థులు పాఠశాల బయటకు వెళుతుండగా ఆ విద్యార్థికి ఏదో తగిలిందని, ఆ సమయంలో ఆ ఉపాధ్యాయుడు అక్కడే ఉన్నాడని, ఇది ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని పాఠశాల తరపున విద్యార్థికి కొంత ఆర్థిక సహాయం చేశామని తెలిపారు.

కౌలు గుర్తింపు కార్డులను కలిగి ఉండాలి


కంభంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తున్న వ్యవసాయాధికారిని స్వరూప

కంభం, ఆగస్టు 7 :మండలంలోని రైతులు, కౌలు ద్వారా వ్యవసాయం చేస్తున్న రైతులు ఆయా గ్రామపరిధిలో ఉన్న రెవెన్యూ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారిని కలిసి కౌలు గుర్తింపు కార్డులు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారిని స్వరూప సూచించారు. దీని వలన రైతులకు సకాలంలో ప్రభుత్వ పథకాలు, సబ్సిడీతో వస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం వాటిల్లినపుడు ప్రభుత్వం పంట నష్టం బీమా కింద నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, కౌలు రైతులను గ్రూపులుగా చేసి వారికి బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందజేస్తామన్నారు. రైతులందరూ ఆధార్‌కార్డు, పొలం పత్రాలను తీసుకుని రెవెన్యూ అధికారిని కలవాలన్నారు. పొలం యజమానులకు 2019 కౌలు రైతుల చట్టం ప్రకారం ఎటువంటి నష్టం జరగదన్నారు.

పంటలను ఈ క్రాప్ చేయించుకోవాలి

కొమరోలు, ఆగస్టు7: రైతులు సాగుచేస్తున్న పంటలను కచ్చితంగా (ఈ క్రాప్) పంటనమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజశ్రీ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఈ క్రాప్, కౌలు కార్డుల నమోదుపై అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు సాగుచేస్తున్న ప్రతి పంటను వ్యవసాయ సిబ్బందితో నమోదుచేయించుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వం నుంచి అందే రాయితీలు, పంట బీమా అందుతుందన్నారు. తహసీల్దార్ మల్లికార్జున నాయుడు మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు నమోదుపై మాట్లాడారు. మండలంలో 950 కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్దేశించింది, కాని ఇప్పటికి 555 మందికి మాత్రమే ఇచ్చామని, మిగిలిన వారికి త్వరగా ఇచ్చే విధంగా వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది కృషిచేయాలన్నారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకారంలో అండాళమ్మ

ఆండాళమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 7: స్థానిక లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో అండాళమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అండాళమ్మ అమ్మవారి జన్మనక్షత్రం పురష్కరించుకుని అమ్మవారి మూలవిరాట్, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, అలంకరణ, అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన

పెద్ద దోర్నాల, ఆగస్టు 7: మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో అటవీ యేతర ప్రాంతాల్లో మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంటు నీలానాయక్, టీవోఎఫ్ఐ ప్రతాప్, ఉద్యాన అధికారి ఆదిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సురేష్ బాధ్యతల స్వీకరణ

కొనకనమిట్ల, ఆగస్టు 07 : మండల నూతన తహసీల్దార్‌గా ఆవుల సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కనిగిరి తహసీల్దార్‌గా పని చేశారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే పలువురు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు.

చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట,ఆగస్టు7: స్థానిక అచ్చిరెడ్డి కాలనీలో బుధవారం జరిగిన టీడీపీ నాయకుడి కుమారుడు జన్మదిన వేడుకల్లో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని ఆశీర్వదించారు. అర్ధవీడు మండలానికి చెందిన టీడీపీ నాయకులు నాగిరెడ్డి పాండు రంగారెడ్డి(సాగర్) కుమారుని జన్మదిన వేడుకలు,నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈకార్యక్రమంలో కంభం,బేస్తవారపేట,అర్ధవీడు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కంభం, ఆగస్టు 7 : కేంద్ర ప్రభుత్వరంగ పోస్టల్‌శాఖ ద్వారా ప్రజలకు అమలు చేస్తున్న పొదుపు, సంక్షేమ, బీమా పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మస్తాన్‌వలి తెలిపారు. బుధవారం కంభం పోస్టాఫీసు వద్ద డాక్ చౌ పోల్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా మండల్ దివస్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 7: మండల్ దివస్‌ను స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిందేశ్వరి ప్రసాద్ మండల్ చిత్రపటానికి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి పీఎల్ ప్రసాద్ , బీసీ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రంగస్వామి, సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

505 బస్తాల బియ్యం పట్టివేత


విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ

బేస్తవారపేట,ఆగస్టు7: అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలోని బేస్తవారపేట వద్ద అక్రమంగా తరలిస్తున్న బియ్యం లారీని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. కంభం మండలం ఎర్రబాలెం గ్రామంలో లారీలో 505 బస్తాల బియ్యంను లోడ్ చేసుకోని నెల్లూరు వెళుతుండగా సమాచారం అందుకున్న అధికారులు బేస్తవారపేట హైవేలో మాటువేసి పట్టుకున్నారు.పట్టుకున్న బియ్యాన్ని కంభం గోడౌన్‌లో నిల్వ చేసి,లారీని బేస్తవారపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ దాడిలో విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీఎస్ అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య


చెట్టుకు వేలాడుతున్న యువకుడి మృతదేహం

పెద్ద దోర్నాల, ఆగస్టు 7: కుటుంబ కలహాలు, అప్పుల బాధతో మనస్తాపం చెందిన జమ్మిదోర్నాల గ్రామానికి చెందిన వడ్డెల్లి కోటేంద్ర(28) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ ఘటన మండలంలోని దోర్నాల తీగలేరు కాలువ పక్కన వ్యవసాయ పొలాల్లో బుధవారం వెలుగుచూసింది. ఎస్సై అంకమరావు తెలిపిన కథనం ప్రకారం కోటేంద్ర అతని భార్యకు తరచూ గొడవలు జరిగేవి. దీంతో భార్య ఏడాదిగా భర్తకు దూరంగా ఉంటోంది. పైగా వ్యవసాయంలో అప్పులు కావడంతో మనస్తాపం చెంది బుధవారం ఉదయం మోటారుబైక్‌పై జనసంచారం లేని ప్రాంతంలోని పొలంలో వేపచెట్టుకు నైలాను తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీడియోగ్రాఫర్లు

గిద్దలూరు, ఆగస్టు 7 : 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు పూర్తయి 3 నెలలు గడుస్తున్నా ఇంతవరకు వేతనాలు చెల్లించలేదని వీడియో గ్రాఫర్లు గిద్దలూరు వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందచేశారు. 3 నెలలు గడిచినా వేతనాలు రాకపోవడంతో అప్పుల పాలు అయి ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వేతన బకాయిలను చెల్లించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు భాను ప్రభాకర్, మల్లి, మస్తాన్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నాగమయ్య ఆలయంలో చోరీ


గుడికి దూరంగా పడేసిన నాగమయ్య గుడి హుండీ

రూ.50వేలు, వెండి ఆభరణాలు అపహరణ

మార్కాపురం రూరల్, ఆగస్టు 7: మండలంలోని బోడపాడు గ్రామంలోని నాగమయ్య ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది.స్థానికుల సమాచారం మేరకు గుడిలో లోపలికి ప్రవేశించి లోపల ఉన్న హుండీని దుండగులు అపహరించారు. హుండీలో ఉన్న సుమారు రూ.50వేల నగదు తీసుకుని హుండీని నాగమయ్య ఆలయానికి సుమారు 200 మీటర్ల దూరంలో చెట్లలో పడేసి వెళ్లారు. హుండీలో నగదుతో పాటు ఆలయంలో ఉన్న సుమారు లక్ష విలువ చేసే వెండి ఆభరణాలను దోచుకెళ్లినట్లు తెలిపారు. ఆలయ నిర్వాహకుల సమాచారంతో రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ తన సిబ్బందితో కలిసి చోరీకి గురైన ప్రాంతాన్ని పరిశీలించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న పూజారులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 7: మండలంలోని దంతెరపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవస్థాన ద్వితీయ వార్షిక వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక ఆకుపూజలు, అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ పూజారులతో పూర్ణకుంభంతో దేవస్థాన కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ బుడత మధుసూదన్, టీడీపీ నాయకులు కడియం శేషగిరి, నంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గోవుల పట్టివేత


పట్టుకున్న గోవుల లారీతో బీజేపీ నేతలు

గిద్దలూరు, ఆగస్టు 7: విజయవాడ నుంచి హిందూపురానికి అక్రమంగా గోవులను తరలిస్తుండగా స్థానిక బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. లారీలో గోవులను తరలిస్తుండగా అనుమానం వచ్చిన స్థానిక నాయకులు గిద్దలూరులో లారీని అడ్డుకుని తాళాలు తీపించారు. అందులో 60 గోవులు కనిపించడంతో వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. గోవులను కబేళాలకు తరలిస్తున్నారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. దాంతో అధికారులు లారీలోని గోవులను స్థానిక మార్కెట్‌యార్డుకు తరలించి విచారణ మొదలుపెట్టారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, నియోజకవర్గ కోకన్వీనర్ గుమ్మా రాముడు, రూరల్ మండల అధ్యక్షులు కె.తిరుపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాలు ఉపయోగించుకోవాలి


ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామిరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 7: ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్, మాజీ జడ్పీటీసీ కందుల రామిరెడ్డి అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఐటీడీఏ, స్కూల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అనుసంధ ఆధార్ సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వారి ఆధార్ సమస్యలను పరిష్కరించుకునేందుకు పాఠశాలలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయటం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి వి.మల్లికార్జునరావు, ఒంగోల్ పార్లమెంట్ అధ్యక్షులు టి.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగులకు పండ్లు పంపిణీ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 7: నీడ్ ఎన్ నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా వైద్యశాలలో డయాలసిస్ చికిత్స పొందుతున్న వారికి బుధవారం పండ్లు పంపిణీ చేశారు. తర్లుపాడు ఎంఈవో సుబ్బారావు, నీడ్ ఎన్ నీడ్ సంస్థ అధ్యక్షుడు బండారు రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

గత ప్రభుత్వ హయాంలో వివాదంగా మారిన జీవో 177ను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వొద్దుల వీరారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగానికి తీవ్ర ప్రమాదంగా మారిన జీవోపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు తీవ్ర అభ్యంతరాలు తెలిపాయని, ఎన్డీఏ కూటమి గత ఎన్నికల్లో ఈ జీవో రద్దుకు హామీ ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.

సర్వేనంబర్ల మాయాజాలంతో ఆక్రమణ

కనిగిరి పరిధిలోని సర్వే నంబరు 432లో 433 పేరుతో ఆక్రమణ

ఆ స్థలంలో ఎప్పుడో పేదలకు పట్టాలు

కాలక్రమంలో వాటిని అమ్మేసిన లబ్ధిదారులు

తాజాగా వాటి మాటున పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో పాగా

ఆ ప్రాంతంలో వైసీపీ నేత నిర్మాణాలు

ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

కనిగిరి, ఆగస్టు 5 : కనిగిరి ప్రాంతంలో అక్రమార్కులు ఏదో రూపంలో బరితెగిస్తూనే ఉన్నారు. ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు వాటిని కబ్జా చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారం అండతో చేసిన అక్రమాలను ఇప్పుడు అధికారం కోల్పోయినా ఏమాత్రం వెరవకుండా సాగిస్తున్నారు. తాజాగా పట్టా భూమి సర్వే నెంబరుతో రిజిస్ట్రేషన్లు చేయించుకుని దాని మాటున అక్రమంగా ప్రభుత్వ భూమిలోకి చొరబడి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకున్న అధికారే లేరని ప్రజలు విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వైసీపీ నేతలు చేసిన భూ అక్రమాలు, కబ్జాలు అన్నీఇన్నీ కావు. ప్రధానంగా కనిగిరి, పామూరు మండలాల్లో అత్యధికంగా అక్రమాలు జరిగాయి. కనిగిరి నగర పంచాయతీ కాగా, పామూరు మేజరు పంచాయతీ. ఆ రెండు మండలాల్లో భూముల ధరలకు అమాంతం రెక్కలు వచ్చాయి. ఈ క్రమంలో కనిగిరి-కందుకూరు రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ రోడ్డులోని 432 సర్వేనంబరుగల ప్రభుత్వభూమిలో అక్రమాలు వెలుగు చూశాయి. 433 సర్వే నెంబరు పేరుతో రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఆపక్కనే ఉన్న 432 సర్వేనంబర్ భూమిని ఆక్రమించుకుంటున్నారు.



432 సర్వేనెంబరులోని జీపుస్టాండు వద్ద అక్రమ కట్టడాలు



అక్రమ కట్టడం

432 సర్వే నెంబరు ప్రభుత్వ భూమి స్వరూపమిది...

కనిగిరి పట్టణంలోని అటవీశాఖ, రోడ్లు భవనాల శాఖ కార్యాలయాల ఎదురు కందుకూరు రోడ్డు వెంట 432 సర్వే నెంబరులో ఎకరా 42 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. అప్పట్లో కొంతమంది పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుండగా 45 ఏళ్ల క్రితం 3 సెంట్ల లెక్కన వారికి ఇంటి స్థలాన్ని అధికారులు కేటాయించారు. వాటికి పట్టాలు కూడా పంపిణీ చేశారు. అప్పటి నుంచి వారు ఆ స్థలాల్లో నివసిస్తున్నారు. కాలక్రమేణా ఆయా స్థలాల యజమానులు అగ్రిమెంట్ల ద్వారా ఇతరులకు అమ్ముకున్నారు.

433 సర్వేనెంబరు పేరుతో చొరబాటు

కొంతమంది వైసీపీ నేతలు 432 సర్వే నంబరులోని 1.42ఎకరాల భూమిలో 433 సర్వేనెంబరును చూపించి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించినట్లు సమాచారం. 433 సర్వే నెంబరుతో అసలు విస్తీర్ణం కంటే ఎక్కువగా 432లోని డోరు నెంబర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. ఈ రిజిస్ట్రేషన్లు చేయించడం వెనుక జరిగిన అక్రమాలను అధికారులు వెలికి తీయాల్సి ఉంది. ఈ విషయాన్ని తేల్చాల్సిన అధికారులు మిన్నకుండిపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల తప్పిదాలు బయటకొస్తాయనేనా..

ఈ రిజిస్ట్రేషన్ల వెనుక లోసుగులను వెలికితీయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నేతలకు నెలవుగా రెవెన్యూ కార్యాలయాలు మారాయి. రెవెన్యూ అధికారులు కింద స్థాయి నుంచి పైస్థాయి వరకు లక్షలాది రూపాయలు లంచాలు దిగమింగినట్లు ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం 432 సర్వే నెంబరు భూమిలో అక్రమంగా చొరబడి వైసీపీ నేతలు నిర్మాణాలు చేస్తున్నా మున్సిపల్, రెవెన్యూశాఖల ఉన్నతాధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విచారణ చేయిస్తే అధికారుల తప్పిదాలు బయటకొస్తాయన్న భయంతో వారు ముందుకెళ్లడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. జూలై 19న ఆ స్థలంలో వాస్తవాలను నిగ్గుతేల్చాలని రెవెన్యూ అధికారులను కోరామని, వారి నుంచి స్పందన రాలేదని మునిసిపల్ టీపీవో వివేకానంద చెప్పారు.

మున్సిపల్ అధికారులు సర్వే కోరితే నిగ్గు తేలుస్తాం

ఆర్డీవో జాన్ఇర్విన్



కనిగిరి పట్టణంలోని కనిగిరి - కందుకూరు రోడ్డులోని అటవీశాఖ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో వరకు 1.42ఎకరా 432 సర్వే నెంబరు పరిధిలో ఉందని ప్రాథమికంగా గుర్తించాం. సంబంధిత సర్వే స్థలం మున్సిపాల్టీ పరిధిలో ఉంది. అధికారులు రాతపూర్వకంగా కోరితే 433 సర్వే నెంబరు విస్తీర్ణం, 432 సర్వే నెంబరు విస్తీర్ణం తేల్చి హద్దులు నిర్ణయిస్తాం. మున్సిపల్ శాఖాధికారుల నిర్లక్ష్య వైఖరితో కాలయాపన జరుగుతోంది. 432 సర్వే నెంబరు ప్రభుత్వ భూమిలో 45ఏళ్ల క్రితం ప్రభుత్వ పట్టాలు మంజూరు చేసినట్లు వివరాలు సేకరించాం. 432 సర్వే నెంబరులో హద్దులు చూయించి 433 సర్వే నెంబరుతో రిజిస్ట్రేషన్లు జరిగితే అవి చెల్లకపోగా, నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆటోడ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలి

పామూరు, ఆగస్టు 7 : ఆటోడ్రైవర్లు అందరూ తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని సీఐ ఎం రామనాయక్ సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్, నిబంధనల గురించి వివరించారు. పట్టణంలో జరుగుతున్న చోరీలపై కొత్త వ్యక్తులు తిరుగుతున్న సమారారం తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదుబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్ రమణారావును కలిసిన దారపనేని



తహసీల్దార్‌కు స్వామి పటాన్ని అందచేస్తున్న దారపనేని

పామూరు, ఆగస్టు 7 : పామూరు నూతన తహసీల్దార్ బీవీ రమణారావును ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డిలు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, టి.ఆంజనేయరెడ్డి, పోకా నాయుడుబాబు, యర్రసింగ్ రాయుడు ఉన్నారు.

కన్వర్షన్ ఫీజు చెల్లించాలి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 7 : వ్యవసాయ భూములను వ్యవసాయేతరుల పనులకు ఉపయోగించేటప్పుడు ప్రభుత్వానికి చలానా చెల్లించాలని కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ఇర్విన్ సూచించారు. మండలంలోని అయ్యవారిపల్లిలో కన్వర్షన్ చేసుకొనేందుకు దరఖాస్తు చేసుకొన్న భూమిని బుధవారం పరిశీలించారు. అంబవరంలో జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న లబ్ధిదారులకు నష్టపరిహారం అందచేస్తామని తెలిపారు.

సీఎస్‌పురం తహసీల్దార్‌గా మంజునాథరెడ్డి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 7 : సీఎస్‌పురం నూతన తహసీల్దార్‌గా మంజునాథ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది శాలువతో సత్కరించి స్వాగతం పలికారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



తహసీల్దార్ రమణారావును అభినందిస్తున్న సిబ్బంది

పామూరు, ఆగస్టు 7 : పామూరు నూతన తహసీల్దార్‌గా బీవీ రమణారావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా పామూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మండల వీఆర్వోలు శాలువ పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ పురుషోత్తంరెడ్డి, ఆర్ఐ మల్లి కార్జున పాల్గొన్నారు.

నీటి ఇక్కట్లు తొలగింపునకు చర్యలు



బోర్‌కు భూమిపూజ చేస్తున్న పువ్వాడి

పామూరు, ఆగస్టు 7 : పట్టణంలో నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని అంకాలమ్మ వీధిలో నీటి ఎద్దడి నివారణ కోసం గ్రామ పంచాయతీ నిధులతో డీప్‌బోర్ వేసేందుకు బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్, కూటమి నేతలు ఖాజారహంతుల్లా ఉప్పలపాటి హరిబాబు, ఎన్ సాంబయ్య, ముబినా మౌలాలి, కేవీ రమణయ్య, వై రహీముల్లా, వెంగళశెట్టి బాబురావు, దరిశి ఏడుకొండలు, సందానిబాషతో పాటు పంచాయతీ నీటి విభాగ ఇన్‌చార్జ్ మెంటా నరసింహారావు పాల్గొన్నారు.

ఎదకురాని పశువులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి



మందులు అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు, పశుసంవర్ధకశాఖఅధికారిణి బేబీరాణి

తాళ్లూరు, ఆగస్టు 7 : ఎదకురాని, తిరగబెట్టే పశువులకు పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా మందులు వాడితే ఉపయోగం ఉంటుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి బేబీరాణి చెప్పారు. మండలంలోని దారం వారిపాలెంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రీయగోకుల్ మిషన్ సౌజన్యంతో పశుగర్భకోశ చికిత్స శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు డాక్టర్ బి.రవికుమార్ మాట్లాడుతూ పశువుల గర్భకోశ వ్యాధులను పరీక్షలు చేసి ముందుగానే గుర్తించి చికిత్స అందించాలన్నారు. శిబిరంలో 48మంది రైతులకు దాణానిచ్చే విత్తనాలు 3కేజీల వంతున అందజేశారు. 70 పశువులకు పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. 40 దూడలకు నులిపురుగు నివారణ మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంచాల వెంకటేశ్వర్లు, తాళ్లూరు, తూర్పుగంగవరం పశువైద్యులు వి.ప్రతాప్‌రెడ్డి, ఎమ్.రాంబాబు, పాడి రైతులు రత్నారెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి



పాఠశాలలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

దర్శి, ఆగస్టు 7 : పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని తహసీల్దార్ ఎం శ్రావణ్‌కుమార్ చెప్పారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వాతావరణంలో చోటుచేసుకున్న పరిస్థితి వలన వర్షాలు సక్రమంగా పడక ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్‌బాషా, టీడీపీ నాయకుడు సురేష్, ఉపాధ్యాయులు లక్ష్మీరాజ్యం, పద్మావతి, అనురాధ, శ్రీదేవి, ప్రమీల, మంజుల, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

పీసీపల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఉగ్ర



మాట్లాడుతున్న ఉగ్రనరసింహారెడ్డి

పీసీపల్లి, ఆగస్టు 7 : అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడమే టీడీపీ కూటమి ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అత్యాల జఫన్య అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఉగ్ర మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధిని అటకెక్కించి బటన్‌లు నొక్కుతూ కాలక్షేపం చేసిందన్నారు. కనీసం ఫ్లోరిన్ పీడిత గ్రామాల్లో సురక్షిత మంచినీటిని కూడా సరఫరా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న 2009-14సమయంలో రామతీర్థ జలాలను మండలానికి తీసుకొచ్చానని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రతి ఇంటికీ సురక్షిత శుద్ధజలాలు అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య మాట్లాడుతూ తమ పంచాయతీ గ్రామాల్లోన్ని దివాకరపురం, మిట్టమీదపల్లి, వెంగళాయపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కిడ్నీ బాధితులు అధికంగా ఉన్నారన్నారు. పీసీపల్లిలో డయాలసిస్ సెంటరును ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ డయాలసిస్ సెంటరు ఏర్పాటు చేసేందుకు పీహెచ్‌సీలో అన్ని వసతులు కావాలని చెప్పిన ఆయన కనిగిరి పీహెచ్‌సీ సెంటరులోనే షిఫ్ట్‌ల వారీగా డయాలసిస్ చేయిస్తున్నామని, అలాగే మూత్రపిండాల వ్యాధిగ్రస్తులను డయాలసిస్ సెంటరుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో రాజకీయాలు వద్దు

పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో రాజకీయాలకు తావులేకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర విద్యాశాఖ అధికారులకు చెప్పారు. విద్యాశాఖ తరఫున ఎంఈవో శ్రీనివాసులు ప్రగతిని నివేదించారు. సమావేశంలో ఎంపీడీవో వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఉగ్రకు ప్రజల నుంచి సమస్యల అర్జీలు వెల్లువెత్తాయి.

విద్య వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. బుధవారం పీసీపల్లి వచ్చిన ఆయన స్థానిక జడ్పీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలను సందర్శించారు. కేజీబీవిలో సర్వశిక్ష అభియాన్ ద్వారా 23లక్షల రూపాయల నిధులతో లైబ్రరీ నిర్మాణం చేపట్టేందుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కేజీబీవీ, జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, సంజీవిలు, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి సుజాత, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బండారు రాజు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక నిరంతర సేవలు ఆదర్శనీయం

సాహిత్య రంగంలో యువతరాన్ని ప్రోత్సహించడం కోసం వినూత్న పంథాలో నిరంతరం కృషి సాగిస్తున్న శ్రీశ్రీ కళావేదిక సేవలు ఆదర్శనీయమని శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర చెప్పారు. అమలాపురంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలుగుభాషా దినోత్సవ పోస్టర్‌ను బుధవారం పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, సంజీవి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఆగస్టు 7 : విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. మండలపరిధిలోని కంచర్లవారిపల్లిలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ నిర్వాహకులు కేవీపల్లి హైస్కూల్ విద్యార్థులకు తాగునీటి వసతి కోసం ఆర్వో ప్లాంటును అందజేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కంపెనీ నిర్వాహకులు గంటా వెంకటసుబ్బారెడ్డి, జీఎం కే ఎస్ఆర్ చక్రవర్తి, డిప్యూటి డీఈవో చంద్రమౌళీశ్వర్, ఎంఈవోలు నారాయణరెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, సంజీవి, ఆర్ శ్రీనివాసులు, హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, పోతు కొండారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

బొద్దికూరపాడు చిన్నారుల నృత్యప్రదర్శన



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న చిన్నజియ్యర్‌స్వామి

తాళ్లూరు, ఆగస్టు 7 : మండలంలోని బొద్దికూరపాడు, పొదిలి గ్రామాలకు చెందిన చిన్నారులు హైదరాబాద్‌లోని చిన్న జియ్యర్ స్వామి ఆశ్రమంలో నృత్యప్రదర్శన చేసి పలువురి అభినందనలు అందుకున్నారు. మయూరి డ్యాన్స్ అకాడమీ మాస్టర్ శివశంకర్, బొద్దికూరపాడు ఆధ్వర్యంలో చిన్నారులు భరతనాట్య పోటీల్లో పాల్గొన్నారు. విజేతలైన సంతోష్, పుష్పవర్షిత్, తన్మైశ్రీపల్లవి, వాత్సల్యవర్షిణులకు చినజియర్ స్వామి చేతు లు మీదుగా మెడల్స్, సర్టిఫికెట్ అందుకున్నారు.వీరిని గ్రామప్రజలు అభినందించారు.

కేంద్రమంత్రిని కలిసిన భారతీ రంగ సంస్థ ప్రతినిధి



కేంద్రమంత్రికి బొకే అందిస్తున్న రావిపాటి కొండలు

దర్శి, ఆగస్టు 7 : కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడును బుధవారం భారతీయరంగా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రతినిధి రావిపాటి కొండలు కలిశారు. దొనకొండలోని విమానాశ్రయాన్ని వినియోగంలోకి తేవాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. దొనకొండలో 136 ఎకరాల విమానాశ్రయ స్థలం ఉందని, అరవైఏళ్లుగా నిరుపయోగంగా ఉందని తెలిపారు. అందుకు స్పందించిన మంత్రి రామ్మోహన్‌నాయుడు విమానాశ్రయ ఏర్పాటుకు 600 ఎకరాల భూమి అవసరమని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి భరోసా ఇచ్చినట్లు కొండలు తెలిపారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



తహసీల్దార్లతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, ఆగస్టు 7 : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సూచించారు. దర్శిలో బుధవారం సాయంత్రం నియోజకవర్గంలోని తహసీల్దార్లతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సత్వరమే పనులు చేసి పంపాలని కోరారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలన్నారు. చిన్న చిన్న పనుల కోసం కూడా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సందర్భాలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తహసీల్దార్లు ఎం శ్రావణ్‌కుమార్, బీ రమాదేవి, రజనీకుమారీ, ఎల్ లక్ష్మీనారాయణ, పీ సింగారావులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షిత నీటిని అందించాలి

కురిచేడు, ఆగస్టు 7 : కురిచేడు మండల ప్రజలకు రక్షిత తాగునీటిని అందించాలని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి సూచించారు. కురిచేడు ఎన్ఏపీ పథకం పంప్‌హౌస్, ఫిల్టర్ బెడ్లను ఆమె పరిశీలించారు. అక్కడ అధికారులు, ప్రజలతో కలసి మాట్లాడారు. గతంలో ఎన్ఏపీ పథకం ద్వారా మట్టి నీరు సరఫరా అయ్యాయని, ఫిల్టర్‌బెడ్లు సక్రమంగా లేకపోవడం వలన అలా వచ్చాయని వాటిలో ఇసుకను మార్చాలని గ్రామస్థులు కోరారు. అలాగే ఎన్నికల సమయంలో అక్రమంగా పదులకొద్దీ కుళాయిలు ఏర్పాటు చేశారని వాటిని తొలగించి అందరికి రక్షిత నీరు అందేలా చూడాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని లక్ష్మి ఎస్ఈకి సూచించారు. పొట్లపాడు మంచి నీటి పథకం రూ.12 కోట్లతో నిర్మించినా నేడు ఎందుకూ పనికి రావడంలేదని అధికారులు లక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. కురిచేడు ఎన్నెస్పీ కాలువ నుంచి పొట్లపాడుకు నీటిని సరఫరా చేసి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడియాల లలిత్ సాగర్, ఎన్ఏపీ ఎస్ఈ మదార్ వలి, ఏఈ బసవరాణి పాల్గొన్నారు.

టీడీపీ నేత కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దొనకొండ, ఆగస్టు 7 : టీడీపీ సీనియర్ నాయకుడు పులిమి శ్రీరాములు కుటుంబాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్‌లు బుధవారం పరామర్శించారు. విద్యుత్‌శాఖలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న శ్రీరాములు కుమారుడు నవీన్ అనారోగ్యానికి గురై మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్నవారు బ్రహ్మారావుపేటలోని శ్రీరాములు ఇంటికివెళ్లి మృతుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ కుటుంబ సభ్యులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, షేక్ సుభానీ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, ఆగస్టు 7 : మండలంలోని పలు గ్రామాల్లో దీర్ఘ కాలికంగా పెండింగ్ ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ చెప్పారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలు, సర్వేయర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మీ కోసంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పరిష్కారం కానివి తమ దృష్టికి తీసుకు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రైతును పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. వీఆర్‌వోలు రైతుల వద్ద పాసు పుస్తకాలకు నగదు వసూలు చేసినట్లు తెలిస్తే వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు జీ పుల్లారెడ్డి, ఏ స్రవంతి, ఆర్ఐ ప్రసాదు, సీనియర్ అసిస్టెంట్ పీ శేషగిరిరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ లక్ష్మీనారాయణను సన్మానించిన పూరిమెట్ల టీడీపీ నేతలు

మండల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎల్ లక్ష్మీనారాయణను మండలంలోని పూరిమెట్ల గ్రామానికి చెందిన టీడీపీ నేతలు బుధవారం కార్యాలయంలో, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చింతపల్లి వెంకటేశ్వరరావు, వగులూరి రమణయ్య, చొప్పరపు నాగేశ్వరరావు, పానిపర్తి నర్సారెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.




పులిచింతల వద్ద వరద ఉధృతి

ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

కృష్ణమ్మ పరవళ్లు

కృష్ణమ్మ సాగరం దిశగా పరుగులు పెడుతూ ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వరద ఉధృతి పెరుగుతూ ఉంది. దీంతో నాగార్జున సాగర్ నుంచి దిగువను ఉన్న అన్ని ప్రాజెక్టుల బంధనాలు తెంచుకుని సాగరంలో కలిసేందుకు పోటెత్తుతూ ప్రవహిస్తోంది. సోమవారం సాగర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయగా రెండు రోజుల్లోనే పులిచింతల నిండుకుండలా మారింది. దీంతో బుధవారం పులిచింతల ప్రాజెక్టు గేట్లు కూడా ఎత్తి దిగువకు నీటి విడుదల చేశా రు. యథావిధిగా ప్రకాశం బ్యారేజి గేట్లను ఎత్తి ఉంచి నీటిని వదులుతున్నారు. ప్రవాహ ఉధృతి అంతకంతకూ పెరుగుతూ ఉండ టంతో కృష్ణానది పరివాహక ప్రాంతంలో ప్రజలను, రైతులను అధికారులు అప్రమత్తం చేశారు.

- కొనసాగుతున్న వరద ఉధృతి
- సాగరం దిశగా పోటెత్తుతోన్న వరద
- సాగర్ 18, పులిచింతల 13 గేట్లు ఎత్తి విడుదల



సాగర్ క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

మాచర్ల రూరల్, అచ్చంపేట, వీపీ సౌత్, రెం టచింతల, అమరావతి, తాడేపల్లి టౌన్, నూ జెండ్ల / నరసరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్, పులిచింతలకు భారీగా వరద కొనసాగుతోంది. జలాశయాల నీటి నిల్వ పూర్తి స్థాయికి చేరుకున్నాయి. సాగర్ డ్యాం 18 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు 2,24,574 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పులిచింతల నిండు కుండలా మారింది. పులిచింతలలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరడంతో బుధవారం ఉదయం 13 గేట్లు ఎత్తి దిగువకు 2.78 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, శ్రీరాం తాతయ్య స్విచ్ అన్ చేసి నీటిని విడుదల చేశారు. అంతకముందు వారు కృష్ణమ్మకు పూజలు చేసి, జలహారతి ఇచ్చారు. కృష్ణమ్మకు సారె సమర్పించారు. జలాశయం ఆరు గేట్లను రెండున్నర మీటర్లు, ఏడు గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా బుధవారం 168.86 అడుగులకు చేరింది. 45.77 టీఎంసీలకు 36.78 టీ ఎంసీలకు నీటి నిల్వలు చేరుకున్నాయి. పులిచింతలకు 2,50,518 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా గేట్ల ద్వారా 2,78,573, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 10,000 మొత్తం 2,88,573 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి కృష్ణమ్మ ప్రకాశం బ్యారేజీకి పరుగులు పెడుతోంది. భారీగా నీటిని విడుదల చేయడంతో దిగువ ప్రాంతాల వారిని అప్రమత్తం చేశారు. నది వైపు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. దిగువ కృష్ణలో కృష్ణా జలాలు పెరగటంతో మత్స్యకారుల పడవలన్నీ ఒడ్డుకు చేరాయి. తాడువాయి వద్ద నది నుంచి మత్స్యకారులు తమ పడవలును ఒడ్డుకు చేర్చారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి భారీగా నీటి ప్రభావంతో అమరావతి వద్ద కృష్ణానది జలకళను సంతరించుకుంది. సంవత్సర కాలంగా ప్రవాహం లేకపోవడంతో కళతప్పిన కృష్ణమ్మ ప్రస్తుతం పరుగులు తీస్తున్న నీటితో సరికొత్త కళను సంతరించుకుంది. నీటి పరవళ్లు చూసేందుకు స్థానికులు పెద్దసంఖ్యలో అమరావతి తీరానికి తరలి వస్తున్నారు.



పులిచింతల వద్ద కృష్ణమ్మకు సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, శ్రీరాం తాతాయ్య



తాడువాయి కృష్ణా నది ఒడ్డున నిలిచిన మత్స్యకారుల పడవలు

గుండ్లకమ్మకు జలకళ

నాలుగు రోజులుగా సాగర్ జలాలు విడుదలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలతో గుండ్లకమ్మ నది జలకళను సంతరించుకుంది. నూ జెండ్ల మండలంలోని గుండకమ్మ నది పరివాహ ప్రాంతాల్లో సాగు, తాగు నీటి కష్టాలకు ఉపశ మనం లభించినటయింది. వరి నారుకు ప్రసిద్ధి గాంచిన ఐనవోలు గ్రామంలో నారుమళ్లను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు.



జలకళతో గుండ్లకమ్మ నది

సాగర్‌లో కొనసాగుతోన్న విడుదల

నాగార్జున సాగర్‌కు భారీగా వరద కొనసాగుతుండటంతో జలాశయం నీటి నిల్వ పూర్తి స్థాయికి చేరింది. డ్యాం 18 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 3,50,730 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా క్రస్ట్ గేట్లను ఒక్కొక్కటి 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. గేట్ల నుంచి 2,24,574, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 29,151, కుడి కాల్వకు 6,873, ఎడమ కాల్వకు 8,193 క్యూసెక్కుల వెరసి 2,70,591 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. సాగర్ నీటి మట్టం 590 అడుగులకు 584.60 అడుగులకు చేరింది. సామర్థ్యం 312.05 టీఎంసీలకు 296.28 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

వచ్చిన నీరు వచ్చినట్లే దిగువకు: ఎస్ఈ వెంకటరమణ

సత్రశాల వద్ద నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తోన్న నీటిని వచ్చిన మేర దిగువన ఉన్న పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కోలేగుండ్ల వెంకటరమణ చెప్పారు. బుధవారం సాగర్ నుంచి 2 లక్షల 76 వేల క్యూసెక్కుల నీరు రాగా టెయిల్ పాండ్ ప్రాజెక్టు 12 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి దిగువకు పంపుతున్నామన్నారు. విద్యుత్ ఉత్పత్తిని నిలిపి వేశామన్నారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 74.02 మీటర్ల నీరుండగా ఈ నీరు 6.2 టీఎంసీలకు సమానమన్నారు.



బ్యారేజీ వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న సీఎం

బ్యారేజీ వద్ద ఉధృతిని పరిశీలించిన సీఎం చంద్రబాబు నాయుడు

ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతిని సీఎం చంద్రబాబు బుధవారం పరిశీలించారు. విజయవాడలో చేనేత దినోత్సవ కార్య క్రమం ముగించుకుని ఉండ వల్లి వస్తూ బ్యారేజిపై కాన్వాయ్ ను నిలిపి కిందకి దిగారు. కృష్ణమ్మ పరవళ్లను ఆసక్తిగా తిలకించారు. కృష్ణమ్మకు జలకళ, నీటి ప్రవాహం సంతృప్తిగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 1 లక్ష 36 వేలు, కీసర వాగు నుంచి 15 వేల క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటి పారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 3 అడుగులు, 20 గేట్లను 2 అడుగులు వంతున ఎత్తి దిగువకు 1 లక్ష 37వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 13 వేల 500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు. కాగా బుధవారం అర్ధరాత్రికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున తీరం వెంబడి రైతులు, మత్స్యకారులు, లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



కొల్లిపర కృష్ణానది రేవులో లంక గ్రామాల నుంచి పడవల ద్వారా వస్తున్న రైతులు

వరద.. వణుకు

- బ్యారేజి దిగువ ప్రాంతాల్లో ముంపుభయం
- సముద్రంలోకి 1.5 లక్షల క్యూసెక్కులు నీరు
- నేడు 3 నుంచి 4 లక్షల క్యూసెక్కులకు ప్రవాహం
- పెరుగుతోన్న వరద ఉధృతి.. అధికారులు అప్రమత్తం

తెనాలి(ఆంధ్రజ్యోతి), కొల్లిపర, ఆగస్టు 7: కృష్ణానదీ పరివాహక గ్రామాల ప్రజల్లో వరద భయం మొదలైంది. బ్యారేజి దగ్గర పట్టిసీమ నీరు పుష్కలంగా ఉండటంతో పులిచింతల నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ప్రస్తుతం నదిలో 1.5 లక్షల క్యూసెక్కుల వరకు మాత్రమే వరద నీరు ప్రవహిస్తున్నా, గురువారానికి మరింత పెరిగే పరిస్థితి ఉంది. దీంతో బ్యారేజి దిగువనున్న లంక గ్రామాలను ముంపు భయం వెంటాడుతోంది. ఇప్పటికే అరటి, పసుపు, కంద, తమలపాకు, బొప్పాయి వంటి వాణిజ్యపంటలు చేలల్లో ఉన్నాయి. బుధవారం పులిచింతల నుంచి 2,92,462 క్యూసెక్కుల నీటిని బ్యారేజికి వదిలారు. ఆ నీరు గురువారం తెల్లవారుజాము నుంచి బ్యారేజి దిగువకుచేరే పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో 73వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా సాయంత్రం 4 గంటలకు అది 1.30 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. బ్యారేజి దిగువున కృష్ణా నదిలో 9 నుంచి 12 అడుగుల వరకు నీటి మట్టం పెరిగే పరిస్థితి ఉంది. దీంతో లంక గ్రామాల్లో జనం, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చి పంటలకు నష్టం ఏర్పడుతుందనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో మాత్రం రైతులు విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లను ఒడ్డుకు చేర్చుతున్నారు. వరద ప్రభావం పెరుగుతుందన్న ఆలోచనతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. లంకగ్రామాల్లో, నది మధ్య ఉన్న గ్రామాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు ఎప్పుడైనా వచ్చేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. బ్యారేజి దిగువున ఉన్న గుంటూరు జిల్లా తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, బాపట్ల జిల్లా కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల నదీ తీర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద నీటి ప్రవాహం నిలకడగా ఉంటే పర్వాలేదని, పెరిగే పరిస్థితి ఉంటే మాత్రం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెండు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. కొల్లిపర తహశీల్దార్ సిద్ధార్థ, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రమోహన్‌వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం కొల్లిపర, బొమ్మువానిపాలెం, అన్నవరం రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. జాలర్లు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

చీరాలలో చేనేత పార్కు ఏర్పాటు

- నేతన్నలకు స్వర్ణయుగం తెచ్చేందుకు కృషి
- జాతీయ చేనేత దినోత్సవ సభలో మంత్రి సవిత
- వాతావరణ ఆటంకాలతో సీఎం చంద్రబాబు పర్యటన రద్దు

చీరాల, ఆగస్టు 7: చీరాలలో చేనేత పార్కు ఏర్పాటు చేస్తాం. చేనేత కళాకారులకు స్వర్ణయుగం తెస్తాం. కూటమి ప్రభుత్వంతోనే చేనేత రంగానికి పూర్వవైభవం వస్తుంది.. అని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సంజీవిరెడ్డిగారి సవిత తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చీరాల మండలం జాండ్రపేటలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉండగా అననుకూల వాతావరణ పరిస్థితుల్లో రద్దు చేశారు. దీంతో శ్రేణులు, నేతన్నలు నిరుత్సాహానికి గురయ్యారు. అయితే ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య, కలెక్టర్ జె. వెంకటమురళి ప్రణాళికబద్ధంగా సదస్సును విజయవంతం చేశారు. చీరాల మండలం జాండ్రపేటలోని బీవీఅండ్‌బీఎన్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సభావేదిక పక్కన లైవ్‌స్ర్కీన్‌లో విజయవాడలో జరిగే జాతీయ చేనేత దినోత్సవ సభను, అక్కడ సీఎం చంద్రబాబు మాట్లాడిన కార్యక్రమాన్ని స్థానిక నేతన్నలు తిలకించే ఏర్పాటు చేశారు. కేంద్రంతో మాట్లాడి జీఎస్టీ రద్దు, ఓఎన్‌డీసీ(ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్) ద్వారా కొనుగోలు మార్గాలు పెంచుతామని చంద్రబాబు ప్రకటనపై నేతన్నలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ పోగును వస్త్రంగా చేసి మానాన్ని కాపాడుతున్న చేనేత కళాకారులకు సీఎం చంద్రబాబు సారధ్యంలో పూర్వవైభవం వస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ అండ్ కో దోచుకో, దాచుకో అన్న నినాదంతో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారన్నారు. ఆ సంక్షోభంలో చేనేతరంగం కూడా ఒకటన్నారు. మంగళగిరిలో మంత్రి లోకేశ్ చొరవతో ఏర్పాటు చేసిన టాటా మార్కెటింగ్ కేంద్రం మాది రిగా ఇక్కడ కూడా ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. యువత ఉపాధి, ఉద్యోగవకాశాలకు ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్రం నుంచి హ్యాండ్లూమ్‌కు ప్రత్యేకంగా నిధులు సమకూరే విధంగా ప్రయత్నిస్తామన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లా డుతూ కేంద్రం టెక్స్‌టైల్స్ రూ.4,417 కోట్లు కేటా యించిందని, అయితే అందులో అధిక మొత్తం హ్యాండ్లూమ్‌కు కేటాయించేలా చేస్తామన్నారు. కుప్పడం రకం భౌగోళిక గుర్తింపునకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ జాండ్రపేటలో నేతన్నలు చెప్పిన సమస్యల్లో తమ పరిధిలో అయ్యేవాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామన్నారు. చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు ఎం.ఎం కొండయ్య, వేగేశన నరేంద్రవర్మ, డాక్టర్ పాలేటి రామారావు, ఆప్కో ఎండీ పావనమూర్తి, డాక్టర్ సజ్జా హేమలత తదితరులు మాట్లాడుతూ చేనత రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పవర్‌లూమ్ వస్త్రాలను అరికట్టాలన్నారు. సిద్ధి వెంకట బచ్చేశ్వరరావు మాట్లాడుతూ చీరాలను హ్యాండ్లూమ్ హబ్‌గా రూపొందించి పూర్తి స్థాయిలో జీవనోపాధి కల్పించాలన్నారు. పేరుకుపోయిన వస్త్ర నిల్వలను కొనుగోలు చేయాలని కోరారు. సజ్జా రేణుకేశ్వరరావు అనే నేతన్న మాట్లాడుతూ ఒకప్పుడు నైజీరియాకు ఇక్కడి నుంచి వస్త్రాల ఎగుమతి జరిగేదన్నారు. జొన్న శేషలక్ష్మి అనే చేనేత మహిళ మాట్లాడుతూ తమకు ముడిసరుకుకు సబ్సిడీపై ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, నాయకులు నాతాని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచుగరటయ్య, చీరాల గోవర్ధనరెడ్డి, గుద్దంటి చంద్రమౌళి, గొడుగుల గంగరాజు, లలి తామోహన్, నాశివ వీరభద్రయ్య, శేషాలక్ష్మి, చేనేత ప్రతినిధులు, కళాకారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత



లడ్డీలు చుడుతున్న మంత్రి, పక్కన కలెక్టర్, ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రవర్మ తదితరులు



30 రోజుల్లో జంగిల్ క్లియరెన్స్

- పనులు ప్రారంభించిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, ఆగస్టు 7: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని అడవిలా చేసింది.. మేము 30 రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ చేసి అమరావతికి ఓ రూపు తెస్తాం.. అని మంత్రి నారాయణ తెలిపారు. వెలగపూడి సచివాలయ పరిసరాల్లో బుధవారం తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. వర్షంలోనే తొలుత పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి ఎక్స్‌కవేటర్ ఎక్కిన మంత్రి, ఎమ్మెల్యేలు పది నిమిషాలు సేపు కంప తొలిగించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 24 వేల ఎకరాను అడవిలా చేసిందన్నారు. జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో అమరావతికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. అమరావతిలో ముఖ్యమంత్రి పర్యటించినప్పుడు ఎత్తైన భవనాలు సైతం అడవి మధ్యలో ఉన్నట్లు కనిపించాయన్నారు. ఈ పరిస్థితి నుంచి ముందుగా అమరావతిని పూర్తిగా బయటకు వచ్చేలా కంప, తుమ్మ చెటట్లను తొలగించాలని సీఎం ఆదేశించారన్నారు. అందులో భాగంగానే ముందు అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. రూ.36.5 కోట్లతో 23 వేల 429 ఎకరాల్లో జంగిల్ క్లయరెన్స్ పనులను 30 రోజుల్లో పూర్తి చేసేలా ఆదేశాజారీ చేసినట్లు తెలిపారు. అమరావతి పనులకు ఇది మొదటి అడుగన్నారు. అమరావతి నిర్మాణాలపై అధ్యయనం చేసిన ఐఐటీ హైదాబ్రాద్, మద్రాసు నుంచి త్వరలో ప్రాథమిక నివేదిక వస్తుందని దాని ఆధారంగా నిర్ణయం తీసుకుంటుమన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ అమరావతిని నాశనం చేసిన జగన్ ప్రజలపై భారం వేశాడన్నారు. ఈ కార్యక్రమంలో రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్లతో జంగిల్ క్లియరెన్స్

చేనేత రంగానికి జవసత్వాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనతో పూర్వవైభవం

ఎమ్మెల్యే కొండయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య



మంత్రి సవిత, ఎంపీ, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న మహేంద్రనాథ్

చీరాల, ఆగస్టు 7 : చతికిలబడ్డ చేనేత రంగానికి సీఎం చంద్రబాబు జవసత్వాలు పోస్తున్నారు. జగన్‌రెడ్డి చేనేత రంగాన్ని అటెకెక్కించారు. సీఎం చంద్రబాబు చేనేత రంగాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు తీసుకెళ్లేందుకు చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. జాండ్రపేట బీవీ అండ్ బీఎన్ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం కలెక్టర్ జె. వెంకటమురళి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి నినాదంతో చేనేత రంగానికి చేయూతనిస్తే, జగన్ ప్రభుత్వం విధ్వంసాన్ని సృష్టించిందన్నారు. నేతన్నలకు 50 సంవత్సరాలకే రూ.4వేలు పెన్షన్ అందిస్తున్న ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానిదన్నారు. వినియోగదారులు అభిరుచి మేరకు నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. నేతన్న ఆరోగ్య బీమా కోసం రూ.10కోట్లు ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి చేనేతకు ఇంటికి 3 సెంట్ల స్థలం, నిర్మాణానికి రూ.4.30లక్షలతో పాటు అదనంగా మరో రూ.50 కూడా ఇస్తామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను నేతన్నలకు పునరుద్ధరిస్తామన్నారు. అందులో థ్రిఫ్ట్ ఫండ్, జీఎస్టీ రీయింబర్స్ చేసేందుకు రూ.70 కోట్లు వరకు చేయూతనించేందుకు సీఎం చంద్రబాబు ప్రకటన చేశారన్నారు. బుధవారం ఉదయం నుంచి వాతావరణం అనకూలంగా లేకపోవడంతో పాటు వర్షం కారణంగా హెలికాప్టర్ వచ్చేందుకు వీలులేక పోవడంతో నిర్ణీత జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు రాలేకపోయారు. విజయవాడలో జరుగుతున్న చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని లైవ్ స్క్రీన్‌లో వీక్షించేలా ఇక్కడ ఏర్పాటు చేయడంపై అందరూ ఆనందం వ్యక్తం చేశారు. సభ అనంతరం చేనేత, జౌళిశాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవిత, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఎంఎం కొండయ్య, వేగేశన నరేంద్రవర్మను టీడీపీ యువనేత డాక్టర్ ఎం.మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా భారీ గజమాలలతో సత్కరించారు. నేతన్నల తరపున సిద్ధి వెంకట బచ్చేశ్వరరావు తదితరులు మంత్రికి సంప్రదాయ రాట్నం నమూనా జ్ఞాపికను అందజేశారు. ముందుగా స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ముగ్గురు చేనేత కార్మికుల ఇళ్లను సందర్శించి వారితో మాట్లాడారు. వారి జీవన స్థితిగతులు, సమస్యలు, వారే కోరే పరిష్కారమార్గాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి, జేసీ సుబ్బారావు, ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, నాయకులు నాతాని ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచుగరటయ్య, చీరాల గోవర్ధనరెడ్డి, డాక్టర్ పోగడదండ రవికుమార్, సిద్ధి బుచ్చేశ్వరరావు, నాశిక వీరభద్రయ్య, ఆప్కో ఎండీ పావనమూర్తి, లలితామోహన్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, చేనేత ప్రతినిధులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అప్పుడలా..

జాండ్రపేటలో సభ ప్రారంభం కాక ముందు నుంచే విజయవాడలో జరుగుతున్న జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం లైవ్ కొనసాగుతోంది. ఆ క్రమంలో ... జాండ్రపేటకు చెందిన శ్యామ్‌సుందర్ అనే వ్యక్తి అక్కడి కార్యక్రమంలో మాట్లాడుతూ.. సార్ ... నాపేరు శ్యాంసుందర్ .... గతంలో కృష్ణమోహన్ ఉన్నప్పుడు మీరు చీరాలలో జాతీయ చేనేత దినోత్సవానికి వచ్చారు. మీ హయాంలో అంతా బాగుంది. తరువాత నుంచి ఇబ్బంది పడుతున్నాం. నాకు ఇందిరా ప్రియదర్శిని అనే సొసైటీ ఉంది. స్థలం లేదు. ఎవరిని అడిగినా ప్రయోజనం లేదు. సొసైటీకి ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. అందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని లైవ్‌స్ర్కీన్‌లో చూసిన వారిలో పలువురు ఆ అంశంపై చర్చించుకున్నారు.

భూ.. రా'బంధువు'

వైసీపీ సర్పంచ్ అడ్డగోలు ఆక్రమణలు

ఆయన చెరలో ఊరుమ్మడి గొర్లదొడ్డి

చివరికి పట్టా భూములనూ వదలని వైనం

చుట్టాలవీ హస్తగతం

మార్కాపురం సమీపంలోని విలువైన స్థలాలు స్వాహా

సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితుల వరుస ఆందోళనలు

మార్కాపురం పట్టణానికి సమీపంలో ఉన్న బోడపాడు గ్రామం అది. గతంలో రూ.లక్షల్లో ఉన్న అక్కడి భూముల విలువ నేడు రూ.కోట్లకు చేరుకుంది. అంతటి కీలకమైన గ్రామానికి అతనో ప్రజాప్రతినిధి. ఐదేళ్లుగా అధికారం అండ ఉంది. ఇంకేముంది అది ప్రభుత్వ భూమా, పట్టా భూమా అనే తారతమ్యం లేకుండా వైసీపీ అధికారపార్టీ నేతల అండతో గడిచిన ఐదేళ్లు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడ్డాడు. ఇదేమిటని అడిగిన వారిని బెదిరించడం, అడ్డం తిరిగితే దాడులకు తెగబడటం అలవాటుగా మార్చుకున్నాడు. దాడులకు గురైన వాళ్లు పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులు చేసినా నియోజకవర్గ స్థాయి నాయకుని అండదండలు పుష్కలంగా ఉండటంతో వారినే ఖాకీలు బెదిరించి బయటికి పంపిన దాఖలాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామస్థుల్లో ధైర్యం వచ్చింది. గ్రామస్థాయి ప్రజాప్రతినిధి సాగించిన భూదురాగతాలను ధైర్యంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

మార్కాపురం, ఆగస్టు 6: అతను మండలంలోని బోడపాడు గ్రామానికి సర్పంచ్. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ కీలక నేత అండ ఉంది. దీంతో ఇష్టానుసారం రెచ్చిపోయి భూకబ్జాదారుగా మారారు. ఆ ఐదేళ్ల కాలంలో అతను సాగించిన దురాగతాలు ప్రస్తుతం వెలుగుచూస్తున్నాయి. తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన గ్రామ ప్రజాప్రతినిధిపై కఠినచర్యలు తీసుకోవాలని గ్రామస్థులు రోడ్డెక్కారు. గతంలో అతని అరాచకాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో వారిలో ధైర్యం వచ్చింది. తమకు న్యాయం చేయాలంటూ ఏకంగా సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుటే ఆందోళనకు దిగారు. నేరుగా అధికారులను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బోడపాడు గ్రామంలో సర్వే నెంబర్ 71/1, 71/ఎ, 71/1ఎలలో సుమారు 30.62 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని ఏడు దశాబ్దాలుగా గ్రామస్థులు ఊరుమ్మడి అవసరాలకు వాడుకుంటున్నారు. ప్రధానంగా దాన్ని గొర్లదొడ్డి భూమి అంటారు. గొర్రెల మందలను ఆ భూమిలో మేపుకునే వారు. అంతేకాక గ్రామానికి చెందిన కొందరు ఎస్సీ సామాజికవర్గం వారు దొడ్లకు వాడుకుంటారు. పంటలు పూర్తయిన తర్వాత గ్రామ రైతులంతా ఆ భూమిలోనే కల్లాలు చేసుకునేవారు. గ్రామస్థులకు అంతటి కీలకమైన భూమిపై సర్పంచ్‌గా గెలిచిన వ్యక్తి కన్నేసి కాజేయాలని ప్రణాళిక రచించాడు. ముందుగా రెండేళ్ల క్రితం సుమారు ఐదు ఎకరాల మేర చుట్టూ కంచె ఏర్పాటు చేశాడు. అందులోకి ఎవరూ వెళ్లకుండా అంక్షలు విధించాడు. దీంతో గ్రామస్థులు ఆ ప్రజాప్రతినిధిని నిలదీసినా బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతేకాక ఆ భూమిని అక్రమంగా పొందేందుకు కూడా ప్రయత్నించినా గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో రికార్డుల్లో మార్పులు చేయకుండా నిలిపివేశారు. కానీ ఇప్పటికీ ఊరుమ్మడి ఆస్తి అయిన ఐదు ఎకరాల భూమి ప్రస్తుతం గ్రామ ప్రజాప్రతినిధి కబంధ హస్తాల్లోనే ఉంది. బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం ఆ భూమి విలువ ఎంతలేదన్నా సుమారు రూ.10 కోట్లకు పైమాటే.

దాయాదుల భూమిని కాజేశాడు

భూఅక్రమాలకు పాల్పడిన ఆ ప్రజాప్రతినిధికి పిల్లనిచ్చిన మామగారిది కూడా అదే ఊరు. దీంతో మామగారి బంధువుల పొలాలపై కూడా కన్నేశాడు. అందులోభాగంగా ఎన్నో ఏళ్ల నుంచి సాగులో ఉన్న ఆయన మామ సమీప బంధువులకు చెందిన సర్వే నెంబర్ 179-1ఏ2లోని 2.19 ఎకరాల భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడు. రూ.కోట్ల విలువైన ఈ భూమి విషయంలో పెద్ద ఘర్షణలు జరిగాయి. ప్రజాప్రతినిధికి రాజకీయ అండదండలు ఉండటం, అధికారులు వత్తాసు పలకడంతో బాధితులు ఏం చేయలేకపోయారు. అదేవిధంగా ఆ ప్రజాప్రతినిధి తన మామ గారి సొంత తమ్ముళ్లను కూడా వదల్లేదు. పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తుల పంపకాల్లో వచ్చిన పేచీలను తనకు అనుకూలంగా మల్చుకున్నాడు. పెద్దయాచవరం గ్రామ ఇలాకాలోని సర్వే నెంబర్ 3/5లో 2.23 ఎకరాల భూమిని అతని భార్య వరలక్ష్మి పేరున మామ పోరెడ్డి కాశిరెడ్డితో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమిని కాశిరెడ్డి గతంలోనే తన తమ్ముళ్లు పోరెడ్డి ఓబులరెడ్డి, నందిరెడ్డిలకు స్వాధీన అగ్రిమెంటు రాసిచ్చాడు. అంతేకాక కాశిరెడ్డి కుటుంబానికి వంశపారంపర్యంగా మార్కాపురం ఇలాకాలో సర్వే నెంబర్ 168/3ఏలో 25 సెంట్లు ఉంది. దానిని అన్నదమ్ములు అందరూ పంచుకోవాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా ఆ భూమిని ఇతరుల వద్ద కాశిరెడ్డి కొన్నట్లు దొంగపత్రాలను సృష్టించి ఆన్‌లైన్‌లో కూడా అతని పేరున మార్పించారు. ప్రస్తుతం ఆ భూమి విలువ ఎంత లేదన్నా రూ.5కోట్ల పైమాటే. ఎన్ని రకాలుగా బాధితులు ప్రయత్నించినా వారిని పట్టించుకున్న నాథుడే లేడు. ప్రస్తుతం వారంతా తమకు న్యాయం చేయాలంటూ అధికారులను కోరుతున్నారు.



ఆక్రమిత భూమి ఇదే...!

గొర్లదొడ్డి స్థలాన్ని విడిపించాలంటూ ధర్నా

వైసీపీ సర్పంచ్ ముక్కమళ్ల వెంకటరమణారెడ్డి చెరలో ఉన్న గొర్లదొడ్డి స్థలాన్ని విడిపించాలని మండలంలోని బోడపాడు గ్రామస్థులు బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. ఊరు పుట్టినప్పటి నుంచి గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 71లో ఉన్న సుమారు 30 ఎకరాలపైగా ఉన్న ఆ భూమిలో గొర్రెలు తోలుతారని, అదేవిధంగా అన్ని కులాల వారు అక్కడ దొడ్లు ఏర్పాటు చేసుకున్నారన్నారని తెలిపారు. అంతేకాక ఊరుమ్మడి భూమి కావడంతో పండించిన పంటలను రైతులు నూర్పిడి చేసుకునేందుకు కల్లాలుగా కూడా ఉపయోగించారన్నారు. ఆ భూమిలోనే యువకులు ఆటలు ఆడుకునే వారన్నారు. కానీ ప్రస్తుత వైసీపీ సర్పంచ్ రమణారెడ్డి ఆ భూమిలో 10 ఎకరాల మేర చుట్టూ కంచె ఏర్పాటు చేసుకుని ఆక్రమించుకున్నాడన్నారు. గ్రామస్థులు వారించినా వినడం లేదన్నారు. ఈ విషయమై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు పర్యాయాలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేదనివాపోయారు. ఇప్పటికైనా అధికారులు ఆ భూమిని సర్వే చేసి సర్పంచి చెర నుంచి విముక్తి కలిగించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.బాలిరెడ్డి, పి.ఓబులరెడ్డి, కె.శ్రీనివాసులు, ఎం.నారపరెడ్డి, బి.రాజయ్య, ఆర్.రామ్‌గోపాల్ పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బోడపాడు గ్రామస్థులు

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

కలెక్టర్ తమీమ్ అన్సారియా

గిద్దలూరు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన

టిడ్కో ఇళ్లు, మల్బరీ సాగు, ఆసుపత్రులు, హాస్టళ్ల పరిశీలన

చారిత్రక కంభం చెరువును అభివృద్ధి చేస్తామని హామీ

గిద్దలూరు, ఆగస్టు 7: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని, ఎలాంటి లోపాలు జరగకుండా నిబద్ధతతో ఉద్యోగులు పని చేయాలని కలెక్టర్ కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సూచించారు. బుధవారం కలెక్టర్ గిద్దలూరు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. బేస్తవారపేట మండలంలోని మోక్షగుండంలో మల్బరీసాగు, కంభంలో చారిత్రక కంభం చెరువును, కొమరోలు మండలంలోని తాటిచెర్లమోటులో సాగులో ఉన్న షేడ్ నర్సరీలను పరిశీలించారు. గిద్దలూరు పట్టణంలో టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలించారు. నిర్మాణం ఎంతవరకు జరిగింది, పూర్తిస్థాయిలో నిర్మాణం జరగాలంటే ఎంత సమయం పడుతుంది అనే విషయాలపై టిడ్కో అధికారులతో కలెక్టర్ చర్చించారు. 1,248 గృహాలు నిర్మిస్తున్నామని, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు, మిగతా పనుల పూర్తికి సుమారు రూ.70 కోట్లు అవసరం అవుతాయని టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు పేర్కొనగా నిధుల విడుదలకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, మార్చి లోగా నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్యసేవలు అందించడంలో, అలాగే ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, లోపం ఉండకూడదని డాక్టర్లకు సూచించారు. గంటకు పైగా ఆసుపత్రిలోని అన్ని విభాగాల గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యసేవల తీరు గురించి రోగులతో మాట్లాడారు. తరువాత సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల విద్యార్థుల వసతి గృహాన్ని, అలాగే గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, దుస్తులు ఉతుక్కునేందుకు అవసరమైన ప్లాట్‌ఫారం నిర్మాణం అవసరాన్ని విద్యార్థులు తెలియచేయడంతో వెంటనే వాటిని ఏర్పాటు చేయిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే తాగునీటి సమస్యను కూడా వెంటనే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. 6 నెలలుగా వేతనాలు రావడం లేదని ఆయాలు, ఏఎన్ఎంలు కలెక్టర్ దృష్టికి తేగా జీతాలు వచ్చే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పట్టుపరిశ్రమ సీడ్ ఫారంను కలెక్టర్ సందర్శించారు. సీడ్ ఫారంలో పెరుగుతున్న మల్బరీ తోటలను పరిశీలించారు. అలాగే బేస్తవారపేట మండలంలోని మోక్షగుండం గ్రామంలో పలువురు రైతులు సాగుచేస్తున్న మల్బరీ తోటలను ఆమె పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పట్టు గూళ్లను పరిశీలించారు. ఉద్యాన అధికారుల సూచనలు పాటించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అలాగే చారిత్రక కంభం చెరువును ఆమె పరిశీలించారు. పర్యాటకులను ఆకర్షించేలా చెరువును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కొమరోలు మండలంలోని తాటిచర్ల మోటులోని షేడ్ నర్సరీలను కలెక్టర్ పరిశీలించారు. నర్సరీ నిర్వాహకులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఆమె వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీన, జిల్లా ఉద్యానవన అధికారి వై.గోపిచంద్, ఇరిగేషన్ డీఈ జాకీర్‌అహమ్మద్, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఎంపీడీవో హేమలత పాల్గొన్నారు.



విద్యార్థుల ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎమ్మెల్యే కొండయ్య



మృతుడు కుటుంబసభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 7 : చీరాల, ఈపురుపాలెం రోడ్డులో మంగళవారం రాత్రి ఆగంతుకల దాడిలో కత్తి పోట్లకు గురై మృతి చెందిన సయ్యద్ ఆరీఫ్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొండయ్య బుధవారం పరామర్శించారు. మృతదేహాన్ని పరిశీలించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని చెప్పారు. పోలీస్ ఉన్నతాధికారులు కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి

రెండు నెలల వ్యవధిలో నియోజకవర్గంలో జరుగుతున్న దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయని మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. హత్యకు గురైన ఆరీఫ్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు.

10లోపు దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 7: 108 వాహనాల్లో అత్యవసర మెడికల్ టెక్నీషియన్, పైలెట్/టెక్నీషియన్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మేనేజర్ ఎస్.విజయకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈహెచ్‌టీకి అర్హత జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్‌సైన్సెస్, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. 35 ఏళ్లలోపు వారు అర్హులని ఆయన పేర్కొన్నారు.

ఇడుపులపాయలో చీరాల విద్యార్థిని ఆత్మహత్య

సయ్యద్ జమీషా కురేషి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 7 : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చీరాల మండలం ఈపూరుపాలెంకు చెందిన 17 ఏళ్ల విద్యార్థిని బలవన్మరణం చెందింది. ఈ ఘటన అక్కడ మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మృతురాలు ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో 559 మార్కులు సాధించింది. దీంతో మూడోసారి జరిగిన కౌన్సెలింగ్‌లో ఇడుపులపాయ సబ్ క్యాంపస్, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ప్రస్తుతం సెకండియర్ చదువుతోంది. ఉదయం అందరూ లేచి చూసేసరికి బాత్‌రూంలో ఉరి వేసుకున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్ర్భాంతి చెందారు. వెంటనే ఇడుపులపాయకు బయలు దేరి వెళ్లారు.

దోపిడీ కేసులో పురోగతి

● పోలీసులు కీలకమైన ఆధారాల సేకరణ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 7: ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన యువకుడు వృద్ధురాలిపై దాడి చేసి బంగారం అపహరించిన కేసులో పోలీసులు పురోగతి సాధించారు. దుండగుడి కీలకమైన ఆధారాలను సేకరించారు. ఈనెల 5న ఒంగోలు నగరం ఏనుగుచెట్టు సమీపంలో గల అకమ్మపాలెంలో పట్టపగలు సుగుణమ్మ అనే వృద్ధురాలికి చెందిన అద్దెకు తీసుకుంటానని చెప్పి ఇంట్లోకి వెళ్ళి ఆమె తలపై బలంగా ఆయుధంతో కొట్టి గాయపరిచాడు. దీంతో ఆమె స్పృహ లేకుండా పడిపోవడంతో మెడలో ఉన్న బంగారపు ఆభరణాలు అపహరిచుకెళ్ళిన విషయం విదితమే. పోలీసులు సాంకేతిక విధానం ద్వారా కీలకమైన ఆధారాలు సేకరించి కేసు దర్యాప్తులో పురోగతి సాధించారు. త్వరలో నిందితుడని పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 8 :గత వైసీపీ ప్రభుత్వంలో అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన జిల్లాలను మార్చాలని, మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని 139 బీసీ కులాల జేఏసీ ఛైర్మన్ మిరియం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఎన్జీఓ భవన్‌లో బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటు చేయడం వల్ల ఒంగోలుకు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న కందుకూరు నియోజకవర్గాన్ని 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లూరు జిల్లాలో కలిపారన్నారు. అలాగే 30 కిలోమీటర్లదూరంలో ఉన్న అద్దంకిని వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న బాపట్ల జిల్లాలో కలపడం దారుణంగా ఉందని విమర్శించారు.

అరెస్టు కోరుతూ ఆందోళన

రోడ్డుపై బైఠాయించిన బాధిత బంధువులు

జేసీ హామీతో పరిస్థితి అదుపులోకి..

నిందితులను గుర్తించిన పోలీసులు

గాలింపు చర్యలు ముమ్మరం

బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, ఆగస్టు 7 : ఈపూరుపాలెం డిగ్రీ విద్యార్థి సయ్యద్ అమీన్ ఆరిఫ్ (18) హత్యపై బంధువులు, ముస్లిం మైనార్టీ ప్రతినిధులు పలు సంఘాలు భగ్గుమన్నాయి. బాధిత కుటుంబ సభ్యులతో సహా గడియార స్తంభం కూడలిలో బుధవారం బైఠాయించి ఆందోళనకు దిగారు. హత్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కత్తి పోట్లతో ఉన్న ఆరీఫ్ చిత్రాన్ని ప్రదర్శించి నినాదాలు చేశారు. ఆరీఫ్ తండ్రి ఖదీర్ అహ్మద్ మాట్లాడుతూ కుమారుడి మృతితో రోదిస్తున్న సమయంలో బుధవారం ఉదయం హంతకుల బంధువులు నేరుగా ఇంటికి వచ్చి బెదురించినట్లు చెప్పారు. సంబంధిత ఆధారాలను కూడా పోలీసులకు అందించినట్లు వివరించారు. ఈ ఘటనపై స్పందించిన జాయింట్ కలెక్టర్ సుబ్బారావు నేరుగా వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. ఆరీఫ్ సోదరికి 16 ఏళ్లు కావడంతో మైనార్టీ తీరిన తరువాత ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మైనార్టీ మంత్రి ఫరూక్‌తో నేరుగా ఫోన్‌లో మాట్లాడి హామీ ఇవ్వడంతో అక్కడ ఆందోళన విరమించారు. హాస్పిటల్ వద్దకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వెళ్లి కుటుంబాన్ని ఓదార్చారు. ప్రభుత్వం నుంచి ఆదుకుంటామని చెప్పారు. కాగా హత్యకు పాల్పడిన వారిని ఇప్పటికే పోలీసులు గుర్తించారు. నిందితుల్లో మొదటి వ్యక్తి సూర్యలంక రోడ్డులో జరిగిన హత్యతోపాటు పలు హత్యలకు పాల్పడినట్లు, అలాగే గంజాయి, కోడి పందాలు కేసులు కూడా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో పోలీసులు గాలలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ఘటనపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, జనసేన పార్టీ నాయకుడు ఆమంచి స్వాములు మద్దతు తెలిపారు. పోలీసులు పోస్టమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బంధువులు ర్యాలీగా అంత్యక్రియలు నిర్వహించారు.



ఆందోళన కారులతో మాట్లాడుతున్న జేసీ సుబ్బారావు

పగలూ వీధి లైట్లు వెలుగుతాయి..!

- మూడో వైరు లేకనే సమస్య
- పట్టించుకోని విద్యుత్ అధికారులు
- వృథా అవుతున్న పంచాయతీ నిధులు


నాలుగు రోడ్ల కూడలిలో పట్టపగలు వెలుగుతున్న వీది లైట్లు

బల్లికురవ, ఆగస్టు 7 : గ్రామ పంచాయతీలలో వీధి లైట్లతో నిధులు వృథా అవుతున్నాయి. విద్యుత్ శాఖకు పంచాయతీ నిధుల నుంచి క్రమం తప్పక కుండా నేరుగా జమ చేసకుంటున్నారు. ప్రజలకు ఉపయోగపడకుండానే ఆ నిధులు విద్యుత్ రూపంలో వృథా అవుతున్నాయి. కొన్ని గ్రామాలలో పట్టపగలు కూడా వీధి లైట్లు వెలుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పంచాయితీలకు విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. విద్యుత్ లైన్ మూడో వైరు లేకపోవడంవలనే నిరంతరాయంగా వీధి లైట్లు వెలుగుతున్నాయని పలువురు అంటున్నారు. బల్లికురవ మండలంలో 21 గ్రామ పంచాయతీలుండగా అధిక గ్రామాలలో వీధి లైట్లు 24 గంటలూ వెలుగుతున్నాయి. విద్యుత్ బకాయి ఉన్నాయంటూ పంచాయతీలకు నిధుల కోత విధిస్తున్న విషయం తెలిసిందే. అలాంటప్పుడు విద్యుత్‌ను పొదుపుగా వాడాలన్న సంగతిని అధికారుల మర్చిపోయారని ప్రజలు విమర్శిస్తున్నారు. అంబడిపూడి, వల్లాపల్లి, కొణిదెన, గంగపాలెం, వేమవరం, బల్లికురవ, అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడు, చెన్నుపల్లి, ఉప్పుమాగులూరు, కూకట్లపల్లి, వైదన, మల్లాయపాలెం, ముక్తేశ్వరం, నక్కబొక్కలపాడు, కొప్పెరపాలెం గ్రామాలలో వీధి లైట్లు రాత్రిపగలు వెలుగుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికార్లు మూడో వైరును ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ ఫీజులను ఏర్పాటు చేయాలని, పంచాయతీ నిధులు వృథా కాకుండా చూడాలని ప్రజలు కోరతున్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

అద్దంకి, ఆగస్టు 7 : విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం నియోజకవర్గంలో పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9-30 గంటలకు కోటపాడు, 10 గంటలకు మేదరమెట్ల, 10-15 గంటలకు అద్దంకి పట్టణంలోని కామేపల్లి కళ్యాణ మండపం,10-30 గంటలకు 4వ వార్డు, 11 గంటలకు 11వ వార్డు, 11-15 గంటలకు 15 వ వార్డు, 11-30 గంటలకు 18 వ వార్డు, 12-30 గంటలకు తిమ్మాయపాలెం లలో జరిగే కార్యక్రమాలలో మంత్రి రవికుమార్ పాల్గొనున్నారు.

చీరాలలో అలజడి..!

- రెండు నెలల్లో నాలుగు హత్యలు
- కారుకు దారివ్వలేదని యువకుడిపై కత్తులతో దాడి
- వారంతా మద్యం మత్తులో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షి వెల్లడి
- రక్తపు మడుగులో ఉన్న వ్యక్తిని స్వయంగా హాస్పిటల్‌కు పంపిన కలెక్టర్



చీరాలటౌన్, ఆగస్టు 7 : చీరాల్లో మరో హత్య జరిగింది. దీంతో రెండు నెలల్లో హత్యలు సంఖ్య నాలుగుకు చేరింది. తాజాగా జరిగిన ఘటనలో ఒకరి ముఖాలు ఒకరికి తెలియదు. ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ ఎటువంటి వివాదాలు లేవు. కేవలం అప్పటికప్పుడు జరిగిన స్వల్ప వివాదం వారి క్రూర బుద్ధిని బయట పెట్టింది. కనీస మానవత్వం కూడా లేకుండా అతి కిరాతకంగా, పాశవికంగా దారుణానికి ఒడిగట్టారు. తమ కారుకు దారివ్వలేదని దుర్మార్గులు నిండు ప్రాణాన్ని పొట్టన పెట్టుకున్నారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చీరాల - గుంటూరు రోడ్డులోని ఆదినారాయణపురం వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చీరాల మండలం ఈపూరుపాలెం యూసూఫ్‌నగర్‌కు చెందిన సయ్యత్ అమీన్ ఆరీఫ్ (18) చీరాల పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అతని తండ్రి కారు డ్రైవర్. ఆరిఫ్ కుటుంబంలో ఎక్కువ మంది ఆర్మీలో ఉండటం వలన ఇతనికి కూడా చిన్నపటి నుంచి ఆర్మీకు వెళ్లాలని ఆశ. దీంతో నిత్యం చదువుతో పాటు శరీర దారుఢ్యాన్ని పెంపొందించే వాటిపై ప్రత్యేక దృష్టి సారించేవాడు. ఈ నేపథ్యంలో ప్రతి రోజు సాయంత్రం పట్టణంలోని జిమ్‌కు వెళ్తుండాడు.

దారుణం జరిగిందిలా

ఎప్పటిలాగే ఆరీఫ్ మంగళవారం కూడా జిమ్‌కు వెళ్లి సైకిల్‌పై ఈపూరుపాలెంలోని ఇంటికి వెళుతున్నాడు. మధ్యలో మిత్రుడు కొండూరి మనోజ్ జత కలిశాడు. ఈ సమయంలో మనోజ్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, ఆరిఫ్ సైకిల్‌పె మాట్లాడుకుంటూ వెళుతున్నారు. అదే సమయంలో కోడి పందాల ఆటలో నగదు పోగొట్టుకుని కారులో అటుగా వెళుతున్న అనుమానితులు సైడ్ ఇవ్వాలని పెద్దగా హారన్ కొట్టారు. ఆరిఫ్‌కు కారులో ఉన్న వ్యక్తులకు వివాదం జరిగింది. దాంతో వారు విచక్షణను కోల్పోయి అతి కిరాతకంగా శరీరంపై పలు మార్లు కత్తులతో పొడిచారు.

హాస్పిటల్‌కు పంపిన కలెక్టర్

చీరాలలో అదే సమయంలో ఓ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను పరిశీలించి బాపట్ల బయలు దేరిన కలెక్టర్ వెంకటమురళి అటుగా వెళుతున్నారు. కలెక్టర్ కాన్వాయ్ సైరన్ వినగానే దుండగులు అక్కడ నుంచి పరారయ్యారు. రక్తపు మడుగులో ఉన్న ఆరీఫ్‌ను కలెక్టర్ ఆటోలో ఎక్కించి హాస్పిటల్‌కు పంపారు. ఫోన్‌లో ఘటనను తెలిపి చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుషార్ డూడీని ఆదేసించారు. ఏరియా హాస్పిటల్‌కు చేరిన ఆరీఫ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

వరుస హత్యలతో ప్రజలు బెంబేలు

చీరాల పరిధిలో గడిచిన రెండు మాసాల్లో నాలుగు హత్యలు జరిగాయి. ఈపూరుపాలెం నడిబొడ్డున పముజుల సుచరిత(21)ని హత్యాచారం చేయగా హోంమంత్రి సహా రంగంలోకి దిగి నిందితులను జైలుకు పంపారు. కొద్ది రోజులకే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో కేటరింగ్ చేసుకుని జీవించే కంచర్ల సతీష్‌ను(38) దారుణంగా హతమార్చారు. ఈపూరుపాలెం జెండా చెట్టు వీధిలో వేల సంఖ్యలోని ఇళ్ల మధ్యలో విశ్రాంతి ఉపాధ్యాయిని లలితమ్మ(78)ని మట్టుబెట్టారు. ఇలా వరుస హత్యలతో క్షీరపురి ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ఎస్ఈబీ జాడే కరువు

ప్రస్తుతం ఎస్ఈబీ అధికారుల దాడులు కానరావడం లేదు. ప్రభుత్వం నూతన పాలసీని ప్రకటించకముందే ఎస్ఈబీ అధికారులు నిద్ర మత్తులో ఉన్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. నెలవారీ మామూళ్లతో బయటకే రావడం లేదన్న ఆరోపణలున్నాయి. మరోవైపు గంజాయి గ్రామీణ ప్రాంతాల్లో గుప్పుమంటోంది. గంజాయి, మద్యంకు బానిసలైన కొందరు పట్టపగలే హత్యలు చేస్తున్నారు. మరోవైపు కోడి పందాలు, సారా అమ్మకాలు పెరిగాయి. కొందరు పోలీసులు పందెం కోళ్ల పెంపకంపై మక్కువతో పరోక్షంగా అసాంఘిక శక్తులకు సహకరిస్తున్నట్లు విమర్శలున్నాయి. మరికొంతమంది పోలీసులు మామూళ్లకు కక్కుర్తిపడడంతోనే దాడులు చేసే మూకలు పేట్రేగి పోతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు శాంతిభద్రతలను సరిచేయకుంటే మరెన్ని దారుణాలు జరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఉషారెడ్డి

గ్రంథ పఠనంతో విజ్ఞానం

పంగులూరు, ఆగస్టు 7 : గ్రంథ పఠనంతో విజ్ఞానంతో పాటు వికాశం లభిస్తుందని, విద్యార్థి దశ నుంచే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులోని ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని బుధవారం ప్రిన్సిపాల్ ఉషారెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలుగా మారుతున్నారని అన్నారు. మంచి పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానవంతులు అవుతారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు కనుమూరి సంజయ్‌బాబు, పీడీ మేకల సీతారామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రేడ్‌ల ఆధారంగా రెమిడియల్ టీచింగ్ చేయాలి

- విద్యార్థులపై బ్యాగుల భారం ఎక్కువ ఉండరాదు
- ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

అద్దంకి, ఆగస్టు 7 : విద్యార్థులకు గ్రేడ్‌ల ఆధారంగా రెమిడియల్ టీచింగ్ చేయాలని ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి అన్నారు. అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. బాలికల ఉన్నత పాఠశాలలో కొంత మంది విద్యార్థినుల బ్యాగ్‌లలో ఎక్కువ బరువు ఉండటాన్ని గమనించి టైంటేబుల్ ఆధారంగా బుక్స్ తెచ్చుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఈ నెలలో జరగబోయే ఫార్మాటివ్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు వారంతపు పరీక్షలు నిర్వహించే వచ్చే గ్రేడుల ఆధారంగా రెమిడియల్ టీచింగ్ చేయాలన్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్, ట్యాబులు తరగతిలో ఉపయోగిస్తూ విద్యార్థుల అకడమిక్ సామర్థ్యాలను పెంచాలన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు లెసన్‌ప్లాన్ లేకుండా బోధన చేయడం గమనించి మందలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠ్యపుస్తకాల అందినవా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అన్ని పాఠశాలలలో ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, పాఠ్య ప్రణాళికతో బోధన జరిగే విధంగా చేయాలని ఎంఈవో గంగాధరరావును ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో 1 గంగాధరరావు, పాఠశాలలో హెచ్‌ఎంలు డీఎస్ పద్మావతి, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అద్దంకి, ఆగస్టు 7 : రోడ్డు దాటుతున్న వ్యక్తిని మోటార్‌సైకిల్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు మండలంలోని చక్రాయపాలెంకు చెందిన బి.అంజయ్య గోపాలపురంలో గొర్రెల కాపరిగా ఉంటున్నాడు. బుధవారం రాత్రి పాలకేంద్రంలో పాలు పోసేందుకు అంజయ్య రోడ్డు దాటుతుండగా పల్నాడు జిల్లా గోగనకొండకు చెందిన పేతురు అద్దంకిలో నివాసం ఉంటూ వి.కొప్పెరపాడు చర్చిలో ప్రార్థనకు మరియదాసుతో కలిసి మోటార్‌సైకిల్‌పై వెళ్తూ గోపాలపురంవద్ద అంజయ్యను ఢీకొట్టాడు. మోటార్ సైకిల్‌పై ఉన్న పేతురు, రోడ్డు దాటుతున్న అంజయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.


చికిత్స చేస్తున్న సిబ్బంది

బొబ్బేపల్లిలో మలేషియా బృందం పర్యటన

నర్సరీలలో మిరప, కూరగాయల సాగుపై అధ్యయనం


దండుదారి వద్ద పాలిహవుస్‌లో మిరపనారు పెంపకాన్ని పరిశీలిస్తున్న మలేషియా బృందంతె రైతులు వీరాంజనేయులు, శ్రీనివాసరావు

మార్టూరు, ఆగస్టు 7 : మండల పరిధిలో మార్టూరు నుంచి గన్నవరం వెళ్లే రోడ్డులో బొబ్బేపల్లి దండుదారి వద్ద దండారామస్వామి క్షేత్రంలో నర్సరీలను బుధవారం మలేషియాకు చెందిన ప్రత్యేక బృందం పరిశీలించింది. షేడ్ నెట్‌లు, పాలి హౌస్ ద్వారా నర్సరీలలో మిరప, కూరగాయలను సాగుచేస్తున్న విధానాన్ని, మిరప నారు పెంపకాన్ని బృందం అధికారి డాక్టరు రైస్ హుస్సేన్, మహిళ తోపాటు, మరో ఇద్దరు సభ్యులు పరిశీలించారు. వారికి ఆదర్శ రైతు దండా వీరాంజనేయులు షేడ్‌నెట్, పాలి హౌస్‌లలో మిరపనారు సాగును వివరించారు. రైతుల కోసం ఐదేళ్ల కిందట ప్రత్యేకంగా తెప్పించి విత్తనాలు తయారు చేస్తున్న యంత్రాన్ని చూపించారు. దానిని వారు ఆసక్తిగా పరిశీలించి వివరాలను వీరాంజనేయులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత సమీపంలోని దండా శ్రీనివాసరావుకు చెందిన పాలి హౌస్‌లో పెంచుతున్న మిరప నారును వారు పరిశీలించారు. వర్షపునీరు వృథా కాకుండా పారంఫాండ్‌లోకి చేరేలా ఏర్పాటు చేసిన తొట్లు, ఆ నీటిని రీసైక్లింగ్ చేసి సాగుకు వినియోగించే పద్ధతిని అధికారుల బృందానికి రైతు శ్రీను వివరించారు. అనంతరం ఒకే దానిలో వంగ, టమోటా సాగుచేసే గ్రాఫ్టింగ్ విధానాన్ని వారికి చూపించి, వివరించారు. అంతకు ముందు బొబ్బేపల్లిలో ఆదర్శ రైతు పెంట్యాల శరత్ సాగు చేస్తున్న ఆర్గానిక్ వవసాయ పద్ధతులను మలేషియా అధికారులు పరిశీలించారు. మలేషియాలో మిరప, నారు సాగుచేయడం, కూరగాయల పెంపకం తదితర పంటల సాగు కోసం అధ్యయనం చేసేందుకు ఇక్కడ పర్యటిస్తున్నట్లు బృంద సభ్యులు పేర్కొన్నారు. షేడ్‌నెట్, పాలిహవుస్‌లద్వారా నర్సరీలలో ప్రత్యేకంగా సాగు చేసే పద్ధతులు తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దండా ఆంజనేయులు, తాళ్లూరి కోటేశ్వరరావు, సయ్యద్ మౌలాలి, పెంటేల శరత్,పలువురు నర్సరీ యజమానులు, పలువురు రైతులు పాల్గొన్నారు.


ప్రగడ కోటయ్య చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న జంజనం

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

చీరాల, ఆగస్టు 7 : మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా ప్రజాబంధు ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ చీరాల చేనేతకు పట్టిల్లన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు,నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ సమస్యలపై వినతి

మార్టూరు, ఆగస్టు 7 : మండలంలోని వలపర్ల గ్రామంలో ఏళ్ల కిందట నిర్మించిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, గ్రామంలోని చాలా కాలనీలలో స్తంభాల నుంచి కరెంటు తీగలు కిందకు వేలాడుతున్నాయని వాటిని సరిచేయాలని, పాత స్తంభాల స్థానంలో కొత్త వాటిని చేయాలని మార్టూరు ఏడీ సురేంద్రకు ఏపీ కన్జూమర్ రైట్స్ ప్రొటెక్షన్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ కరిముల్లా బుధవారం మార్టూరులో వినతిపత్రాన్ని అందజేశారు.


గోడ పక్కన ఉంచిన ఎన్‌టీఆర్, పరిటాల విగ్రహాలు

ఏడేళ్లుగా నిరాదరణ

నామ్ రోడ్డు నిర్మాణంలో ఎన్‌టీఆర్, పరిటాల విగ్రహాల తొలగింపు

అద్దంకి, ఆగస్టు 7 : అద్దంకి పట్టణంలో రెండు చోట్ల ఉన్న ఎన్టీఆర్ విగ్రహంతోపాటు పరిటాల రవి విగ్రహాన్ని తొలగించారు. నామ్ రోడ్డు విస్తరణ సమయంలో ఏడు సంవత్సరాల కిందట దామావారిపాలెం వద్ద ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాలను తొలగించి సమీపంలో ఓ గోడ పక్కన ఉంచారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించి ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో ఉంచారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన వెంటనే మరలా ఏర్పాటు చేస్తామన్న హామీతో తొలగించినప్పటికి అనంతరం వాటి ఏర్పాటు పై నిర్లక్ష్యం కొనసాగింది. ఏడేళ్ల గడుస్తున్నా వాటి ఏర్పాటు పై నిర్లక్ష్యం కొనసాగుతుండటం పట్ల తెలుగుతమ్ముళ్లలో ఆగ్రహం వ్యక్తం అవుతుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటికైనా తొలగించిన విగ్రహాలను ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలుగు తమ్ముళ్ల కోరుతున్నారు.

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగేంద్ర

చినగంజాం, ఆగస్టు 7 : తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరతుందని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బి.నాగేంద్ర అన్నారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కడవకుదురు సచివాలయం-1లో తల్లి పాల వారోత్సవాలలో భాగంగా బాలింతలకు, తల్లులకు బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ తల్లి పాలలో బిడ్డకు కావలసిన అన్ని రకాల పోషక విలువలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శిరీష, ఆశ కార్యకర్తలు, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

పంగులూరు, : బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలను తాగించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య అన్నారు. ముప్పవరం గ్రామ సచివాలయంలో బుధవారం తల్లిపాల వారోత్సవం సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ముర్రుపాలు అమృతంతో సమానమన్నారు. గర్భిణులు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీవో కృష్ణకుమారి కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుస్మిత, సూపర్ వైజర్ పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో జాన్సీ అన్నారు. బుధవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా ఇంకొల్లులో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుట్టిన పిల్లలకు తల్లి పాలు అమృతం లాంటివని వ్యాధినిరోధక శక్తిని పెంచుతుందని సూచించారు. ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్చూరు : తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీవో జి.సుభద్ర అన్నారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో బాగంగా బుధవారం సీడీపీవో కార్యాలయం నుంచి గర్భిణిలు, బాలింతలు, ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట వ్యవధిలోపు బిడ్డకు ముర్రుపాలు తాగిస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. ఆరు నెలలు తగ్గకుండా బిడ్డకు తల్లి పాలు తప్పని సరిగా ఇవ్వాలని ఆ విషయాన్ని గర్భిణులు గుర్తించాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ప్లకార్డులు, బ్యానర్‌లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పర్చూరు ప్రాజెక్టు పరిధిలోని సూపర్ వైజర్లు అన్నపూర్ణ, దీపాదేవి, రాధ, సుజాత, పద్మావతి, శిరీష పర్చూరు, యద్దనపూడి, మార్టూరు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.


రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ తెన్నేటి

రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన ఎంపీ తెన్నేటి

చీరాలటౌన్, ఆగస్టు 7 : చీరాల రైల్వే స్టేషన్‌ను బుధవారం రాత్రి బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను సూపరింటెండెంట్ సింగయ్యను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రయాణికుల అవసరాలు, వివిధ వసతులపై ఆరా తీశారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గ్రానైట్ ముడిరాయి లారీ బోల్తా

బల్లికురవ, ఆగస్టు 7 : గోతులను తప్పించబోయి గ్రానైట్ ముడి రాయి లారీ బోల్తా కొట్టిన సంఘటన బుధవారం నక్కబొక్కలపాడు సమీపంలో జరిగింది. బల్లికురవ వీర్ల కొండ గ్రానైట్ క్వారీల నుంచి ముడి రాయిని గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తుండగా నక్కబొక్కలపాడు కొణిదెన ఆర్అండ్‌బీ రోడ్డులో ఉన్న గోతులను తప్పించే క్రమంలో అదుపు తప్పి లారీ మార్జిన్‌లోకి బోల్తా కొట్టింది. లారీ పడి పోగానే డ్రైవర్ కిందికి దూకడంతో ప్రమాదం తప్పింది. రాయి మాత్రం కింది పడిపోయింది. రోడ్డు మరమ్మతుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు అంటున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

బల్లికురవ, ఆగస్టు 7 : మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఇంటి వరాండాలో నిద్రిస్తున్న షేక్ ఖాదర్‌బీ మెడలో గుర్తు తెలియని దొంగ బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. దొంగను పట్టుకునే క్రమంలో జరిగిన పెనుగులాటలో ఆమె మనుమడు అనిల్ కిందపడి గాయపడ్డాడు. ఖాదర్‌బీ తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి గోడ దూకి ఇంట్లోకి వచ్చి తన మెడలోని రెండున్నర సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారవుతుండగా తన మనవడు లేచి దొంగను పట్టుకునేందుకు ప్రయత్నించే క్రమంలో కిందపడి గాయపడ్డాడని చెప్పారు. గొలుసు విలువ రూ.2లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేబుల్ టీవీ నుంచి వచ్చానంటూ.. మూడు సెల్ ఫోన్‌లు చోరీ

మార్టూరు, ఆగస్టు 7 : కేబుల్ టీవీ నుంచి వచ్చానంటూ ఆగంతకుడు ఇంట్లోకి ప్రవేశించి మూడు సెల్‌ఫోన్లను ఎత్తుకుపోయాడు. ఈ ఘటన బుధవారం మార్టూరు రాయల్ స్కూల్ ఎదురుగా జరిగింది. వాటిలో ఒక సెల్‌ఫోన్ రూ.లక్ష విలువైన ఐఫోన్ కాగా, రూ.30వేల విలువైన మరో రెండు సెల్‌ఫోన్‌లు దొంగిలించారని ఇంటి యజమాని ఏలూరి రమ తెలిపారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన ఏలూరి రమ, ఆమె కుమార్తె కావ్య ఇంట్లో ఉంటున్నారు. కావ్య ఎంఎస్ కోసం శుక్రవారం అమెరికా వెళ్లేందుకు ఇంట్లో బిజీగా ఉన్నారు. మధ్యాహ్నం వేళ మధ్య వయస్కుడైన వ్యక్తి చానళ్లు వస్తున్నదీ లేనిదీ చూడాలని ఇంట్లోకి వచ్చాడు. నిన్ను ఎప్పుడూ చూడలేదని వార అనడంతో తనను కొత్తగా తీసుకున్నట్లు చెప్పారు. వారిని మాటల్లో పెట్టి టీవీ పక్కనే చార్జింగ్ పెట్టి ఉన్న మూడు సెల్‌ఫోన్లను ఎత్తుకుపోయాడు. రమ ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆగంతకుడు అదే వీధిలో ఉన్న పాత్రికేయుడు అయ్యన్న బాబు కంటపడగా ఎవరు నువ్వు అని ప్రశ్నించి విడిచిపెట్టాడు. కొద్ది సేపటి తర్వాత బాధితురాలు రమ వచ్చి ఫోన్ల విషయం చెప్పడంతో అందరూ వెదకడం ప్రాంభించారు. ఈ విషయమై స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉత్తమ ఫలితాలను సాధించేలా బోధించాలి

బల్లికురవ, ఆగస్టు 7 : కార్పొరేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధన చేయాలని బాపట్ల జిల్లా ఇంటర్ బోర్డు వృత్తి విద్యాధికారి ఎర్రయ్య కోరారు. బుధవారం బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన ఉచిత పాఠ్య పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు.

జనార్దన్ కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన


సీసీ రోడ్డును శంకుస్థాపన కార్యక్రమంలో టీడీపీ నాయకులు

మార్టూరు, ఆగస్టు 7 : మార్టూరు గ్రామ పంచాయతీలోని జనార్దన్ కాలనీలో పంచాయతీ నిధులు సుమారు రూ.6లక్షలతో బుధవారం సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. గతంలో ఈ రోడ్డుకు సైడుకాల్వలు నిర్మాణం చేయడంతో ప్రస్తుతం సిమెంట్ రోడ్డు నిర్మాణానికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచన మేరకు పంచాయతీ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో షేక్‌రజాక్, కామినేని జనార్దన్, కన్నెగంటి శ్రీనివాసరావు, కమ్మ శివనాగేశ్వరరావు, షేక్ ఫరూక్, వెంకటేశ్వర్లు, బుడే పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

అద్దంకి, ఆగస్టు 7 : ఆర్టీసీ బస్సును మోటార్‌సైకిల్ వెనుక నుంచి ఢీకొట్టడంతో బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీకి చెందిన ఒ.రాఘవ మార్టూరులోని కూరగాయల దుకాణంలో పనిచేస్తున్నారు. రాఘవ బైక్‌పై ముందు వైపు ట్యాంక్ మీద కుమారుడు మణికంఠ (6)ను ఎక్కించుకొని బుధవారం రాత్రి అద్దంకిలో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న అత్త వద్దకు వస్తుండగా కాకానిపాలెం కాలువ కట్ట సమీపంలో ఇంకొల్లు నుంచి అద్దంకి వస్తున్న ఆర్టీసీ బస్ స్పీడు బ్రేకర్ వద్ద నిదానంగా వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన మోటార్‌సైకిల్ ఢీకొట్టింది. దీంతో మణికంఠ రోడ్డు పై పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


గుంటూరు చానల్ పొడిగింపుపై స్పందించాలి

నల్లమడ రైతు సంఘ అధ్యక్షుడు డాక్టర్ కొల్లా


పర్చూరు, ఆగస్టు 7 : గుంటూరు చానల్ పొడిగింపు ప్రక్రియపై స్పందించి పనులు పూర్తి చేయాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ అన్నారు. మాజీ ఎంపీపీ కోటా హరిప్రసాద్ అధ్యక్షతన బుధవారం కొల్లా వెంకటనారాయణ కల్యాణ మండప ప్రాంగణంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లా మాట్లాడుతూ గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొగించడంతోపాటు, నల్లమడ వాగు ఆధునీకరణకు నిధులను కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. చానల్ పొడిగింపుతో 50 గ్రామాల ప్రజలకు తాగునీటితోపాటు, సాగునీరు అందుతుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సమస్యను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీంతో గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు రూ.300 కోట్ల రూపాయలను కటాయిస్తూ ప్రకటన వెలువడిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ చానల్‌ను పొడిగిస్తామని చెప్పి రివర్స్ టెండర్ పేరుతో కాలయాపన చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ విజయకుమార్ మాట్లాడుతూ నల్లమడ వాగు ఆధునీకరణకు నోచుకోకపోవడంతో పొలాలు ముంపునకు గురై నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మానం విజేత, ఒగ్గిశెట్టి నరసింహం, కొల్లా రామన్, బాషా, చౌదరిబాబు, అడ్డగడ వెంటకేశ్వర్లు, కొల్లా శివరాంప్రసాద్, కఠారి సురేంద్రబాబు, గడ్డిపాటి శ్రీనివాసరావు, తులసి అప్పారావు రైతులు పాల్గొన్నారు.


కోటయ్య చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న జంజనం

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 8 ఆగస్టు 2024



దగదర్తి విమానాశ్రయంపై మళ్లీ ఆశలు చిగురించాయి. వైసీపీ ప్రభుత్వంలో అడుగంటిన ఆశలు చంద్రబాబు ప్రభుత్వంలో మళ్లీ పురుడు పోసుకున్నాయి. ఈ విమానాశ్రయాన్ని తొలి ప్రాధాన్యతగా పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో నెల్లూరీయుల చిరకాలవాంఛ నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి.



ఆకాశయానంపై మళ్లీ ఆశలు

తొలి ప్రాధాన్యం కింద దగదర్తి విమానాశ్రయం పూర్తి

నెల్లూరు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ సముద్రతీరం ఉన్న నెల్లూరు జిల్లా వ్యవసాయంతోపాటు పారి శ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో నెల్లూరులో విమానాశ్రయం స్థాపించాలనే ప్రతిపాదన 2007లో వచ్చి నా కార్యరూపం దాల్చలేదు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక తొలి అడుగుపడింది. తిరుపతి, చెన్నై, నెల్లూరు నగరాలను ట్రైసిటీగా అభివృద్ధి చేయాలనే సంకల్పంలో భాగంగా అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు నెల్లూరులో విమానాశ్రయం ఏర్పాటుకు నిర్ణయించారు. అందుకోసం నెల్లూరు- కావలి జాతీయ రహ దారిపై ఉన్న దగదర్తి మండలం దామవరం వద్ద 1,379 ఎకరాలను సేకరించారు. పట్టా భూములు ఎకరానికి రూ.18లక్షలు, సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములకు రూ. 13 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 1,060 ఎకరాల భూములను రైతులు ప్రభుత్వానికి అప్పగించారు. 2019 జనవరిలో సీఎం హోదాలో చంద్రబాబు విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. వెంటనే పనులు మొదలయ్యాయి. రన్‌వేకి సంబంధించిన ఎర్త్ వర్క్ కూడా కాంట్రాక్టరు మొదలు పెట్టారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో విమానాశ్రయానికి బ్రేకులు పడ్డాయి.

● జిల్లావాసులకు జగన్ షాక్

2019 ఎన్నికల్లో వైసీపీకి బ్రహ్మరథం పట్టిన నెల్లూరు జిల్లా ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి భారీ షాక్ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో మొదలైన అభివృద్ధి పనులను అటకెక్కించే క్రమంలో దగదర్తి విమానాశ్రయం నెత్తిన చెత్త వేశారు. దీంతో విమానాశ్రయం పనులు ఆగిపోయాయి. పనులు చేస్తున్న కాంట్రాక్టరు వెనక్కు వెళ్లిపోయారు. నాలుగేళ్లపాటు నాన్చి... నాన్చి నెల్లూరులో విమానాశ్రయాన్ని రద్దు చేస్తున్నట్లు జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఈ విమానాశ్రయాన్ని ప్రకాశం జిల్లాకు తరలిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో నెల్లూరు జిల్లా వాసుల చిరకాల కోరిక అడుగంటిపోయింది.

● బాబు రాకతో..

చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో మళ్లీ దగదర్తి విమానాశ్రయంపై ఆశల చిగురించాయి. చెన్నై మహానగరానికి అనుసంధానం చేస్తూ తిరుపతి-నెల్లూరు నగరాలను ట్రై సిటీగా అభివృద్ధి చేయాలనే చంద్రబాబు బలమైన సంకల్పం మళ్లీ ప్రాణం పోసుకుంది. ఈ క్రమంలోనే విమానాశ్రయం నిర్మాణానికి చంద్రబాబు సిద్ధమయ్యారు. దగదర్తి విమనాశ్ర యాన్ని మొదటి ప్రాధాన్యత కింద పూర్తి చేయాలని, అందుకు అవసరమైన పనులు మొదలు పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులను ఆదేశించారు. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే రెండేళ్లలో విమానాశ్రయం పనులు పూర్తి అవుతాయి. నెల్లూరుజిల్లా వాసుల కల నెరవేరుతుంది.



దామవరం వద్ద విమానాశ్రయం ప్రతిపాదిత ప్రాంతం

అటవీ భూముల్లో ఇసుక రవాణా

● అక్రమార్కులకు అధికారుల పరోక్ష సహకారం

ఉలవపాడు : మండలంలోని చాకిచర్ల పంచాయతీ పరిధిలోని చినపట్టపుపాలెం, పెదపట్టపుపాలెం పంచాయతీ పరిధిలోని అటవీ శాఖ భూముల్లో విచ్చల విడిగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. స్థానికంగా ఉన్న టైరుబండ్లు (ఎడ్లబండ్లు) యజమానులు అటవీ శాఖ అధికారులకు నెల మామూళ్లు ఇచ్చి బకింగ్‌హాం కాలువకు సమీపాన ఇసుకను తోడేస్తున్నారు. పల్లెపాలెం గృహాల సమీపంలో ఇసుక మేటలను కొల్లగొట్టి అక్రమంగా తరలిస్తున్నారని ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. తీర ప్రాంత గ్రామాల్లో భవన నిర్మాణాలకు ఫారెస్టు భూముల్లో నాణ్యమైన ఇసుక దొరుకుతుండటంతో వాగులు, వంకలు, ఏరుల్లో లభ్యమయ్యే ఇసుకతో అవసరం లేకుండా పోయింది. అదీగాక దూర ప్రాంతాల నుంచి ఇసుక కొనుగోలుకు అధిక మొత్తం వెచ్చించాల్సి రావడంతో తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే ఫారెస్టు ఇసుకపైనే భవన నిర్మాణదారులు మొగ్గు చూపారు. ఇంకేముంది.. కొందరు ట్రాక్టర్లతో కాకుండా ఎడ్లబండ్లతో గుట్టుచప్పుడు కాకుండా ఒక బండి ఇసుక డిమాండును బట్టి రూ.1000 వరకు కూడా అమ్ముతున్నారని సమాచారం. చిన్నపట్టపుపాలెం నుంచి పల్లెపాలెం వరకు బకింగ్‌హాం కాలువ గట్టు పొడవున ఇసుక తీసిన గోతులు దర్శనమిస్తున్నాయి. అయితే, ఇదంతా ఫారెస్టు అధికారులకు తెలియకుండా జరగలేదని తొలుత అడపాదడపా దాడులు చేసి ఆ తర్వాత వాళ్లతో చేతులు కలిపి ఇసుక రవాణాకు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



ఫారెస్టు భూముల్లో ఇసుక కోసం విచ్చలవిడిగా తవ్విన గోతులు



వైసీపీ ప్రభుత్వంలో జిల్లా నుంచి ఇసుకను చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు చేరవేస్తూ రూ.కోట్లు గడించిన మాఫియాకు ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక బ్రేకులు పడ్డాయి. గడిచిన రెండు నెలలుగా మాఫియా తన అక్రమ వ్యాపారాలను నిలిపేసింది. అయితే, ఈ రెండు నెలల్లో అధికార యంత్రాంగాన్ని దారిలోకి తెచ్చుకున్న మాఫియా మళ్లీ అక్రమ రవాణాను ప్రారంభించింది. గడిచిన వారం రోజులుగా నిత్యం పదుల సంఖ్యలో భారీ లారీల ద్వారా ఇసుకను జిల్లా దాటించేస్తోంది. ఒక లారీ ఇసుకను చెన్నైలో అన్‌లోడ్ చేస్తే రవాణా ఖర్చులు పోను రూ.లక్ష వరకు ఆదాయం మిగులుతున్నట్లు తెలుస్తోంది. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా ఈ మొత్తంలో సెబ్, పోలీసులకు కొంత ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మళ్లీ మాఫియా!

● దర్జాగా చెన్నైకి ఇసుక అక్రమ రవాణా ● మాఫియా లీడర్‌గా బుచ్చి మండల వ్యాపారి

● దొంగ బిల్లులతో దర్జాగా తరలింపు ● నెలమామూళ్లతో అధికారుల కునుకు

నెల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జిల్లాలో అధికారికంగా ఇసుక రీచ్‌లు నడవడం లేదు. పర్యావరణ అనుమతులు లేకపోవడంతో తవ్వకాలు నిలిచిపోగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం యార్డుల్లోని ఇసుకను ప్రజలకు అందిస్తోంది. అయితే ఇసుక మాఫియా మాత్రం రాత్రివేళల్లో పెన్నా నదిలో గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు జరిపి ఓ చోట డంప్ చేసుకుంటోంది. అక్కడ నుంచి ఒక్కో లారీలో 50 టన్నులకుపైగా ఇసుకను చెన్నైకు తరలిస్తున్నారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఈ లారీలన్నీ రోడ్డు మీదకు వస్తున్నట్లు అంతర్గత వర్గాల ద్వారా తెలుస్తోంది. వేకువజామున ఐదు గంటల కంతా చెన్నై రెడ్‌హిల్స్ దగ్గర అన్‌లోడ్ చేసేస్తున్నట్లు సమాచారం. బుచ్చిరెడ్డి పాళెం మండలానికి చెందిన ఓ ఇసుక వ్యాపారి ఈ అక్ర మ రవాణాలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ఈ వ్యక్తే అడ్డూ అదుపూ లేకుండా దోచుకు న్నారని ప్రచారం జరుగుతోంది. చెన్నైకు ఇసుక అక్రమ రవాణా చేసేవారందరికీ ఈయనే ముందుండి పోలీసు స్టేషన్లను మేనేజ్ చేస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఆయన తన పంథాను మార్చుకోలేదు. విషయం తెలుసుకున్న మైనింగ్ అధికారులు బుచ్చి మండలం కాగులపాడు పెన్నా ఒడ్డున భారీ ఇసుక డంప్‌ను గుర్తించారు. ఆ ఇసుకను సీజ్ చేసి సదరు వ్యక్తిపై కేసు కూడా పెట్టారు. అప్పటి నుంచి కొన్నాళ్లు స్థానికంగానే ఇసుక వ్యాపారం చేసిన ఈ వ్యక్తి మళ్లీ అక్రమార్కులను సిండికేట్ చేసినట్లు తెలుస్తోంది. పోలీసు, సెబ్‌ను మేనేజ్ చేసుకున్నప్పటికీ మైనింగ్ అధికారులు పట్టుకుంటే ఇబ్బందులు తప్పవని భావించిన ఈ మాఫియా దొంగ బిల్లులతో ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. తడ వరకు ఇసుక పేరుతో దొంగ బిల్లులు పెట్టుకోవడం, అక్కడ నుంచి సిలికా పేరుతో దొంగ బిల్లులు పెట్టుకొని చెన్నై వరకు తీసుకెళు తున్నట్లు సమాచారం. కొన్ని రోజులుగా మళ్లీ అక్రమ రవాణా మొదలవడంతో సమాచారం సేకరించిన ఇంటెలిజెన్స్ వర్గాలు ఉన్నతాధి కారులకు నివేదించాయి. కానీ ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసు, సెబ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రతి నెలా ఠంచనుగా ప్రతి పోలీసు స్టేషన్‌కు మామూళ్లు కడుతున్నట్లు ఆ మాఫియా వర్గాలే బహిరంగంగా చెప్పుకుంటుండటం గమనార్హం. ఈ మాఫియాకు ఆదిలోనే బ్రేక్ వేయకపోతే భవిష్యత్‌లో మరింత మంది ఈ ఇసుక అక్రమ రవాణా వ్యాపా రంలోకి దిగే ప్రమాద ముందన్న అభి ప్రాయం వ్యక్తమవుతోంది.

కఠిన చర్యలు తప్పవు

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రస్తుతం నదిలో తవ్వకాలకు ఎక్కడా అనుమతులు లేవు. కేవలం మర్రిపాడు యార్డులో మాత్రమే విక్రయాలు జరుగుతున్నాయి. అక్రమ తవ్వకాలపై నిఘా ఉంచాం. అన్ని శాఖలతో కూడిన టాస్క్‌ఫోర్స్ కూడా పనిచేస్తోంది. ఇటీవల కాగులపాడులో నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసి కేసు కూడా పెట్టాం. అలానే పోలీసు శాఖ అక్రమ రవాణాపై 25 ఎఫ్ఐఆర్‌లు కూడా కట్టింది.

- శ్రీనివాసకుమార్, మైనింగ్ డీడీ



నేత కార్మికులను సన్మానిస్తున్న చేనేత సంఘాల నాయకులు

జీఎస్టీ ఎత్తేయాలి!

● గిట్టుబాటు ధర కల్పించండి

● జిల్లాలో నేత బజారును ఏర్పాటు చేయాలి

● జాతీయ చేనేత దినోత్సవ సభలో నాయకులు

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 7 : చేనేతలను ఆర్థికంగా కుంగదీస్తున్న జీఎస్టీని తొలగించాలని చేనేత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు బుధవరపు బాలాజీ, కాసా శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, దవాంగ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నం సతీష్ తదితరులు మాట్లాడారు. గిట్టుబాటు ధర కల్పించాలని, జిల్లాలో నేత బజార్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా సబ్సిడీతో రంగులు, రసాయనాలు, నూలు అందించాలని డిమాండ్ చేశారు. చేనేతల సమస్యలపై కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని వారిని అభివృద్ధి పథంలో నడిపించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. హ్యాండ్లూమ్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 11 రకాల చేనేత వస్త్రాలను హ్యాండ్లూమ్ మీదే తయారయ్యేలా ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకోవాలని కోరారు. నగరంలోని ఆప్కో స్థలాన్ని చేనేత వర్గాలకు కేటాయించి నేత బజారు, కల్యాణ మండపం, చేనేత కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం కేంద్ర కమిటీ సభ్యులు రామనాథం రాజశేఖర్, పెంచలయ్య, కొప్పర్తి హరినాథ్, గుత్తికొండ వెంకయ్య, ఏఐడబ్ల్యూఎఫ్ కేంద్ర కమిటీ సభ్యుడు శేషయ్య, పద్మశాలి యువసేన ప్రతినిధి మునగపాటి రమేష్, పమజుల ప్రదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులను సన్మానించారు.



గాంధీ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

● చేనేతల అభివృద్ధికి కృషి : కలెక్టర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన చేనేత కార్మికులకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గాంధీబొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. టౌన్‌హాలు వరకు సాగిన ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ వరప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి వెంటకయ్య, జిల్లా సహకార అధికారి గురప్ప, చేనేత ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, దేవాంగ సమితి నాయకులు మన్నెం సతీష్, శంకయ్య, పమజుల రవి, చేనేత సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలి ఇప్పించండి సారూ!

● రెండు నెలలుగా అందని వేతనం

● రూ.40 కోట్ల మేర బకాయిలు

● ఆర్థిక ఇబ్బందుల్లో గ్రామీణ ప్రజానీకం

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 7 : 'కూలి డబ్బులు ఇప్పించండి మహాప్రభో..' అంటూ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలు అధికారులను వేడుకుంటున్నారు. రెండు నెలలుగా పనులు చేయడం తప్ప వేతనం ఇవ్వక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లావ్యా ప్తంగా సుమారు రూ.40 కోట్ల మేర బకాయిలు నిలిచి ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వలస నివారణ కోసం స్థానికంగానే నిరుపేదలకు ఉపాధి కల్పించేందు కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఏడాదికి రూ.200 కోట్ల మేర పనులను అధికారులు చేయిస్తున్నారు. జిల్లాలో 3.33 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 4.15 లక్షల మంది కూలీలు ఉన్నారు. రోజుకు సుమారు లక్ష మంది ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటారు. వీరి ద్వారా చెరువులు, పంట పొలాలు, కుంటలు, కాలువల్లో పూడికతీత వంటి పనులు చేయిస్తున్నారు. ఇలా పనులు చేసిన కూలీలకు ప్రతి వారం వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతోంది. అయితే, మే నెల 21వ తేదీ వరకు వేతనాలు మంజూరు కాగా ఆ తర్వాత నుంచి నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికల నిర్వ హణ తదితర కారణాలతో వేతనాలు ఆగినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కారణాలు ఏవైనా రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దీనిపై పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నిధులు మంజూరయ్యేలా చూడాలని కూలీలు కోరుతున్నారు.

త్వరలోనే వేతనాలు ఇస్తాం

ఉపాధి హామీ పథకం బిల్లులకు సంబంధించి ఇప్పటికే నివేదికలను ప్రభుత్వానికి పంపాము. త్వరలోనే నిధులు మంజూరవుతాయి. నిధులు రాగానే కూలీలకు పూర్తి వేతనాలు అందించడం జరుగుతుంది.

- వెంకట్రావు, డ్వామా పీడీ



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)



నెల్లూరులోని స్కానింగ్ కేంద్రాల్లో అధికారుల తనిఖీలు (ఫైల్)

వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలని వైద్యశాఖ ఆదేశం

నిబంధనలు అతిక్రమిస్తే రూ.30వేల వరకు జరిమానా

లింగ నిర్ధారణ పరీక్షలపై కొరడా

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 7 : గర్భిణుల కడుపులో ఉన్న నవజాత శిశువుల ఆరోగ్య పరిస్థితిని మాత్రమే గుర్తించేందుకు ఏర్పాటైన స్కానింగ్ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖ కొరడా ఝులిపిస్తోంది. దేశంలో భ్రూణ హత్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పూర్తిగా నియంత్రించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం జారీ చేసింది. ఈ మేరకు ఆయా కేంద్రాల్లో స్కానింగ్ చేసిన వారి వివరాలను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో పొందు పరచాల్సి ఉంటుంది. ఫాం ఎఫ్ కింద పీసీపీఎన్ డీటీ వెబ్‌సైట్‌లో ఆ వివరాలన్నీ నమోదు చేయాలి. జిల్లాలో 200 వరకు స్కానింగ్ కేంద్రాలు ఉండగా, ఈ కేద్రారల్లో చేసే స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు. కొన్ని మాత్రమే ఫాం ఎఫ్‌ను నమోదు చేస్తున్నాయి. ఈ క్రమంలో వైద్యాధికారులు ఆయా స్కానింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టారు. విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ పలు హెచ్చరికలు జారీ చేస్తున్నది. అయినా ఇంకా పలు స్కానింగ్ కేంద్రాలు ఆన్‌లైన్‌లో వివరాలు మాత్రం ఉంచడం లేదు. గతంలో పుస్తకాల్లో స్కానింగ్ వివరాలు నమోదు చేసి వైద్య ఆరోగ్యశాఖలోని డెమో విభాగంలో అప్పగించే వారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పరిస్థితిలో అన్ని స్కానింగ్ కేంద్రాలకు అధికారులు నోటీసులు పంపించారు.

● జరిమానా తప్పదు!

పూర్తిస్థాయిలో స్కానింగ్ చేయని కేంద్రాల నిర్వాహకులు భారీ ఎత్తున జరిమానా కట్టాల్సి ఉంటుంది. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్‌కు రూ.25వేల నుంచి 35వేల వరకు ప్రభుత్వానికి చెల్లించాలి. ఇలా జిల్లాలోని 176 స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. అయితే ఆన్‌లైన్‌లో మాత్రం వివరాలు నమోదు చేసుకోవటం లేదన్న వాదన వినిపిస్తోంది. అలా నమోదు చేసుకోని స్కానింగ్ కేంద్రాలపై రిజిస్ట్రేషన్ ఫీజుకు ఐదురేట్లు జరిమానా వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

యథాస్థానాలకు ఎంపీడీవోలు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 7: సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లా నుంచి వివిధ జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవోలందరినీ యథాస్థానాలకు పంపాలని బుధవారం పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఎన్నికలకు ముందు జిల్లాలో పనిచేస్తున్న 32మంది ఎంపీడీవోలను చిత్తూరు, ప్రకాశం, గుంటూరు, కడప జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికల కోడ్ ముగిశాక ప్రభుత్వం వారిని వెనక్కు పంపాల్సి ఉంది. ఈ క్రమంలో వారిని యథాస్థానాలకు పంపాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఒకటి, రెండు రోజుల్లో స్వస్థలాలకు ఎంపీడీవోలు రానున్నారు.

ఆత్మకూరులో పార్కు, ఆటస్థలం రెండూ కరువే!

● పట్టణంలో ఇదీ దుస్థితి

ఆత్మకూరు, ఆగస్టు 7: స్థానిక మున్సిపాలిటీ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో సేదతీరేందుకు ఆహ్లాదకరమైన పార్కులు, మినీ స్టేడియం అందుబాటులో లేకపోవడంతో దశాబ్ధకాలంగా యువత, వృద్ధులు, చిన్నారులు తీవ్ర నిరాశకు గురిఅవుతున్నారు. చిన్నారులకు సైతం ఆటవిడుపు స్థలం లేక ఆహ్లాదం కలిగించే సౌకర్యాలు కొరవడ్డాయి. గతంలో పోలీసుస్టేషన్ సమీపంలోని ఎస్ఎంకె పార్కు నిర్మాణానికి ఓ దాత ఎకరం స్థలం కేటాయించారు. అక్కడ పార్కు నిర్మాణం నోచుకున్న దాఖలాలు లేవు. కాలగమనంలో ఆ స్థలాన్ని తపాలా కార్యాలయానికి కేటాయిస్తున్నట్లు అప్పటి పంచాయతీ పాలకులు తీర్మాణం చేశారు. దీంతో పట్టణ ప్రజలు, చిన్నారులకు ఆటవిడుపు స్థలం కరువైంది. యువత ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు కరువయ్యాయి. రూ.1.32కోట్లతో పార్కు, రూ.2కోట్లతో మినీ స్టేడియం నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.



పార్కుకు కేటాయించిన స్థలం ఇదే..

● ఏడేళ్ల కిందటే పార్కు నిర్మాణం

ఏడేళ్ల క్రితం ప్రస్తుత మంత్రి, అప్పటి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై జరిగిన సమీక్ష సమావేశంలో ప్రస్తావించారు. సమావేశానికి హాజరైన మంత్రి నారాయణ పార్కుల ఏర్పాటుకు కోటి రూపాయల నిధులు మంజూరు చేశారు. మొదటి విడతగా బట్టేపాడు రోడ్డు సమీపంలోని వాటర్‌ప్లాంట్ వద్ద రెండెకరాల స్థలంలో పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. స్థలంను చదును చేసి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. అంతే.. ఇక పనులు ముందుకు సాగలేదు. ఏడేళ్లకు పైబడి పార్కునకు కేటాయించిన స్థలం చిట్టడవిని తలపిస్తోంది.



నిలిచిపోయిన మినీ స్టేడియం

రూ.2కోట్లతో మినీస్టేడియం నిర్మాణం

ఏడేళ్ల క్రితం మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్రావుపల్లి సమీపంలోని గురుకుల పాఠశాల వెనుక మినీ స్టేడియం నిర్మాణానికి ఐదెకరాల స్థలాన్ని కేటాయించారు. రూ.2కోట్ల నిధులు మంజూరైయ్యాయి. శ్రీధర్‌రెడ్డి అనే కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. మొదట పనులు శరవేగంగా జరిగాయి. తదనంతరం స్టేడియం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడం, ఆనం రామనారాయణరెడ్డి మంత్రి పదవి చేపట్టడంతో పట్టణ ప్రజల్లో ఆశలు రేకెత్తించాయి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించి వీటి నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి ఆనం ఆదేశాలతో తీరిన నీటి సమస్య



ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న బోరు

ఆత్మకూరు, ఆగస్టు 7: పట్టణ సమీపంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో ప్రాంగణంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా నీటి అవసరాల కోసం బోరును వేయించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రిన్సిపల్ కోటేశ్వరీ, అధ్యాపకులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి గురుకుల పాఠశాలను సందర్శించినపుడు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు.

హామీని నెరవేర్చిన మేకపాటి

మర్రిపాడు, ఆగస్టు 7: ఎన్నికల ప్రచారంలో మర్రిపాడు ఎస్టీ కాలనీవాసులకు ఇచ్చిన హామీని బుధవారం మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి నెరవేర్చాడు. రాములవారి విగ్రహాలు తయారు చేయించి కాలనీవాసులకు ఆయన సతీమణి టీడీపి ఆర్గనైజింగ్ సెక్రటరి శాంతి కుమారితో కలిసి అప్పగించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి పాలన చేతకాక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడని మండిపడ్డారు. ఆయన వెంట ఉన్న సైన్యమంతా ధన దాహంతో దోపిడీ ఎలా చేయాలన్న తపననే తప్ప ప్రజలకు సేవ చేయాలని ఎపుడే ప్రయత్నం చేయలేదన్నారు.

జోరుగా బెల్టు షాపులు

వింజమూరు, ఆగస్టు 7: పట్టణంలో బెల్టుషాపులు మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలిశాయి. ముఖ్యంగా బంగ్లాసెంటర్, ఆర్టీసీ బస్టాండ్ దేవతా మహల్‌సెంటర్‌లో ప్రతి కూల్‌డ్రింక్ షాపులో బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 10గంటల వరకు మద్యం అధిక రేట్లకు అమ్ముతూ మద్యం ప్రియులకు ఎనీటైం మద్యం అందుబాటులోకి తెచ్చారు. ఇలా మద్యం ప్రియులకు ఎనీటైం మద్యం దొరుకుతు న్నందు వలన గొడవలు, అసాంఘిక కార్యక్రమాలు హెచ్చుమీరుతున్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ రోడ్‌లో బెల్టుషాపులతో ప్రయాణికులకు ఇబ్బందికంగా మారింది. అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ ఆగడాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



సీతారామపురం: పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

సీతారామపురం, ఆగస్టు 7: మండలకేంద్రంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పరిశీలించారు. పనుల వద్దకు వెళ్లి కూలీలు చేయు పనులు, మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ కూలీలతో మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయాన్నే 6.30నుండి 11గంటల వరకు పనిచేయాలన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

కలెక్టర్ ఆదేశాల మేరకు సీతారామపురం, సింగరెడ్డిపల్లి, అయ్యవారిపల్లిలోని సంపద తయారీ కేంద్రాలను ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తనిఖీ చేశారు. కేంద్రాల చెత్త సేగ్రిగేషన్, సంపద కేంద్రల నిర్వహణను పరిశీ లించారు. గ్రామంలో నుంచి సేకరించిన చెత్తను గ్రీన్ అంబాసిడర్లతో గ్రేడింగ్ చేయించి వర్మీకంపోస్టును తయారు చేసి అమ్మేటట్లు చూడాలని కార్యదర్శులకు సూచించారు.

గంగిరెడ్డిపల్లిలో వైద్యశిబిరం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 7: కొండాయపాలెం పంచాయతీలోని గంగిరెడ్డిపల్లిలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ సూచన మేరకు ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి అంజయ్య ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకల్పన రోగులను పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, న్యాయవాదులు సందిరెడ్డి రామారావు, మస్తాన్, సీహెచ్‌వో శివకుమారి పాల్గొన్నారు.



తహసీల్దార్లకు సన్మానం, అభినందనలు

ఆత్మకూరు, ఆగస్టు 7: మండల తహసీల్దారు సుధీర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు, డీలర్స్ అసోషియేషన్ నాయకులు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి పల్లవోలు జయాకర్, తెలుగు యువజన జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, షేక్ షబ్బీర్, మున్సిపల్ కౌన్సిలర్ శివకోటారెడ్డి, ఏపీయుడబ్ల్యుజే జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య, డీలర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.



ఆత్మకూరు: తహసీల్దారును సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఏఎస్ పేట: మండల తహసీల్దారు శివరామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు చెంచులరెడ్డి బుధవారం మర్యాదపుర్వకంగా కలిసి సన్మానించి ప్రధాని నరేంద్రమోదీ ఫొటోను బహూకరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నీలం వీరబ్రహ్మం, మాల్యాద్రి చౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌పేట: తహసీల్దారుకు ప్రధాని ఫొటోను బహూకరిస్తున్న చెంచులరెడ్డి

సంగం: తహసీల్దారు సోమ్లానాయక్‌ను కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువా, పూలమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సుభాషిణి, ఆర్ఐ, సర్వేయర్ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: మండల తహసీల్దారు ఎం.సుభద్ర బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అనంతసాగరం: తహసీల్దారు వీరవసంతరావును స్థానిక టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో చల్లాశివారెడ్డి, శాకమూరి సుబ్బారావు, కేతా శ్రీనివాసులురెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

అనంతసాగరం, ఆగస్టు 7: చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ఆజాదీక అమృత్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సం దర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు, జాతీయ జెండాతో గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, రమణ, మాధవి, మ దీనా, శివకృష్ణ పాల్గొన్నారు.



అనంతసాగరం- చిలకలమర్రిలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఉదయగిరి రూరల్: పట్టణంలో అధికారులు, సచివాలయ సిబ్బంది విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక దళితవాడ పాఠశాల నుంచి ఇండియన్ పెట్రోల్‌బంకు వరకు నినాదా లతో ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ, ఎంఈవో తోట శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు షబ్బీర్, పంచాయతీ కార్యదర్శి కరీముల్లా పాల్గొన్నారు.



ఉదయగిరి ర్యాలీలో పాల్గొన్న అధికారులు

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



ఆత్మకూరు: వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీవో సునీలత

ఆత్మకూరు, ఆగస్టు 7: ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వెన్నవాడ ఎస్సీకాలనీ లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వారోత్సవాలకు ముఖ్య అతిథులుగా సీడీపీవో సునీలత పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ సూపర్‌వైజర్ ఎన్‌.కె.నారాయణమ్మ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వింజమూరు: స్థానిక మాశిలామణి హాస్పిటల్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని సచివాలయం-3లో గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. తల్లులు, గర్భవతులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.



వింజమూరులో..

క్రికెట్ కిట్ అందజేత

సంగం, ఆగస్టు 7: స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలకు రూ.7,500ల విలువ చేసే క్రికెట్ కిట్ ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్యకు అందజేశారు. కార్యక్రమంలో పీడీ అంజయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం పరిశీలన



సంగం: స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత

సంగం, ఆగస్టు 7: స్థానిక తిరుమనతిప్పలో వాటర్ ట్యాంక్ నిర్మాణ అవసరమైన స్థలాన్ని బుధవారం ఆర్డీఓ మధులత పరిశీలించారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి కేంద్ర నిధులతో అమృత -2 పథకంలో సంగం బ్యారేజీ నుంచి పైపులతో బుచ్చిరెడ్డిపాళెంకు తాగునీటిని తరలించనున్నారు. అందులో భాగంగా తిరుమనతిప్పలో వాటర్ ట్యాంకు నిర్మించి బ్యారేజీ నుంచి నీటిని తరలించనున్నట్లు తెలిపారు. తహసీల్దారు సోమ్లానాయిక్, సర్వేయర్ శాంత ఉన్నారు.

45.4 మి.మీ వర్షపాతం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 7: ఉదయగిరిలో బుధవారం తెల్లవారుజామున 45.4 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. ఈ వర్షంతో డ్రైనేజీ కాలువలు పొంగడంతో రహదారులపై చెత్తాచెదారం పేరుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు, ఉద్యానవన పంటలకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

చిట్రగుంట, (దగదర్తి) ఆగస్టు 7: నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రాఘవేంద్ర ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలపై చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఈవో రఘురామయ్యకు మండల విద్యా కార్యాలయంలో బుధవారం స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన ఎంఈఓ భాస్కర్‌తో కలిసి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల భవన అంతస్తులపై విద్యార్థుల రక్షణకు ఏర్పాటు చేయాల్సిన ఇనుప గ్రిల్ లేదని నిర్వాహకులపై మండిపడ్డారు. పాఠశాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

చిట్రగుంట (దగదర్తి) ఆగస్టు 7: దగదర్తి మండలం కేకేగుంట పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఏపీడీ మృదుల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె జూలై 29వ తేది నుంచి ఆగస్టు 7వరకు కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. 30 మంది కూలీలు మాత్రమే హాజరు కావడంపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. జాబ్‌కార్డుల్లో ఉన్నవారు కాకుండా ఇతరులు ఉంటే చర్యలు తప్పవని మేటీలను హెచ్చరించారు. ఆమె వెంట ఏపీవో జ్ఞానప్రకాశ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన గుడ్లూరు సర్పంచి పాలకీర్తి శంకర్, గ్రామస్థులు

గుడ్లూరు సర్పంచి టీడీపీలో చేరిక

కందుకూరు, ఆగస్టు 7: మండల కేంద్రమైన గుడ్లూరు సర్పంచ్ పాలకీర్తి శంకర్ తెలుగుదేశం పార్టీలో చేరారు. సర్పంచ్ శంకర్‌తో పాటు 3వ వార్డు మెంబరు పాలకీర్తి మురళి, పలువురు వైసీపీ కార్యకర్తలు కందుకూరులోని టీడీపీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరడంతో వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయటం జరుగుతుందని, అదే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గుడ్లూరు గ్రామాభివృద్ధికోసం సర్పంచ్ శంకర్‌కు సంపూర్ణ సహాయ సహకారాలు అందించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు దామా వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ రమణమ్మ, పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవయ్య, జంపని ప్రసాద్, కోకా చిరంజీవి, చిత్తారి మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల విధుల నిర్వహణపై దిశానిర్దేశం

కావలి, ఆగస్టు 7: బదిలీల అనంతరం డివిజన్‌లోని అన్ని మండలాలకు నూతన తహసీల్దార్లు రావటంతో వారి విధుల నిర్వహణపై కావలి ఆర్డీవో శీనానాయక్ దిశ నిర్దేశాలను చేశారు. ఆర్డీవో కార్యాలయ చాంబరులో బుధవారం వారితో డిజన్‌స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు ప్రస్తుతం మండలంలో ప్రత్యేకంగా చేయాల్సిన విధులు గురించి వివరించారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మ్యుటేషన్స్, సౌమోటో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు, రీ సర్వే గ్రామాల్లో ఎల్‌పీ నంబర్లతో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలో తహసీల్దార్లకు వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శీనానాయక్

మండల్ కమిషన్ నివేదిక సిఫార్సులు అమలు చేయాలి

కందుకూరు, ఆగస్టు 7: మండల్ కమిషన్ నివేదికలోని అంశాలన్నింటినీ అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కల్లగుంట మోహనరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మండల్ కమిషన్ నివేదిక సమర్పించి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా స్థానిక బీటీఏ కార్యాలయంలో బుధవారం మండల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన ఆధారంగా మాత్రమే బీసీలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు షేక్ అబ్దుల్లా,వల్లై వెంకటరావు, టి గంగయ్య, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కొప్పుల ఆదాము పాల్గొన్నారు.

కందుకూరు తహసీల్దార్‌గా సయ్యద్ ఇక్బాల్

కందుకూరు, ఆగస్టు 7: స్థానిక తహసీల్దార్‌గా సయ్యద్ ఇక్బాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ ఇక్బాల్

గుడ్లూరు తహసీల్దార్‌గా స్వర్ణ

గుడ్లూరు, ఆగస్టు 7: నూతన తహసీల్దార్‌గా జి స్వర్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మండలంలో రెవిన్యూ రెవిన్యూ సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది శ్రీనివాసులు, హరిబాబు, అంజలయ్య తదితరులు పాల్గొన్నారు.



గుడ్లూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న స్వర్ణ

సాయిపేటలో విగ్రహాల ప్రతిష్ఠ

కొండాపురం, ఆగస్టు 7: సాయిపేట గ్రామంలో పలువురు భక్తుల సహకారంతో రజకులు ఏర్పాటు చేసుకున్న అంకమ్మ అమ్మవారు, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే వేడుకలో మొదటిరోజ శ్రీమహాగణపతి పూజ, వరుణపూజ, తీర్థానయమ్, అఖండల ప్రజలన, ప్రధానకలశ, కర్కరి, వర్ధని, వరుణ కలశ స్థాపనలు తదితర పూజలు చేసి మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య యాగశాలకు విగ్రహాన్ని చేర్చారు. అనంతరం శ్రీవిశ్వకర్మాది పంచబ్రహ్మ మండల, వాస్తుమండల, యోగిని మండల, క్షేత్రపాలక మండల, నవగ్రహ మండల దేవతా ఆవాహన, గ్రామదేవత ఆవాహన తదితర పూజలు చేశారు. పూజల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను పండితులు భక్తులకు అందజేశారు.

రమణయ్య నాయుడికి పరామర్శ

చిట్రగుంట, (దగదర్తి) ఆగస్టు 7: దగదర్తి మండ లానికి చెందిన మాజీ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాళ్లూరి రమణయ్య నాయుడును బుధవారం కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది వచ్చిన ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో దగదర్తి ఎంపీపీ తాళ్లూరి వెంకట ప్రసాద్ నాయుడు, సర్పంచు చల్లంచర్ల శీనయ్య, చెన్నూరు మాజీ సర్పంచు విజయ్, వెంకటకృష్ణ, రవి, శీనయ్య తదితరులు ఉన్నారు.



తాళ్లూరి రమణయ్య నాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు లింగసముద్రం విద్యార్థులు

లింగసముద్రం, ఆగస్టు 7: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం వీరిని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు, ఫిజికల్ డైరెక్టర్ మంగతాయారు, ఉపాధ్యాయులు అభినందించారు. హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన అభినందన కార్యక్రమంలో హెచ్ఎం మాధవరావు మాట్లాడుతూ ఈనెల 6న ఒంగోలులోని ఏబీఎం కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెలక్షన్స్‌లో తమ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న సీహెచ్ వెంకటేష్, పి ప్రతిమ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ఉపాధ్యాయులు ఎం కొండయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, మస్తాన్‌వలి, అనంతలక్ష్మి, విద్యార్థులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం మాధవరావు

సర్పంచి, కార్యదర్శులకు శిక్షణ

జలదంకి: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజులు శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర బుధవారం తెలిపారు. గురు, శుక్ర, శనివారాల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశహాలులో వీరికి శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు మండలంలోని 17పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

కక్ష సాధింపు చర్యలు సహించం

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలిటౌన్, ఆగస్టు 7: కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించమని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జర్నలిస్ట్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వైసీపీ నేతలతో కలిసి మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయలేకపోతున్నారని ఆరోపించారు. కావలి అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ట్రంకు రోడ్డు వెడల్పు పనులు డివైడర్ సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనుల ప్రణాళికతో ప్రారంభిస్తే మిగిలిన పనులు పూర్తిచేయలేకపోయామన్నారు. నూతన ప్రభుత్వంలో ఎమ్మెల్యే అసంపూర్తిగా మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందాలని అందుకు తాను పూర్తిగా తనవంతు సహకారమందిస్తానన్నారు. అక్రమ లేఅవుట్లలోని 120ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా అయ్యిందని ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణల్లో పసలేదన్నారు. అన్యాక్రాంతమైన భూములెక్కడనున్నాయే ఎవరు ఆక్రమించారో ఆర్డీవో పర్యవేక్షణలో నిగ్గుతేల్చి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, బీద రమేష్, సాయికుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై శిక్షణ

కావలి రూరల్, ఆగస్టు 7: స్థానిక మండల కార్యాలయంలో పారిశుధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణపై గురువారం నుంచి శిక్షణ ఇస్తున్నట్లు ఎమ్పీడీవో శ్రీధర్‌బాబు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరై గ్రామ పంచాయతీల అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి అల్పాహారం, భోజన వసతి కల్పిస్తామన్నారు.

ఆయుర్వేద వైద్యశాల ప్రారంభం

కావలి, ఆగస్టు 7: పట్టణంలో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. రెండోవార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుర్వేద వైద్యశాలను ప్రారంభించారు. అనంతరం వైద్యశాలలో అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముసునూరు ఆటోనగర్‌లోని విలేజి మిల్క్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. నాణ్యమైన వసువులను వినియోగదారులకు అమ్మి గుర్తింపు తెచ్చుకో వాలన్నారు. పాతూరులోని టీడీపీ బీసీసెల్ నాయకుడు బొంతా శ్రీనివాసులు మనవరాలి బారసాల కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. స్థానిక 36వ వార్డు చేవూరివారితోటలో యేటూరి రామిరెడ్డి సతీమణి వెంకట సుబ్బమ్మ మృతి చెందటంతో ఆమె పార్థివదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

వలేటివారిపాలెం, ఆగస్టు 7: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత బొంతవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వ హించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

కొండాపురం: అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు, గర్భవతులకు సూచించారు. గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ పి.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.మ మత, ఎమ్.శ్రీదేవి, టీ.సుల్తానమ్మ, బి.సుబ్బరత్నం, ఎమ్. మౌనిక, కె.వరమ్మ, విజయలక్ష్మి, ఎమ్.ఎస్.కె , జె.అనూరాధ, ఆశా కార్యకర్త స్వాతి పాల్గొన్నారు. కొమ్మిపాలెంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్. గోపీచందన, హెల్పర్ కె.కొండమ్మ పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాపై అవగాహన ర్యాలీ

అల్లూరు, ఆగస్టు 7: మండల కేంద్రంలో సాయంత్రం అధికారులు హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఎంపీడీఓ జ్యోతి ఆధ్వర్యంలో విద్యాధికారి రవీంద్రనాథ్ ఇస్కపల్లి జడ్పీ హైస్కూలు, అల్లూరు రామకృష్ణా డిగ్రీ కళాశాల, పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. బాలలు చేసిన ప్రత్యేక నాటికలు, నృత్యాలు, పాటలు అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశంపై ప్రతిఒక్కరికీ భక్తిని పెంపొందించడమే దీన్ని ఉద్దేశ్యం అన్నారు.

గ్రామీణాభివృద్ధిపై శిక్షణ తరగతులు

అల్లూరు, ఆగస్టు 7: గ్రామీణాభివృద్ధికి అనుసరించే పలు అంశాలపై ఈనెల 8 నుండి 10 వరకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమానికి కార్యదర్శులు, సర్పంచ్‌లు విధిగా హాజరవ్వాలని పేర్కొన్నారు.

నేడు విద్యా కమిటీ చైర్మన్ల ఎంపిక

చిట్రగుంట, ఆగస్టు 7: బోగోలు మండలంలోని 57 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరుగనున్న విద్యాకమిటీ చైర్మన్ల ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు ఎంఈవోలు నరసింహారావు, జయమ్మలు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల్లో ప్రధానోపాధ్యాలు, ఉన్నత పాఠశాల్లో పరిశీలకుల ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహిస్తామని బుధవారం వారు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లితండ్రులు తరగతి కమిటీ సభ్యులను ఎంపిక చేసిన అనంతరం వారితో ఎంపికైన కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మను ఎన్నుకుంటారని తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.